శనివారం
02 ఫిబ్రవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 314

www.vijayakranthinews.com

విజయక్రాంతి

సచిత్ర సకుటుంబ దినపత్రిక

హైదరాబాద్ | CIRCULATED IN TELANGANA STATE | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



వెంకటలక్ష్మి సిత్రాలు 10



త్రిపుల్ ధమాకా!

అందరూ ఊహించినట్టుగానే ఎన్నికల వేళ కేంద్రం ప్రవేశపెట్టిన 2019–20 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రజాకార్షక పథకాలకు పెద్దపీట వేసింది. అన్ని వర్గాల ఓటర్లను ఆకట్టుకునేవిధంగా సంచలన మధ్యంతర బడ్జెట్‌ను ప్రజల ముందుకు తెచ్చింది. ఇన్‌చార్జ్ ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న పియూష్ గోయల్ శుక్రవారం లోక్‌సభలో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ ఆర్థిక చిట్టాలో ఆద్యంతం ఓటర్‌ను సంతృప్తి పరిచేలా ప్రతిపాదనలు చేశారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లపై వరాల జల్లు కురిపించారు. ముఖ్యంగా మధ్యతరగతి వేతనజీవులు, రైతులు, అసంఘటిత రంగ కార్మికులు, అంగన్వాడీ టీచర్లు.. ఇలా అన్ని వర్గాలను ఆకర్షించేవిధంగా.. గోయల్ తన బడ్జెట్లో తాయిలాలు కురిపించారు. పన్ను మినహాయింపులతో పట్టణ ప్రాంత ప్రజలను, వేతన జీవులను ఆకట్టుకున్న మోదీ ప్రభుత్వం, గ్రామీణ రంగంలో రైతులకు ఊరట ఇచ్చేలా నగదు సాయం పథకం ప్రకటించింది. వేతన జీవులకు రూ.5 లక్షల వరకు పన్ను మినహాయింపు, రైతులకు ఏడాదికి రూ.6వేలు పెట్టుబడి సాయం వంటి పథకాలు ప్రవేశపెట్టారు. ఇక ఎస్సీ, ఎస్టీ సంక్షేమం కోసం రూ. 76,800 కోట్లను బడ్జెట్లో కేటాయించిన మోదీ సర్కార్, దళితులను అత్యంత వెనుకబడిన వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. మొత్తంగా మధ్యంతర బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం మూడు వర్గాలకు మేలు చేకూర్చింది. సమాజంలో మెజారిటీ ప్రజల కిందకు వచ్చే సామాన్య, మధ్య తరగతికి చెందిన రైతులు, వేతన జీవులు, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమంపై ప్రధానంగా దృష్టి పెట్టింది. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'రైతు బంధు' తరహాలో 'కిసాన్ సమ్మాన్' పథకం రూపొందించింది. దీంతో ఇది నూటికి నూరుశాతం ఎన్నికల బడ్జెట్‌ను తలపించేలా గోయల్ చిట్టాపద్దులున్నాయని అంతా విశ్లేషిస్తున్నారు.



- ఎన్నికల వేళ ప్రజాకార్షక పథకాలకు పెద్దపీట
- మూడు వర్గాలకు మేలు చేసిన మోదీ ప్రభుత్వం
- రైతులు, వేతన జీవులు, అసంఘటిత రంగ కార్మికులకు వరం
- తెలంగాణలో అమలవుతున్న రైతు బంధు తరహాలో కిసాన్ సమ్మాన్ పథకం
- రైతులకు ఏడాదికి రూ.6వేలు పెట్టుబడి సాయం
- వేతన జీవులకు రూ.5 లక్షల వరకు పన్ను మినహాయింపు
- 60ఏళ్లు నిండిన వారికి రూ.3వేలు పింఛన్
- ఎస్సీ, ఎస్టీ సంక్షేమం కోసం రూ. 76,800 కోట్లు
- లోక్‌సభలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన పియూష్ గోయల్

సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్

45 కోట్ల మందికి లబ్ధి చేకూర్చే పథకాలు

1. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి	12 కోట్ల మంది రైతులకు లబ్ధి
2. ప్రధాన్ మంత్రి శ్రమయోగి మంథన్ (అసంఘటిత రంగ కార్మికులకు పింఛన్ పథకం)	10 కోట్ల మంది కార్మికులకు లబ్ధి
3. రూ. 5 లక్షల వరకూ ఆదాయపన్ను మినహాయింపు	3 కోట్ల మంది ఉద్యోగులకు లబ్ధి
4. ప్రధాన్ మంత్రి కామధేను సంరక్షణ్ స్కీం, మత్స్యపాలన్ యోజన	2 కోట్ల మంది లబ్ధిదారులు
5. ప్రధాన మంత్రి ఈపీఎఫ్ స్కీం, ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన (ఉచిత గ్యాస్ స్కీం)	8 కోట్ల మంది పేదలు
6. ఆయుష్మాన్ భారత్ యోజన	10.74 కోట్ల మంది లబ్ధిదారులు

విజయక్రాంతి, న్యూఢిల్లీ: ఎన్నికలు సమీపిస్తున్న వేళ పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు చేకూర్చేలా కేంద్రం బడ్జెట్లో వరాలు కురిపించింది. మరికొన్ని రోజుల్లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలిక బడ్జెట్‌ను మాత్రమే కేంద్రం ప్రవేశపెట్టింది. మధ్యంతర బడ్జెట్‌ను ఎన్నికల సన్నాహక బడ్జెట్‌గా కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. ఇన్‌చార్జ్ ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం లోక్‌సభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రణాళిక వ్యయం రూ 3.36 లక్షల కోట్లుగా పేర్కొన్న ఆయన ప్రభుత్వ వ్యయం 13.3 లక్షల కోట్లకు పెరిగిందని వెల్లడించారు. ప్రధానంగా ఎస్సీ ఎస్టీ సంక్షేమానికీ ప్రాధాన్యత కల్పించిన ప్రభుత్వం ఈ రంగానికి రూ 76.800 కోట్ల కేటాయింపులు జరిపినట్లు వివరించారు. బడ్జెట్ ప్రవేశానికి ముందు అమెరికాలో చికిత్స పొందుతున్న కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో సుదీర్ఘకాలం దేశానికి సేవ చేయాలని, ఆయన ఆరోగ్యం సత్వరమే కుదుటపడాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. దీనికి సభ యావత్తు సంఘీభావం ప్రకటించింది. అనంతరం పీయూష్ గోయల్ తాత్కాలిక బడ్జెట్‌పై ప్రసంగించారు. సుస్థిర, సమ్మిళిత వృద్ధి కొనసాగింపు లక్ష్యంతో బడ్జెట్‌ను రూపొందించినట్లు పీయూష్ గోయల్ తెలిపారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

మోదీ సారథ్యంలో సుస్థిర పాలన

నాలుగున్నరేళ్ళలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశాన్ని ముందంజలో నడిపిందని గోయల్ అన్నారు. మోదీ సారథ్యంలో సుస్థిర పాలన అందిచామన్నారు. వృద్ధిరేటులో 11వ స్థానంలో ఉన్న భారత్ 6వ స్థానానికి చేరిందన్నారు. అందరికీ ఇళ్లు, మరుగుదొడ్లు, విద్యుత్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు కృషిచేస్తున్నామన్నారు. మనది అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశమన్నారు. ప్రపంచంలోనే భారత్ ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ దూసుకుపోతోందన్నారు. విధాన నిర్ణయాల్లో వేగం పెంచామన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ మళ్ళీ గాడిలో పడిందన్నారు. మోదీ సర్కార్ దేశ ఆత్మవిశ్వాసాన్ని మెరుగుపరిచిందన్నారు. యూపీయే హయాంలో 10.9 శాతం ఉన్న ద్రవ్యోల్బణాన్ని తమ ప్రభుత్వం తగ్గించిందని తెలిపారు. ద్రవ్యలోటును 3.4 శాతానికి తగ్గించామన్నారు. దేశం ఆరోగ్యంగా, పరిశుభ్రంగా ఉండాలని ఆకాంక్షించారు. 2022లోగా నవ భారత్‌ను చూడబోతున్నామని చెప్పుకొచ్చారు. ధరల నడ్డివిరిచి సామాన్యుడికి ఊరట కల్పించామన్నారు. అవినీతిరహిత పాలనను తీసుకువచ్చామన్నారు. నాలుగేళ్లలో 1.53 కోట్ల ఇళ్లు నిర్మించామన్నారు.

రూ 3 లక్షల కోట్ల మొండి బకాయిలు రాబట్టాం

తమ ప్రభుత్వం అవినీతి రహిత ప్రభుత్వమని గోయల్ అన్నారు. రేరా చట్టం ద్వారా బినామీ లావాదేవీలను నిరోధించగలిగినట్లు ఆయన తెలిపారు. తమ ప్రభుత్వ పాలన దేశంలో ప్రతి ఒక్కరి ఆత్మ విశ్వాసాన్ని పెంచిందన్నారు. మా ప్రభుత్వం ప్రతి కార్యక్రమాన్ని నిజాయతీగా అమలు చేస్తోందన్నారు. దేశ జీడీపీ వృద్ధిరేటులో గణనీయ పురోగతి సాధిస్తున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. సంస్థాగతమైన ఆర్థిక సంస్కరణలలో ముందుకు సాగుతున్నామన్నారు. రికార్డు స్థాయిలో ఎఫ్డీఐలు భారత దేశానికి వచ్చాయన్నారు. జీఎస్టీ సహా పన్నుల వ్యవస్థల్లో సంస్కరణలు అమలు చేస్తున్నామని, ద్రవ్యోల్బణం 4.6 శాతానికి తీసుకొచ్చామన్నారు. కరెంట్ ఖాతా లోటు 2.5 శాతం ఉందని తెలిపారు. పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్లను దేశానికి తిరిగి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నాం. గ్రామీణ భారతంలో 98శాతం మరుగుదొడ్లు నిర్మించాం. రుణాలను చెల్లించని రుణగ్రస్థుల నుంచి రూ.3 లక్షల కోట్లు తిరిగి రాబట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సొమ్మును బ్యాంకులకు సమకూర్చామన్నారు. బ్యాంకింగ్‌ను ప్రక్షాళన చేసినట్లు పేర్కొన్నారు. అధిక వృద్ధి సాధించేందుకు (తరువాయి 4లో)

బడ్జెట్ హైలైట్స్

- స్టాండర్డ్ డిడక్షన్ రూ. 40,000 నుంచి రూ. 50,000లకు పెంపు
- 'పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ టీడీఎస్ పరిమితి రూ. 10,000 నుంచి రూ. 40,000లకు పెంపు
- సెక్షన్ 80 సి కింద రూ. 1.5 లక్షలు పెట్టుబడి పెడితే.. రూ. 6.5 లక్షల ఆదాయం వరకు పన్ను లేనట్లే
- ఐటీ మినహాయింపుతో మూడు కోట్ల మందికి లబ్ధి
- ప్రభుత్వంపై భారం రూ. 18,500 కోట్లు

- ఇంటి అద్దె ద్వారా వచ్చే ఆదాయంపై రూ. 2.4 లక్షల వరకు టీడీఎస్ ఉండదు..
- ఇన్‌కం ట్యాక్స్ పరిమితి పెంపు
- వార్షిక ఆదాయం రూ.5 లక్షల వరకు ట్యాక్స్ లేదు
- 2022 నాటికి ప్రతి ఒక్కరికి ఇళ్లు
- దేశవ్యాప్తంగా ప్రతి ఇంటికీ విద్యుత్ సౌకర్యం
- అత్యంత వెనుకబడిన 150 జిల్లాలపై ప్రత్యేక దృష్టి
- దేశంలో ప్రస్తుతం 21 ఎయిమ్స్, త్వరలోనే హరియాణలో 22వ ఎయిమ్స్
- అంగన్‌వాడీ టీచర్ల జీతం 50 శాతం పెంపు
- 2030 నాటికి భారత్‌లో ఎలక్ట్రానిక్ వాహనాలు
- 24 గంటల్లోనే ఐటీఆర్ ప్రాసెస్ రీఫండ్
- ఆదాయపన్ను శ్లాబులో మార్పులేదు
- భారతీయ సినిమాల నిర్మాణం అనుమతి కోసం సింగిల్ విండో విధానం
- జీఎస్టీ విధానంతో ఉత్పత్తిదారులు, వినియోగదారులకు ప్రయోజనం
- ఎక్కువ వస్తువులు 0,5 శాతం శ్లాబుల్లోనే
- ఇళ్ల కొనుగోలుదారులకు జీఎస్టీ మినహాయింపుపై త్వరలో నిర్ణయం
- మంత్రి వర్గ ఉపసంఘం నివేదికను జీఎస్టీ మండలి ముందు ప్రవేశపెట్టి తుది నిర్ణయం
- 50 రెట్లు పెరిగిన మొబైల్‌లో డేటా వినియోగం
- డిజిటల్ రంగంలో మౌలిక సదుపాయాల కల్పన
- జన్‌ధన్ ఆధార్, మొబైల్, డైరెక్ట్ ట్రాన్స్‌ఫర్‌లు కీలకం
- ప్రపంచంలోనే డేటా, ఫోన్ ఛార్జీలు భారత్‌లో తక్కువ
- ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.12 లక్షల కోట్లు. 2014లో ఈ వసూళ్లు రూ. 6.38 లక్షల కోట్లు ట్యాక్స్ రిటర్న్ 24 గంటల్లో ప్రాసెస్ చేసి... వెంటనే రీఫండ్.

రైతాంగానికి



- డిసెంబర్ 1, 2018 నుంచి 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పథకం అమలు
- పశు సంవర్ధశాఖ, మత్స్య రంగానికి 2 శాతం వడ్డీ తిరిగి చెల్లింపు
- దేశవ్యాప్తంగా 12 కోట్ల మంది రైతులకు లబ్ధి
- ఈ ఏడాదే రైతులకు రూ.20 వేల కోట్లు చెల్లింపు
- ఏడాదికి రూ.75 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా
- పథకం కింద రూ.6వేలు, మూడు విడతలుగా 2వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ
- 201920 ఆర్థిక సంవత్సరంలో పనికి ఆహారపథకం (నరేగా) కింద రూ. 60,000 కోట్లు కేటాయింపు

భారత రైల్వేలు



- భారతీయ రైల్వేలకు రూ. 64,500 కోట్లు కేటాయింపు
- బ్రాడ్‌గేజ్‌లో కాపలాలేని లెవల్ క్రాసింగ్ల తొలగింపు
- సాగర్‌మాల ల కింద పోర్టుల ద్వారా సరుకు రవాణా
- బ్రహ్మపుత్ర ద్వారా ఈశాన్య రాష్ట్రాలకు సరుకు రవాణా
- ఆవుల రక్షణకు ప్రత్యేక పథకం
- కిసాన్ క్రెడిట్ కార్డు కింద రుణాలు
- పాడి, మత్స్య రైతుకు 2 శాతం వడ్డీకే రుణాలు
- పీఎం కౌషల్ యోజన కింద కోటిమంది యువతకు శిక్షణ
- దేశవ్యాప్తంగా 9 ప్రాంతాల్లో కృత్రిమ మేధా సెంటర్లు
- 2019–20లో రైల్వే బడ్జెట్ రూ. 64,576 కోట్లు
- రక్షణ రంగానికి రూ.3 లక్షల కోట్లు కేటాయింపు
- అవసరమైతే మరిన్ని నిధులు ఇవ్వడానికి కూడా సిద్ధం
- 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వన్ మ్యాన్ వన్ పెన్షన్ అమలు
- ఓఆర్‌ఓపీ కింద సైనికులకు ఇప్పటికే రూ. 35000 కోట్లు చెల్లింపు
- రూ.3లక్షల కోట్లను దాటిన రక్షణ బడ్జెట్
- ప్రతి రోజూ 27 కి.మీ. హై వేలను నిర్మిస్తున్న ఏకైక దేశం ప్రపంచంలో భారత్
- గ్రాట్యుటీ పరిమితి రూ. 10 లక్షల నుంచి రూ. 30 లక్షలకు పెంపు
- ప్రధానమంత్రి శ్రమయోగి బంధన్ పేరుతో అసంఘటిత కార్మికులకు పెన్షన్
- 60ఏళ్లు నిండిన వారందరికీ ప్రతీ నెలా 3 వేలు పెన్షన్ వచ్చే విధంగా పథకం
- నెలకు 100 చొప్పున ప్రీమియం చెల్లిస్తే 60 ఏళ్ల తర్వాత.. రూ.3 వేల పెన్షన్
- అసంఘటిత రంగంలోని 10 కోట్లమంది కార్మికులకు ఈ పథకం వర్తింపు
- ఉజ్వల స్కీమ్ కింద 6 కోట్ల ఉచిత గ్యాస్ కనెక్షన్లు
- పెన్షన్ స్కీమ్ కోసం రూ.500 కోట్లు కేటాయింపు
- అసంఘటిత రంగ కార్మికులకు మెగా పెన్షన్ స్కీమ్
- కొత్త పెన్షన్ విధానం సరళీకరణ
- పెన్షన్‌లో ప్రభుత్వ వాటా 14 శాతానికి పెంపు
- కార్మికులు, కూలీల కోసం ప్రత్యేక పథకాలు
- ఈపీఎఫ్‌వో సభ్యుల సంఖ్య రెండేళ్లలో 2 కోట్లు పెరుగుదల
- కార్మిక ప్రమాద బీమా మొత్తం.1.50 లక్షల నుంచి .6లక్షలకు పెంపు





శ్రీ వికారి నామ సంవత్సరం	
ఉత్తరాయణం	
హేమంత ఋతువు	
పుష్య మాసం	


సూర్యోదయం	: ఉ. 06:47	కరణం	: గరజ 08:06 వణిజ 21:18
సూర్యాస్తమయం	: సా. 06:11	రాహుకాలం	: ఉ. 09:40, మ. 11:15
పక్షము	: కృష్ణ పక్షం	యమగండం	: మ. 01:54, 03:18
తిథి	: త్రయోదశి 21:18	వర్జ్యం	: సా. 07:51, 09:38,
నక్షత్రం	: పూర్వాషాఢ 23:55	అమృతకాలం	: సా. 06:34, 08:21
యోగం	: వజ్ర రాత్రి మొత్తం		



సూక్తి సుధ

దృఢ సంకల్పంతో, పట్టుదలతో చేపట్టిన పని చేస్తూపోతే తప్పకుండా విజయం మనదే

- యోగి వేమన



వివిధ గ్రంథాల సంకలనం

వేద విజ్ఞానం
భాగం-89

సంకలనం చేసిన దిగువ పేర్కొనబడిన గ్రంథాలు

1. శక.1800లో దీర్ఘవృత్తలక్షణము' – ఇందులో గ్రహణముల లక్షణములు, సిద్ధాంతాన్ని వివరించారు.
2. శక. 1801లో 'విచిత్రప్రశ్న' – ఇందులో గణితానికి సంబంధించిన 20 క్లిష్టమైన సమస్యలు, వాటి సమాధానములు తెలియ చేయబడ్డాయి.
3. వాస్తవ చంద్ర శృంగోన్నతి సాధన – లల్ల, భాస్కర, జ్ఞానరాజ, గణేశ, కమలాకర, బాపుదేవ వీరు తెలియచేసిన శృంగోన్నతి సాధన లోని ఇబ్బందులు, పాశ్చాత్య విధానములో తెలియచేసిన పద్ధతులను అనుసరించి ఖచ్చితమైన శృంగోన్నతి సాధన, ఇందులో 92 శ్లోకములలో చెప్పబడింది.
4. శక.1804లో 'ధ్రువర చార' – ఆధునిక పాశ్చాత్య ఖగోళ విజ్ఞాన శాస్త్రమును అనుసరించి గ్రహ కక్ష్యలను వివరించింది.
5. శక.1807లో పిండ ప్రభాకరమనే వాస్తు గ్రంథాన్ని సంకలనం చేసారు.
6. 'భాభ్రమరేఖా నిరూపణ' – ఇచ్చిన నీడకు సూచి ఛేదన చేసే విధానం చెప్పబడినది.
7. 'ధరాభ్రమ' – ప్రతి దిన భూభ్రమణం గురించి వివరణ అందించింది.
8. గ్రహణ కరణం – గ్రహణాన్ని గణితం చేసే విధానం
9. గోళీయ రేఖాగణితం
10. యూక్లిడ్ 6,11,12 గణిత గ్రంథాలకు సంస్కృతంలో అనువాదాన్ని అందించారు.
11. శక 1812లో గణక తరంగిణి – ఇందులో హిందూ ఖగోళ శాస్త్రవేత్తలను గురించి చెప్పబడింది. ఇది వారణాసిలో మాస పత్రిక పండిట్ లో వ్యాసములుగా వచ్చి, తర్వాత 124 పేజీలతో అక్టోబర్ సైజులో శక.1814లోముద్రించబడింది. పైన తెలియచేసిన గ్రంథములు అన్నీ ముద్రించబడ్డాయి. ఇవి కాకుండా, మరికొన్ని గ్రంథములను పరిష్కరించడం, లేదా, వానికి వ్యాఖ్యానములు రాయడం జరిగింది.

–డా|| రేమెళ్ల అవధానులు

గుణహీనునకు ధనం ఇవ్వరాదు


చాణక్యం

శ్లో|| విత్తం దేహి గుణాన్వితేషు మతిమాన్నాన్యత్ర దేహి క్వచిత్
ప్రాప్తం వారినిధేర్జలం ఘనముఖే మాధుర్యయుక్తం సదా!
జీవాన్ స్థావరజంగమాంశ్చ సకలాన్ సంజీవ్య భూమండలం
భూయః పశ్య తదేవ కోటి గుణితం గచ్ఛన్త మమ్భోనిధిమ్!!

బుద్ధిమంతుడా! మంచి గుణములు గల వానికే ధనము ఇమ్ము. ఎన్నడును గుణహీనునకు ధనం ఈయరాదు. సముద్రంలోని ఉప్పునీరు మేఘములలో చేరి తియ్యని జలముగా మారును. ఆ జలం భూమండలంలోని చరాచరములను, జీవులను బ్రతికించినదియే కోటి రెట్లు అయి సముద్రంలో కలుస్తున్న దానిని చూడుమని చాణక్యుల వారు తమ నీతిశాస్త్రంలో తెలియచేస్తున్నారు. ఇంకా వివరంగా చెప్పాలంటే మేఘం సముద్రంలోని ఉప్పు నీటిని తీసుకుని తియ్యగా మార్చి ఎట్టు జీవన హేతువు అవుతుందో అదే విధంగా గుణవంతులకు ఇచ్చిన ధనం పరోపకారమవుతుంది. గుణహీనులకు ఇచ్చిన ధనం మద్యమాంసాలకు, చెడు వ్యసనాలకు ఉపయోగించబడి వ్యర్థమవుతుంది. అందువల్ల ధనాన్ని గుణవంతులకే ఇవ్వాలంటున్నారు. పై శ్లోకంలో ధనాన్ని ఎటువంటి వారికి ఇవ్వాలో అన్న అంశంలో సద్వినియోగం చేసుకునే వారికి ఇవ్వాల్సి ఉంటుందని తెలియచేస్తున్నారు. అలా ధనాన్ని ఇచ్చినయెడల ఆ ధనం సద్వినియోగం అవుతుందంటున్నారు. అదే విధంగా చెడు అలవాట్లకు బానిసలైనవారికి, అంటే మద్యం మాంసం భక్షణకు ధనం వినియోగించడం వల్ల ఆ ధనం బూడిదలో పోసిన పన్నీరు వలె అవుతుందని చాణక్యుల వారు తమ నీతిశాస్త్రంలో మనకు తెలియపరుస్తున్నారు. దీనికి పైన ఉదాహరణగా ఒక విషయాన్ని వివరిస్తున్నారు. ఉప్పు నీరు మనకు ఎందుకు పనికిరాదు, కనీసం తాగటానికి కూడా పనికిరాదు. అలాంటి ఉప్పునీటిని మేఘాలు గ్రహించి మనకు వర్షం రూపంలో కురియటం వల్ల ఆ నీరు అనేకమందికి దాహార్తిని తీరుస్తుంది. అందుకనే గుణవంతునికే ధనం ఇస్తే అతను చెడు వ్యసనాలకు ఖర్చు పెట్టకుండా మంచిగా సద్వినియోగం చేసుకుంటారని అంటున్నారు.

– యామిజాల సుబ్రహ్మణ్యం

'కర్తురాజ్ఞయా ప్రాప్యతే ఫలం'



దాదాపు పది నెలల క్రితం కృష్ణభిక్షువు 'కథ అస్తి' అన్నపద్యములకు రాసి ఇచ్చి నన్నడించి, దేశాటన చేస్తే శాంతి కలుగునా అని యోచిస్తున్నారు. భగవద్దాజ్ఞ ఎలా ఉందోనని నాకొక జాబు రాశారు. భగవాన్‌తో మనవి చేశాను. భగవాన్ చికితులై, 'ఆ, అట్లనా? అంతా తీర్మానం చేసేశారా?' అని రవంత నిదానించి 'వారి వారి కర్మానుసారం నడుస్తుంది' అన్నారు మళ్లీ. ఇదయ్యా సమాచారమని వారికి రాస్తే 'కర్తు రాజ్ఞయా ప్రాప్యతే ఫలం' అన్నారు గదా. ఆ కర్తయెవ్వరమైనున్నదు? అని మళ్లీ జాబు. ఈసారి భగవాన్‌తో మనవి చేయటానికి సంకోచించి ఏం రాద్దామా అని యోచిస్తుంటే, మర్నాడే ఒక భక్తుడు 'కర్తురాజ్ఞయా ప్రాప్యతే ఫలం అన్నారే ఆ కర్త యెవరు?' అని భగవానులను ప్రశ్నించాడు. 'కర్త ఈశ్వరుడే.ఉదని చేరు. ఈతడు వారి వారి కర్మానుసారం ఫలాలిస్తాడు. ఒక ఏజంటన్నమాట. పనిని బట్టి బత్తెమిస్తాడు. అంతే, ఆ ఈశ్వరశక్తి లేనిదే ఈ కర్త నడవదు. అందుకే 'కర్మజడం' అంటారు పెద్దలు. ఇదే తాత్పర్యం' అన్నారు భగవాన్. వారి ప్రశ్నకింతకంటే జవాబేముంది? అదే కృష్ణభిక్షువుకు రాశాను. విక్రమార్కుడు పాదరక్షల ప్రభావం వల్ల బ్రహ్మలోకానికి వెడితే బ్రహ్మదేవుడు సంతసించి వరం కోరుకోమన్నాడట. 'అయ్యా, మీరు సృష్టించేటప్పుడు వారి వారి కర్మానుసారం ఫలితాలన్నీ నుదుట రాస్తారనీ, ఆ రాత తప్పదని, శాస్త్రాలు ఘోషిస్తున్నవి. ఇప్పుడు నాకు వరాలిస్తానంటారు. నుదుటి రాత చెరిపి మళ్లీ రాస్తారా? లేక దానిపైన దిద్దుతారా? ఏమిటి కథ' అన్నాడట విక్రమార్కుడు. బ్రహ్మ అతని వివేకానికి సంతసించి చిరునవ్వుతో 'ఏమీ లేదోయ్. వాళ్ళ వాళ్ళ కర్మానుసారం ఏది ప్రాప్తమో అదే వాళ్లు పొంద వస్తుంది. ఆహా ఇచ్ఛామంటామూ. అంతే, కొత్తగా ఇచ్చేదేమీ లేదు. ఇది గ్రహించలేక వరము లక్షి తపస్సు చేస్తారు. నీవు వివేకివి గనుక పట్టం కనుక్కున్నావు. చాలా సంతసం కలిగింది' అని చెప్పి బ్రహ్మదేవుడు బహుమతిగా ఇచ్చి పంపాడట. చిన్నప్పుడెప్పుడో చదివాను. భాగవతం దశమ స్కంధంలో ఇంద్రపరమైన యాగం మానిపించే నిమిత్తం నందుడికి కృష్ణుడు బోధించిన పద్యాలు ఇందుకు సరిగా ఉన్నాయి చూడు.

కం. 'కర్మమునఁ బుట్టు జంతువు,
కర్మమున వృద్ధిఁబొందు, గర్మమునఁజెడున్
కర్మమె జనులకు దేవత
కర్మమె సుఖదుఃఖములకు గారణ మధిపా!!

కం. కర్మములకుఁ దగు ఫలములు
గర్మలకు నిడంగ రాజగాని సదా ని
ష్కర్ముఁడగు నీశ్వరుండును
గర్మవిహీనునకు రాజుగాడు మహాత్మా!!'

– సూరి నాగమ్మ (రమణాశ్రమ లేఖలు)

ధర్మ సందేహాలకు సమాధానాలు

మనం 9 సంఖ్యకు చాలా ప్రాధాన్యం ఇస్తాం – ఎందుకు?

సంఖ్యాశాస్త్రం ప్రకారం 18 అనే సంఖ్యను ఏకసంఖ్యగా మారిస్తే 9 వస్తుంది. మూడు లేక రెండు అంకెల సంఖ్యలు ఏకసంఖ్యగా మారి9గా మారితే దానికో ప్రత్యేకత ఉంది. సాక్షాత్తు భగవంతుని చేత చెప్పబడ్డ గీతకు 18 పేర్లున్నాయి.

గీతా గంగాచ గాయత్రీ సీతా సత్యా సరస్వతీ
బ్రహ్మ విద్యా బ్రహ్మవల్లీ త్రిసంధ్యా ముక్తీ గేహినీ
అర్ధమాత్రా చిదానందా భవఘ్నీ భ్రాంతి నాశినీ
వేదత్రయీ పరాఽనన్తా తత్త్వార్థ జ్ఞానమంజరీ||

1. గీత 2. గంగ 3. గాయత్రి. 4. సీత 5. సత్య 6. సరస్వతి 7. బ్రహ్మవిద్య 8. బ్రహ్మవల్లి 9. త్రిసంధ్య 10. ముక్తిగేహిని 11. అర్థమాత్ర 12. చితానంద 13. భవఘ్ని 14. భ్రాంతినాశిని 15. వేదత్రయి. 16. పర 17.అనంత 18. తత్త్వార్థ జ్ఞానమంజరి.

(ఈ ఎనిమిది ఏకసంఖ్యగా మారితే 9 అవుతుంది)

మనకు ఉపనిషత్తులు 108=9
భగవద్గీత అధ్యాయాలు 18+9
మహాభారత సంగ్రామం జరిగినరోజులు 18=9
మహాభారతంలోని పర్వాలు 18=9
మనం ధరించే మాలలోని పూసలు (రుద్రాక్షలు, తులసీమాల పూసలు) 108=9
నవగ్రహాలు=9
అష్టాదశ శక్తి పీఠాలు 18=9
మహాభారత యుద్ధంలోని సైనికుల సంఖ్య అక్షౌహిణీలు 18=9
1. అక్షౌహిణీ
21870 ఏనుగులు 2+1+8+7+0 =18=9
21370 రథములు 2+1+8+7+0 =18=9
65610 గుఱ్ఱములు 6+5+6+1+0 =18=9
109350 కల్బలము 1+0+9+3+5+0 =18=9
జ్యోతిష శాస్త్రంలో నక్షత్రాలు 27=9
దుర్గాదేవికి గల భుజాలు 18=9
యజ్ఞాల్లో ఋత్విక్కులు 18=9
దేవాలయానికి మెట్లు 18=9
(దేవాలయానికి 18 మెట్లు ఏవిధంగా ఉన్నవో మోక్షసాధనకు సోపానాలు 18 ఉన్నావి)
అంతఃకరణ చతుష్టయం 1
పంచప్రాణాలు 5
పంచజ్ఞానేంద్రియాలు 5
పంచకర్మేంద్రియాలు 5
దేహం 1
దృశ్యం 1
1+5+5+5+1+1= 18=9

మెట్టమొదటి ఉపనిషత్తు ఈశావ్యాసోపనిషత్తులోని మంత్రాలు 18=9

9 సంఖ్యకు కుజుడు అధిపతి(సంఖ్యాశాస్త్రం ప్రకారం) ఈ సంఖ్యకు విశేష ఫలితాలు ఉంటాయని సంఖ్యాశాస్త్రం తెలియజేస్తుంది. ఇంకా చెప్పాలంటే 9 సంఖ్యతో ముడిపడి ఉన్న అంశాలు చాలా ఉన్నవి.

–డా|| పి.భాస్కరయోగి



జీవన నిర్మాణం ఈశ్వర శక్తే

సంతృప్తి, సార్థకతలు జీవిత సారాలు వెదికితే దొరకవు, వాటిని మనమే నిర్మించుకోవాలి. స్థూల భవనాల నిర్మాణం రాళ్లు ఇటుకలు, ఇసుక మొదలైన వాటితో చేసినట్లే జీవిత నిర్మాణం ఈశ్వరీయ జ్ఞానం అనే శక్తి ద్వారా చేయబడుతుంది, ఈ మూడు ధారణలు చేయడమంటే నిర్మాణ కార్యంలో తత్ప రులై ఉండడం ఆధ్యాత్మిక జీవితంలో నిర్మాణం ముఖ్యంగా ఏడు విషయాలపై ఆధారపడి ఉంది.

ప్రతిజ్ఞ: భవన నిర్మాణ ప్రారంభంలో భూమి శుద్ధికరణ చేస్తారు. జీవిత నిర్మాణం కూడా ఒక మహత్య పూర్ణమైన ప్రతిజ్ఞతో నేను మనసా, వాచా, కర్మణా ఎవ్వరికీ దుఃఖాన్ని ఇవ్వమని మొదలవుతుంది. దుఃఖం ఇవ్వడం అంటే వాతావరణాన్ని స్మశానంగా చేయడం.

అనంతమైన వైరాగ్యం: అనంతమైన వైరాగ్యం అంటే చనిపోయి జన్మించిన జన్మ ప్రాపంచిక ఆశక్తులకు పూర్తిగా దూరమై సర్వసంబంధాల సుఖం ఒక్క శివపరమాత్మనుండి పొందడం, మరి ఆయన ఎచట ఎలా ఉంచినా, ఎలా నడిపించినా, ఏమి తినిపించినా అందులో పరిపూర్ణ సంతృప్తితో ఉండడం.

బాబా చెప్పిన మహా వాక్యాలను పాటించడం: ఈ సృష్టి నాటకంలో ప్రతి ఒక్క పాత్రధారికి ఎవరి పాత్ర వారికి లభించింది. ఒక పాత్ర వేరొకరితో కలవదు. నా బాధలు కలహ క్లేశాలు సమస్యల మొదలైన వాటికి నాపూర్వకర్మలే కారణం. ఇందులో లేశమాత్రం కూడా ఎవరిదోషం లేదనే మహా వాక్యాలను మరిచిపోవద్దు

ప్రతికూల పరిస్థితులు: వీటిని చూస్తూ సహించలేని విషయాలను వింటూ, మనసును చంచలింపజేసే సంబంధ సంపర్కాలలో వస్తూ కూడా స్థితి ప్రియమైనది. అతీతమైనదిగా ఉండాలి. శివబాబా శ్రీమతం తప్ప ఏ ప్రతిక్రియ మన కర్మేంద్రియాల నుండి వెలువడరాదు. సమయ పరిస్థితిని అనుసరించి ఏ గుణం, ఏశక్తి అవసరమో దానిని ఉపయోగించే సామర్థ్యం మనలో ఉండాలి.

నియమాలు: నియమాలు పాటించడమంటే దుర్గుణాల అక్రమణ నుండి ఆత్మ సురక్షితంగా ఉండ గలిగే శక్తివంతమైన కోటను తయారుచేసుకోవడం. ఇది ఒక మధురమైన బంధన. అంగ రక్షకుల మధ్యలోను వ్యక్తి గొప్ప మహిమ గల వాడంటారు. సమాజం అతడిని గౌరవప్రదమైన దృష్టితో చూస్తుంది. అలాగే ఈశ్వరీయ నియమాల కాపలాలో ఉండే సాధకుని జీవితం పవిత్రమై నిష్కళంకమనబడుతుంది.


పరమాత్మని పిల్లలం: మన మంతా ఆత్మలం, ఒక పరమపిత శివ పరమాత్మ పిల్లలం – పరస్పరం సోదరులం, ఈ సత్యం వ్యవహార రూపంలో ఆచరణలో ఉండాలి. అప్పుడే ప్రేమ, క్షమాభావం సహజంగానే వ్యక్తమవుతూంటాయి. వ్యర్థసంకల్పాల ఉత్పత్తి క్షీణిస్తుంది.

లక్ష్యం: జీవితమనే భవనం శిఖరం లేక, లక్ష్యం దీనివలన జీవితం మహిమయోగ్యమవుతుంది. లక్ష్యాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకునే సాధకుడు అన్వేషించే సంస్కారాల నుండి స్వతహాగానే విముక్తుడవుతాడు, గమ్యం సమీపించిన కొలది అతీంద్రియా సుఖాన్ని కలిగేలా చేస్తుంది.

పై విషయాలను జీవితంలో ఆచరించి నడిచే సాధుకుడు జీవితాన్ని వెదుకుతూ తిరగక, తన ఉన్నచోట ఒక పవిత్రమైన అందమైన దేవాలయాన్ని నిర్మించుకుంటాడు. ఈ నిర్మాణం లక్షల మంది ఆత్మలకు జీవితాన్ని అన్వేషించే రోగం నుండి విముక్తి చేసి విజయ మార్గాన్ని దర్శింపజేసే ఆదర్శవంతుడవుతాడు.

కామ, క్రోధ, లోభ, మోహ, అహంకారాలు, ఈర్ష్య, ద్వేషాల వంటి చెడు గుణాలను తమ శక్తిగా భావించడం మనిషి చేసే పెద్ద పొరపాట్లు. ప్రాణాలు తీసే విషాన్ని సంజీవినిగా భావించి దానిని ఉపయోగిస్తూ అసంభవమైన జీవితాన్ని వెదుకుతున్నాడు. జీవితాన్ని తయారుచేసుకోవడంలో చెడు గుణాలకు చోటులేదు. భవనం గోడలలో ఒక్క ఇటుక పచ్చిగా ఉన్నా దానిని సంపూర్ణ, సురక్షితమైన భవనం అనరు. అలాగే జీవితాన్ని శ్రేష్ఠంగా తయారు చేసుకునే మార్గంలో మనం ఒక్క చెడుగుణంతో ఉన్నా విజయమనే లక్ష్యాన్ని చేరుకోవడమనేది.

–బ్రహ్మకుమారీలు



వరలక్ష్మీదేవి

సృష్టి, స్థితి, లయ అనే ఈ మూడు ధర్మాలున్న ప్రతిచోట ఆ లలితా త్రిపురసుందరి కొలువై ఉంటుంది. కాకపోతే మనమే అజ్ఞానంతో ఆ తల్లి లీలలను తెలుసుకోలేకపోతున్నాం. మహిమను అర్థం చేసుకోలేక పోతున్నాం. ఎందుకంటే, మనకు అహంకార, మమకారాలే అడ్డంకులు. మన అహంకారాన్ని నిర్మూలించుకొని, అమ్మపైననే మమకారాన్ని పెంచుకుంటే మనకు ఉన్న ఆ చిక్కుముడి కాస్తా వీడిపోతుంది. అదే అద్భుతమైన అర్హత. అలా మనకి మనమే అమ్మవారికి సేవాభావంతో అంకితం కావడమే మన అభివృద్ధికి శ్రీకారం.

ఈ సంవత్సరం త్రైలోక్యమోహనంగా ప్రవేశార్హత పొంది 'మూలాధార చక్రం'లో అమ్మవారి భక్తినే ఆధారంగా పట్టుకోవాలి. గణపతి ఆశీర్వాదంతో మాయను తొలగించుకునే ప్రయత్నం చేయాలి. అంతా మాయ, మనం కూడా అబద్ధం. కేవలం అమ్మవారు, ఆమెపైన మనకు ఉన్న భక్తిప్రవత్తులే సత్యం, శాశ్వతం కావాలి. 'సర్వఆశాపరిపూరక చక్రం'లో సంచరించిన మన ప్రతి ఆశా 'త్రిపురేశి' ని సంతుష్టపరిచే విధంగా ఉండాలి. అలా ఆమె దీవెనలు పొందాలి. ఆ దీవెనల బలంతోనే 'సర్వసంభ చక్రం'లోకి ప్రవేశించి చైతన్యం పొందాలి. ఉత్తమ ఆలోచనలను చేయగలగాలి. అంతేగాక, ఆ ఆలోచనలను సాకారం చేసే దిశగా కృషి చేసి ఫలితం సాధించాలి. శ్రద్ధా, భక్తులను గుణించి, హెచ్చించి ఆ శక్తిని సమీకరించుకోవాలి. అలా 'సర్వసౌభాగ్య చక్రం'లోకి ప్రవేశించాలి. అక్కడ అమ్మవారి పాదాలను పట్టుకొని సర్వసౌభాగ్యాలు అడుక్కోవాలి. ప్రార్థించాలి. ఆ ప్రార్థనా ఫలితంగా 'సర్వార్థసాధక చక్రం' లో అడుగుపెట్టాలి. అక్కడి సూర్యశక్తి కిరణాలు మనపైకి సోకగానే ఆరోగ్యం, ఐశ్వర్యం పొంది సర్వార్థములను అందుకోగలం. అదే క్షణంలో మనమే ఆ లలితా త్రిపురసుందరి 'సర్వరక్షాకర చక్రం'లోకి అడుగిడగలుగుతాము. అక్కడే మనలోని నిస్పృహ, సర్వరోగాలు హరింపబడతాయి. అక్కడ మన రక్తాన్ని, ఆలోచనలను, కర్మలను శుద్ధి చేసుకునే అద్భుతమైన అవకాశం మనకు లభిస్తుంది. అనంతరమే 'సర్వ సిద్ధిప్రదచక్రం' లోకి ప్రవేశించే అర్హత లభిస్తుంది. ఆ అధిష్టాన దేవత త్రిపురాంబ చల్లని చూపులతో మనలను అక్కున చేర్చుకునే దివ్యమైన సందర్భం ఇదే. అక్కడ ఉన్న ముగ్గురు



రహస్య యోగినిల దర్శనం కూడా మనకు లభిస్తుంది. మహాకామేశ్వరి, మహావజ్రేశ్వరి, మహాభగమాలిని ఈ ముగ్గురమ్మలకు మూలపుటమ్మ అయిన లలితా త్రిపుర సుందరి 'హ్రీం' కార రూపంలో దర్శనమిచ్చి మనలను ఉద్ధరిస్తుంది. ఇలా లలితా త్రిపుర సుందరి అనుగ్రహం మనకు సంపూర్ణంగా కలుగుగాక!

హ్రీంకారాసన గర్భితానల శిఖాం సౌఃక్లీం కలాం భీభ్రతీం
సౌవర్ణంబర ధారిణీం వరసుధా ధౌతాం త్రినేత్రోజ్వలాం
వందే పుస్తక పాశమం కుశధరాం స్రగ్భూషితాముజ్వలాం
త్వాంగౌరీం త్రిపురాం పరాత్పరకళాం శ్రీ చక్ర సంచారిణీం.

తంత్రానికి, యంత్రానికి అతీతమైన 'భక్తియే' ప్రాణశక్తియై నిరూపణమగుతున్న అపురూప సందర్భమిది. ఆమె అద్వితీయ రూపాన్ని కళ్లారా చూస్తున్న ఈ అద్భుత ఘడియలు మనలను పునీతం చేయుగాక! ఇంత గొప్ప సమయం రావడం కూడా అమ్మవారి అనుగ్రహమే!

ఓ వరలక్ష్మీ దేవి! ఏ సంవత్సరమైనా, ఏ శ్లోకమైనా, ఏ అలంకారమైనా త్రిభుజాకారంలో ముగ్గురమ్మల మూల

త్రిగుణాత్మక స్వరూపిణి

పుటమ్మగా ఇమిడిపోయే నీకు నాపైగల వాత్సల్యామృత సరోవరంలో మునకలు వేయడయే తప్ప, ఈత రాని అల్పురాలిని. నీ పాదపద్మాలను శిరోధార్యం చేసి నీ ప్రత్యక్షానికి గుర్తుగా నీ అడుగుజాడలలో నడిచే అదృష్టం రావడం నా పూర్వజన్మ సుకృతం.

సర్వాంతర్యామియైన వరలక్ష్మీదేవి అయోమయంలో ఉన్న నన్ను నిమిత్తమాత్రురాలిగా ఉండనివ్వక నా వంతు కృషి చేసే అవకాశాన్ని వరంగా ఇచ్చింది. నాకు నీవే దిక్కు, అగ్ని సోమాత్మక స్వరూపిణివై అద్భుతంగా అనంతకోటి సూర్య కిరణాల దీవెనలను ఉజ్వల భవిష్యత్తు బాటగా దీవించుమమ్మా. నా హృదయానంద సరోవరంలో ప్రత్యక్షమై అనంతమైన వెలుగులతో స్థిరంగా ఉండుము. సుఖాసీను రాలివి కమ్ము. నా శరీరాన్ని, మనసును, ఆలోచనను, ఆత్మను, పరిపాలించుము. నేనంటూ నాకు ఏదీ మిగలకుండా అన్నీ నీవై ప్రసరించు (వ్యాపించు). కాంతి స్వరూపిణివైన నీకు వ్యాపకశక్తి అనంతం కదా! అనంతమైన సర్వ సౌభాగ్య సర్వార్థ సాధకాలను సర్వ ఆశాపరిపూరక రూపంగా నన్ను అనుగ్రహించు.



– సి. విజయలక్ష్మీ రాజం

పురాణ క్విజ్

తెలిసినవేంటో తేల్చుకోండి!
తెలియనివన్నీ తెలుసుకోండి..

1. ద్యుముని సంహరించినది?
2. శ్రీకృష్ణుని ధనస్సు?
3. శిశుపాలుని పినతల్లి కుమారుడు?
4. దంతవక్త్రుని సోదరుడు?
5. పల్వుడను రాక్షసుని సంహరించినవాడు?
6. విరాధుడి తల్లి దండ్రులెవరు?
7. విరాధుడనే రాక్షసుడు పూర్వ జన్మలో ఎవరు?
8. దేవతలకు రాజు ఎవరు?
9. పంచప్సరసం అనే తటాకమును నిర్మించినవాడు?
10. అగస్త్యుని చేతిలో మృతి చెందిన రాక్షసులు?

సమాధానాలు

1. ప్రద్యుమ్నుడు
2. శార్ఙ్గధనుస్సు
3. దంతవక్త్రుడు
4. విదూరథుడు
5. బలరాముడు
6. తండ్రి జయుడు, తల్లి శతహ్రద
7. తుంబురుడు
8. దేవేంద్రుడు
9. మాండకర్ణి అనే మహర్షి
10. 1. వాతాపి 2. ఇల్వలుడు

ఈవీఎంల పరిశీలన

విజయక్రాంతి, కామారెడ్డి: రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికారులు ఏర్పాట్లను ప్రారంభించారు. అందులో భాగంగా శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ గోదాంలో భద్రపర్చిన వీవీ ప్యాట్, ఈవీఎం యంత్రాలను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అధికారులు పరీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. జిల్లాలోని 786 పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించిన వీవీ ప్యాట్, ఈవీఎం యంత్రాలపై ఎటువంటి అనుమానాలు రాకుండా పరిశీలించడం జరిగిందన్నారు. బీఈఎల్ ఇంజనీర్లు వీవీ ప్యాట్, ఈవీఎం యంత్రాలను పగడ్బందీగా చెకింగ్ చేసి తిరిగి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తారని తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ పి.యాదిరెడ్డి, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ ఆర్‌డీఓలు రాజేంద్రకుమార్, దేవేందర్ రెడ్డి, రాజేశ్వర్‌తో, వివిధ రాజకీయ పార్టీల నాయకులున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో
17 స్థానాలు కాంగ్రెస్‌కే



విజయక్రాంతి, నల్లగొండ: పీసీసీ పబ్లిసిటీ చైర్మన్‌గా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నియామకం జరిగింది. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, నల్లగొండ జిల్లా జడ్‌పీ చైర్మన్ నేనావత్ బాలూనాయక్ పబ్లిసిటీ చైర్మన్‌గా ఎన్నికైన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 17కు 17 స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని భావి తరాల ప్రధానిగా రాహుల్‌గాంధీ ఎన్నికకావడం ఖాయమని ఆయన అన్నారు. ఆయన వెంట ఆదివాసి జాతీయ కో ఆర్డినేటర్ కిషన్ నాయక్, దేవరకొండ వైస్ ఎంపిపి వెనిదర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

కక్ష్యసాధింపులకు పాల్పడుతున్న ఎమ్మెల్యే

విజయక్రాంతి, మహబూబ్‌నగర్: ఎన్నికల ముందు రాజకీయాలు ఎన్ని చేసినప్పటికీ ఎన్నికల అనంతరం ఇతర పార్టీ నాయకులను, కార్యకర్తలను వేదింపులకు గురి చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ వైఖరి మార్చుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎర్ర శేఖర్ కోరారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మహబూబ్‌నగర్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎర్ర శేఖర్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తనకు వ్యతిరేకంగా ఓటు వేసిన ప్రజలను ఏదోరకంగా భయ బ్రాంతులకు గురి చేస్తూ పార్టీ మార్చుకోవాలని హెచ్చరికలు చేస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా తన పంథా మార్చుకోని పక్షంలో టీఆర్‌ఎస్ పార్టీ అధినేతకు వివరించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికల అఫిడవిట్‌లో అన్ని తప్పులు ఉన్నాయని ఆయన ఆరోపించారు. అధికారులు సరిగా స్పందించడం లేదని అందుకే హైకోర్టుకు వెళ్లడం జరిగిందన్నారు.

గుంతలమయంగా రహదారి

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదాచారులు



విజయక్రాంతి, రాజేంద్రనగర్: స్థానిక ప్రజాప్రతినిధుల, అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత రెండు నెలలకు పైగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని బుందావన్ కాలనీ నుంచి బాబుల్‌రెడ్డినగర్‌కు వెళ్లే రహదారి నిర్మాణం కోసం కాంట్రాక్టర్ తవ్వి వదిలేశారు. ఈ రహదారి గుండా వాహనదారులు, పాదాచారులు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి పొడవునా ఎక్కడ చూసినా గుంతలు, రాళ్లు, అడ్డంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల మురికినీరు మ్యాన్‌హోల్ నుండి బయటకు వస్తూ రోడ్డుపై ఏరులై పారుతోంది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, పాదాచారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కూలర్ గోదాంలో అగ్ని ప్రమాదం



విజయక్రాంతి, రాజేంద్రనగర్: శంషాబాద్ సమీపంలోని సాతంరాయి గ్రామ శివారులో ఓ కూలర్ గోదాంలో శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకొంది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరుగనప్పటికీ సుమారు రూ. 20 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు సమాచారం. స్థానికుల వివరాల ప్రకారం....సాతంరాయి సమీపంలోని రెండంతస్తుల భవనంలో నగరానికి చెందిన ఓ వ్యక్తి గత కొంత కాలంగా కూలర్ గోదాంను నిర్వహిస్తున్నాడు. కాగా శుక్రవారం సాయంత్రం ఆకస్మత్తుగా ప్రమాదవశాత్తు కూలర్ గోదాంలో నుంచి దట్టమైన పొగలు ఎగిసిపడుతూ మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదాన్ని తెలుసుకొన్న సిబ్బంది వెంటనే భయంతో గోదాంలో నుంచి బయటకు పరుగులు తీశారు. అంనతరం ఫైర్ స్టేషన్లకు సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్లు సంఘటన స్థలానికి చేరుకొని సుమారు గంటకు పైగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. శంషాబాద్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంపై పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



విజయక్రాంతి, మిర్యాలగూడ: బీసీలకు విద్య, ఉద్యోగ, ప్రైవేటు, రాజకీయ రంగాల్లో 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో జరిగే చలో ఢిల్లీ కరపత్రాన్ని, పోస్టర్‌ను శుక్రవారం స్థానికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం రాత్రికి రాత్రే ఈబీసీలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించి రాజ్యాంగ సవరణ చేశారని, గత 20 సంవత్సరాలుగా బీసీ ఉద్యమం జరుగుతున్నా..అనేక పోరాటాలు చేసినా కేంద్రప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీ వ్యతిరేక పార్టీలుగానే ముద్ర పడ్డాయన్నారు. చట్టసభల్లో బీసీలు ఉన్నప్పటికీ రిజర్వేషన్ కోసం పోరాటాలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఢిల్లీలో జరిగే నిరసన ప్రదర్శనకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, బంటు వెంకటేశ్వర్లు, రామకృష్ణగౌడ్, రాంబాబు, నరేష్, శివ, సురేశ్, మధు, శ్రవణ్, సన్ని పాల్గొన్నారు.

రైల్వేకు రూ.64,587 కోట్లు

- ద.మ.రైల్‌లో సదుపాయాలకు రూ.5,924 కోట్ల కేటాయింపు
- కొత్త మార్గాలకు రూ.834 కోట్లు
- డబ్లింగ్ పనులకు రూ.1905 కోట్లు



విజయక్రాంతి, హైదరాబాద్: కేంద్రం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో రైల్వే శాఖకు రూ.64,587 కోట్లు కేటాయించారు. పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, రైల్వే రంగంలో ప్రమాదాలు గతేడాది తగ్గిపోయాయన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రైలును రూపొందించిన రైలుకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ అని నామకరణం చేసినట్లు వివరించారు. రైల్వే ప్రమాదాలు చాలా వరకు తగ్గిపోయాయి. స్వదేశీ పరిజ్ఞానంతో ఎక్స్‌ప్రెస్ రైలును రూపొందించుకునే స్థాయికి ఎదిగాం. దేశ రైల్వే చరిత్రలోనే గతేడాది అతి తక్కువ సంఖ్యలో ప్రమాదాలు జరిగిన సంవత్సరంగా నిలిచిందన్నారు. మోడీ ప్రభుత్వ పాలనలో ఇదొక బిగ్ అచీవ్ మెంట్ గా గోయల్ అభివర్ణించారు. బ్రాడ్ గేజ్ మార్గాల్లో కాపలా లేని గేట్లను తొలగించామన్నారు. ఈశాన్య భారతదేశంలో సైతం రైల్వేలైన్ల అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలైన మిజోరాం, మేఘాలయాలను రైల్వేలైన్లతో అనుసంధానం చేసిన ఘనత తమ సర్కార్‌దేనని అన్నారు. ప్రతి రోజు దాదాపు 27 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణాలు సైతం చేపట్టామని పేర్కొన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఎక్స్‌ప్రెస్ రైలు 'ట్రైన్ 18'నుకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ అని నామకరణం చేశామని, ఢిల్లీ – వారణాసి మధ్య ఈ రైలు గంటకు 160 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుందని వివరించారు. గరిష్ఠంగా 180 కి.మీ వేగంతో రైలు ప్రయాణించగలదని తెలిపారు. గతేడాది ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్లో రైల్వేశాఖకు రూ.1.48 లక్షల కోట్లు కేటాయించగా.. తాజా ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్లో అందులో సగం నిధులు కేటాయించారు. రైల్వే భద్రతా నిధి క్రింద రూ.20 వేల కోట్లు చూయించారు.

2018 –19 బడ్జెట్ లో రైల్వే రంగానికి 55వేల 088 కోట్లు కేటాయించగా.. 2017–18 బడ్జెట్ కేటాయింపులో రూ.41వేల 813.8 కోట్లు, 2016 –17 ఏడాది బడ్జెట్ లో రూ.45వేల 231.63 కోట్లు కేటాయించింది. 92 ఏళ్ల సంప్రదాయానికి స్వస్తి పలుకుతూ కేంద్ర బడ్జెట్, రైల్వే బడ్జెట్ ను వేర్వేరుగా ప్రకటించడాన్ని 2016 సెప్టెంబర్ లో రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఆ తరువాత కేంద్ర బడ్జెట్ తో కలిపి రైల్వే బడ్జెట్ ను ప్రకటించడం ఇది మూడోసారి.

బడ్జెట్ 2019–20 రైల్వే హైలెట్స్ ఇవే...

- బ్రాడ్‌గేజ్ లైన్లలో కాపలాలేని లెవల్ క్రాసింగ్‌లను తొలగించాం.
- అత్యధిక వేగంగా ప్రయాణించే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ తెస్తున్నాం.
- రైల్వే ప్రయాణికులకు వరల్ క్లాస్ సౌకర్యం, కొత్త ఉద్యోగాల కల్పన
- స్పీడ్ ట్రైన్స్, భద్రతో కూడిన సర్వీసులు
- మిజోరాం, మేఘాలయా రాష్ట్రాలను రైల్వేతో అనుసంధానం చేశాం
- దేశీయ అత్యాధునిక ట్రైన్ 18తో కలిపి కొత్త ట్రైన్లు
- రైల్వే స్టేషన్ల దగ్గర వైఫై కనెక్షన్లు
- రైల్వే ఓవర్ బ్రిడ్జీల నిర్మాణాలు

దక్షిణ మధ్య రైల్వే హైలెట్స్ ఇవి

- రూ.5,924 కోట్ల కేటాయింపు
- కొత్త మార్గాలకు రూ.834 కోట్లు
- డబ్లింగ్ పనులకు రూ.1905 కోట్లు
- ట్రాఫిక్ సదుపాయాలకు రూ.138 కోట్లు
- ప్రయాణికుల సౌకర్యాలకు రూ.229 కోట్లు
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 102 ఆర్‌ఒబి లేదా ఆర్‌యూబీల నిర్మాణం
- ఆర్‌ఒబి, ఆర్‌యూబీల కోసం రూ.397 కోట్లు
- బ్రిడ్జీల కోసం రూ.52 కోట్లు
- లెవల్ క్రాసింగ్‌ల వద్ద భద్రతకు రూ.72.5 కోట్లు
- ట్రాక్ రెన్యూవల్స్ కోసం రూ.657 కోట్లు

ముఖ్యమైన ప్రాజెక్టులకు కేటాయింపులు

- అక్కన్నపేట్ – మెదక్ నూతన రైలు నిర్మాణం – రూ.10 కోట్లు
- ఓబులవారిపల్లె –కృష్ణపట్నం నూతన రైలు నిర్మాణం – రూ.30 కోట్లు
- ముద్ఖేడ్ –పర్బనీ డబ్లింగ్ ప్రాజెక్ట్ – రూ.34.50 కోట్లు
- గుంటూరు – తెనాలి డబ్లింగ్, విద్యుదీకరణ – రూ.5 కోట్లు
- ఎంఎంటీఎస్ ఫేస్ 2 – రూ.10 లక్షలు

భారీ ప్రాజెక్టులకు కేటాయింపులు

- మనోహరాబాద్ – కొత్తపల్లి నూతన రైలు మార్గం – రూ.200 కోట్లు
- మునీరాబాద్ – మహబూబ్‌నగర్ నూతన రైలు మార్గం – రూ.275 కోట్లు
- భద్రాచలం – సత్తుపల్లి నూతన రైలు మార్గం – రూ.405 కోట్లు
- కాజీపేట్ – బల్హార్షా 3వ లైను ప్రాజెక్టు – రూ.265 కోట్లు
- నడికుడి – శ్రీకాళహస్తి నూతన రైలు మార్గం – రూ.700 కోట్లు
- కడప – బెంగుళూరు నూతన రైలు మార్గం – రూ.210 కోట్లు
- గుంతకల్లు – కల్లూరు డబ్లింగ్ ప్రాజెక్ట్ – రూ.15 కోట్లు
- గుంటూరు – గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్ట్ – రూ.280 కోట్లు
- విజయవాడ – భీమవరం–నిడదవోలు డబ్లింగ్, విద్యుదీకరణ – రూ.175 కోట్లు
- కోటిపల్లి – నర్సాపూర్ నూతన రైలు మార్గం – రూ.200 కోట్లు
- సికింద్రాబాద్ –మహబూబ్‌నగర్ డబ్లింగ్ ప్రాజెక్ట్ – రూ.200 కోట్లు
- గూటీ – ధర్మవరం డబ్లింగ్ ప్రాజెక్ట్
- రూ.126 కోట్లు
- కాజీపేట – విజయవాడ 3వ లైన్ ప్రాజెక్ట్ – రూ.110 కోట్లు
- విజయవాడ – గూడూరు 3వ లైన్ ప్రాజెక్ట్ – రూ.350 కోట్లు
- ఘట్‌కేసర్ –యాదాద్రి ఎక్స్‌టెన్షన్ ఎంఎంటీఎస్ ఫేస్ 2 – రూ.20 కోట్లు
- విజయవాడ, కాజీపేట్, వాడి, గూటీ బైపాస్ లైన్ల నిర్మాణం – రూ.143 కోట్లు
- చర్లపల్లి స్టేషన్ శాటిలైట్ టెర్మినల్ అభివృద్ధి – రూ.5 కోట్లు
- తిరుచూర్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి – రూ.6 కోట్లు

తెలుగు రాష్ట్రాలకు నిరాశే

- అరకొర నిధులే
- ప్రాజెక్టులకు జాతీయ హోదా ఊసేలేదు
- ప్రస్తావనకు నోచుకోని విశాఖ రైల్వే జోన్

విజయక్రాంతి, హైదరాబాద్: కేంద్రప్రభుత్వం 201920 ఆర్థిక సంవత్సరానికి శుక్రవారం పార్లయిమెంట్లో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ ఆకౌంట్ బడ్జెట్ తెలుగు రాష్ట్రాలకు నిరాశ కల్గించింది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెప్పుకోదగ్గ కేటాయింపులు ను ఆర్థికమంత్రి ప్రకటించలేదు. జాతీయ ఆర్థిక సగటు ప్రకారం రావాల్సిన నిధులు మాత్రమే ఉభయ రాష్ట్రాలకు రానున్నాయి. తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా ప్రారంభించిన కాళేశ్వరం నీటి పారుదల ప్రాజక్టుకు జాతీ యహోదా, పాలమూరు ఎత్తిపోతల పధకానికి కేంద్ర సహాయం కానీ ఆర్థికమంత్రిమంత్రి ప్రసంగంలో కన్పించకపోవటం రాష్ట్రప్రభుత్వ వర్గాలలో అసంతృప్తి కి దారి తీసింది.అదేవిధంగా బయ్యారం ఉక్కుకర్మాగారం నిర్మాణానికి సంభందించి కూడ బడ్జెట్లో ఏమాత్రం ప్రస్తావన లేకపోవటం శోచనీయమని పలువురు విమర్శిస్తున్నారు. రాష్ట్రానికి గతంలో మంజూరు చేసిన గిరిజన విశ్వవిద్యాలయానికి కేవలం నాలుగు కోట్ల రూపాయలను కేటాయించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఈ విశ్వవిద్యాలయం ద్వారా తరగతులు ప్రారంభించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్ లో భారీగా నిధులు విడుదల అవుతాయని ఆశించారు.అదేవిధం గా హైదరాబాద్ ఐ ఐ టి కి కేటాయించిన 80 కోట్లు పెద్ద కేటాయింపులు కాదని,రాష్ట్రంలో విద్య వైద్య మౌలిక రంగాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తే బాగుండేదని ఆర్థిక శాఖ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ కు అంతే

కేంద్ర బడ్జెట్లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ఏవిధమైన కేటాయింపులు జరగలేదు.విభజన హామీలలో ప్రధానమైన విశాఖపట్నం రైల్వే జోన్ అంశం కానీ, కడప ఉక్కు కర్మాగారం నిర్మాణానికి సంభందించి ఏవిధమైన ప్రకటన వెలువడలేదు.రాజధాని నిర్మాణానికి కొంతమేరైనా నిధులు విడుదల అవుతుందని భావించినప్పటికీ ఆర్థికమంత్రి తన ప్రసంగంలో ఏవిధమైన ప్రస్తావన తీసుకొనిరాలేదువిభజన హామీల కింద రాష్ట్రానికి కేటాయించిన వివిధ విశ్వవిద్యాలయాలకు కూడా నిధులు సరిగా విడుదల కాలేదని పలువు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు . కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు కేటాయింపులు..సింగరేణిరూ.1850 కోట్లు, ఐఐటీ హైదరాబాద్‌రూ.80కోట్లు, ట్రైబల్ యూనివర్సిటీరూ.4కోట్లు.

కిసాన్ సమ్మాన్ నిధికి రూ.75వేల కోట్లు

- 12కోట్ల మంది రైతులకు లబ్ధి
- ఎకరాకు రూ.6వేలు
- మూడు విడతలుగా చెల్లింపులు

విజయక్రాంతి, హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రైతులకు వరాల జల్లు కురిపించారు. రైతులను ఆదుకునేందుకు తెలంగాణలో అమలవుతున్న రైతు బంధు పథకం తరహాలో కిసాన్ సమ్మాన్ నిధిని ఏర్పాటు చేసింది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి బడ్జెట్‌లో రూ.76వేల కోట్ల నిధులను కేటాయించింది. రైతులకు పెట్టుబడి సాయంగా ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు ఏడాదికి ఆరు వేల రూపాయల నగదు సాయం ప్రకటించింది. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 12 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. ఈ పథకం చిన్న, సన్నకారు రైతులకు వర్తిస్తుంది. ఎకరాకు రూ.6వేలు రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా నగదు వెళుతుందని చెప్పారు. ఈ నగదును మూడు విడతలుగా ఖాతాల్లో జమ చేయనున్నట్లు వెల్లడించారు. కిసాన్ సమ్మాన్‌చ పథకంలో మూడు వాయిదాల్లో నగదు లబ్ధిదారులకు చేరుతుందన్నారు. తొలి విడతగా తక్షణమే రూ.2వేల ఆర్థిక సాయం రైతులకు అందజేస్తామని, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధం లేకుండా ఈ నగదు నేరుగా రైతుల ఖాతాలోకి మళ్లిస్తామని గోయల్ ప్రకటించారు. ప్రతి ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో పథకాలను ప్రవేశ పెడుతుంది. వాటి ద్వారా కొంత మంది రైతులే లాభం పొందుతున్నారు. కానీ మా ప్రభుత్వం తీసుకువచ్చిన 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి స్కీమ్' కింద 5ఎకరాలు, అంతకంటే తక్కువ భూమి కలిగి వున్న 12 కోట్ల మంది రైతులు ప్రయోజనం పొందనున్నారు' అని తమ ప్రభుత్వం ఈ బడ్జెట్ వల్ల సామాన్యులకు కలిగే ప్రయోజనాలను ప్రస్తావించారు. కిసాన్ సమ్మాన్ పథకాన్ని డిసెంబర్ 2018 నుంచి అమలు చేయనున్నట్లు గోయల్ వెల్లడించారు. ఈ పథకం ద్వారా రైతుల కష్టాలను తీర్చనున్నట్లు ప్రసంగంలో ప్రస్తావించారు. కానీ పలు రాష్ట్రాలు ఇప్పటికే రైతులకు పంట పెట్టుబడి కింద ఆర్థిక సహాయం చేస్తున్నది. దీంతో ఈ పథకంపై ప్రతిపక్షాలు ధిక్కార స్వరం పెంచారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతబెనర్జీ తమ రాష్ట్ర కిసాన్ సమ్మాన్ పథకాన్ని అమలు చేయమని ప్రకటించారు. రైతుబంధు పథకాన్ని కాపీ కొట్టారని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేతారకరామారావు విమర్శించారు.

బడ్జెట్‌లో చేనేతకు తగ్గిన కేటాయింపులు

విజయక్రాంతి, హైదరాబాద్: గత పది హేను ఏళ్లలో, కేంద్ర ప్రభుత్వ స్పందన ఏ కూటమి అధికారంలో ఉన్నా, చేనేత రంగం ఆశిస్తున్న నిధుల కేటాయింపు పెరగలేదు. చేనేత రంగాన్ని పట్టించుకోలేదు.

చేనేత రంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో చేనేత కార్మికుల ఆత్మహత్యలు పెరిగాయి. 1997లో చేనేత రంగానికి ప్రణాళిక వ్యయం కేవలం రూ.107 కోట్లే. ఈ రాజకీయ, పాలక నిర్లక్ష్యం యొక్క పరిణామ స్వరూపం, చేనేత కార్మికుల ఆత్మహత్యలు. రాజకీయంగా సాదించలేనిది, ఆత్మహత్యల ద్వార తమ గోడు ప్రభుత్వానికి, ప్రపంచానికి వినిపించగలిగారు. దాని పర్యవసానమే, 2012–13 లో, చేనేత కేటాయింపు రుణమాఫీ పథకంతో కలిపి రూ.2,960 కోట్లకు పెరిగింది. చేనేత రుణ మాఫీ పథకం అమలు కాలేదు.

అప్పులు పెరగుతున్న తరుణంలో ఆదాయం పెరగక ఇబ్బందులూ పడుతున్న చేనేత కుటుంబాల మీద గోరు చుట్టూ మీద రోకటి పోటు లాగ, నోట్లరద్దు, జీఎస్టీలతో సమస్యలు జఠిలమయ్యాయి. ఎన్నడు లేని పన్నులు చేనేత మీద భారాన్ని విపరీతంగా పెంచాయి. చేనేతతో పోటి పడుతున్న రంగాలకు, చేనేత మార్కెట్లను అంది పుచ్చుకునే అవకాశం ఈ రెండు నిర్ణయాలు కలుగజేశాయి. చేనేత వస్త్రాల కొనుగోలు తగ్గిపోయింది. 2019–20 వోట్‌అన్ అకౌంట్ బడ్జెట్లో చేనేతకు కేటాయించింది రూ.456.80 కోట్లు. 2018–19లో కేటాయించింది రూ.396.09 కోట్లు. 2017–18లో కేటాయించింది రూ.604 కోట్లు, ఖర్చు చేసింది రూ.468.98 కోట్లు. ఎన్నికల సమయంలో కూడా చేనేతకు కావాల్సిన నిధులు ఇవ్వలేదు.

మలేషియా – సింగపూర్ ఎడ్యుకేషనల్ టూర్



విజయక్రాంతి, హైదరాబాద్: భారత దేశంలోనే పాఠశాల విద్యకు పెట్టింది పేరు శ్రీచైతన్య స్కూలత్. ప్రైమరీ నుండే ఒలింపియాడ్స్, హైస్కూల్ నుండే ఐఐటీ – జేఈఈ, నీట్‌లకు తిరుగులేని ఫౌండేషన్ శిక్షణను అందిస్తూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రికార్డ్ విజయాలు సాధిస్తూ, అగ్రస్థానంలో దూసుకెళ్తోన్న శ్రీచైతన్య స్కూల్ మరో వినూత్న ప్రక్రియకూ శ్రీకారం చుట్టింది. చదువుతో పాటు విద్యార్థులకు వినోదం, వికాసం, విజ్ఞానం, ప్రపంచ అవగాహన కల్పిస్తూ, ఆల్‌రౌండ్ డెవలపర్స్‌గా, గ్లోబల్ లీడర్స్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఎడ్యుకేషనల్ టూర్స్ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఇప్పుడు 105 మంది విద్యార్థులతో, 10 మంది ఉపాధ్యాయులతో, 8 రోజుల పాటు మలేషియా, సింగపూర్ దేశాల్లో టూర్‌ను విజయవంతంగా పూర్తి చేసి , విద్యార్థులకు జీవితాంతం గుర్తుండే మధుర జ్ఞాపకాన్ని అందించింది. ఈ సందర్భంగా సంస్థ అధినేత డా. బి.ఎస్.రావు మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రపంచాన్ని పరిచయం చేసే ఇలాంటి దేశ విదేశ విజ్ఞాన పర్యటనలు విద్యార్థులందరికీ చెరిగిపోని జ్ఞాపకాలుగా నిలుస్తాయనీ, వారు భవిష్యత్తులో అంతరిక్ష యాత్రికులుగానూ, చరిత్రకారులుగానూ కావటానికి అవసరమైన స్ఫూర్తిని అందిస్తాయనీ, గ్లోబల్ సిటిజన్స్‌గా వారు మారడానికి దోహదపడతాయనీ ఆయన అన్నారు. ఈ టూర్‌ను విజయవంతం చేసిన విద్యార్థులను, సహకరించిన తల్లిదండ్రులను, అధ్యాపకులను, సహాయ సహకారాలందించిన కాక్స్ అండ్ కింగ్స్ ట్రావెల్స్ వారిని ఆయన అభినందించారు.

ఓట్ల కోసమే కేంద్రం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్



విజయక్రాంతి, కరీంనగర్: కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా రాబోయే ఎన్నికల కోసమే అన్నట్లు ఉందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ అన్నారు. బడ్జెట్‌పై శుక్రవారం విలేకరులతో పొన్నం మాట్లాడుతూ..బీజేపీ మరోసారి వ్యాపారస్తుల పార్టీ అని తేలిపోయిందని అన్నారు. బీజేపీ అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని, టాక్స్ పరిధి పెంచి వచ్చే ఏడా నుండి అమలు చేస్తామని చెప్పడం దారుణమని అన్నారు. ఎంత సేపు మోడీ ప్రభుత్వం వ్యాపారస్తుల మన్ననలు పొందే ప్రయత్నం చేస్తుందని, నిరుపేదలు సంక్షేమం పట్టదా అని ప్రశ్నించారు. దేశంలో ఏ పథకం వచ్చినా వాళ్లే ఆదర్శం అన్నట్లు కేటీఆర్ కవితలు డప్పు కొంటుకుంటున్నారని విమర్శించారు. కేటీఆర్ మా స్కీమ్‌నే మోడీ కాపీ కొట్టారు అంటే కవిత కాపీ కూడా సరిగా కొట్టలేకపోయారని అంటుందని బీజేపీతో దోస్తీ చేయాలన్నదే టీఆర్‌ఎస్ ఆలోచన అని అన్నారు. మోడీ ప్రభుత్వం వల్ల దేశ ప్రజలకు ఒరిగిందేమీ లేదని, మోడీ సర్కారును దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూస్తే కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉందని, కాంగ్రెస్ ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడితే బీజేపీ నిర్వీర్యం చేస్తుందని అన్నారు. బీజేపీతో ఒప్పందం కారణంగానే టీఆర్‌ఎస్ ఎంపీలు రాష్ట్రంకు అన్యాయం జరిగినా మాట్లడకుండా మౌనంగా ఉన్నారని అన్నారు.

కేంద్ర బడ్జెట్ మధ్యతరగతి వేతన జీవులకు భరోసా

- బీజేపీ నేత బండి సంజయ్



విజయక్రాంతి, కరీంనగర్: ఆదాయపన్ను పరిమితి పెంపు, వ్యవసాయదారులకు ఆరువేల రూపాయల ప్రోత్సాహకం వేతన శ్రమ జీవుల మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ హర్షనీయం అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కేంద్ర బడ్జెట్‌పై సంజయ్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ముప్పై ఎనిమిదిన్నర వేల కోట్లు, దేశ రక్షణరంగానికి మూడు లక్షల కోట్లు ప్రకటించడం జాతీయవాద ప్రభుత్వంగా దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చేర్చినట్లు తెలిపారు. అలాగే వ్యవసాయ ఆధారిత రంగాలు అభివృద్ధి బాటలో పట్టించి వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయడం ద్వారా సాధారణ కుటుంబాలు కూడా ఆర్థికాభివృద్ధి సాధించేందుకేనని అన్నారు. కార్మికుల బీమాను ఆరు లక్షల రూపాయలకు పెంచడం, దేశ ప్రజలందరికి ఆరోగ్య బీమా వర్తించేలా బడ్జెట్‌ను రూపొందించి చర్యలు తీసుకోవడం పేద ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని కేంద్రం బడ్జెట్‌లో పొందుపరిచిందని అన్నారు.

బడ్జెట్‌లో గోసంరక్షణ...

- మోదీ ఓట్ల కామధేను పథకం

విజయక్రాంతి, ఢిల్లీ: ఎన్నికలు ముంచుకొస్తున్న సమయంలో మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ను సంతృప్తి పరచడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా గో సంపద పెంపు కోసం రాష్ట్రీయ కామదేను అయోగ్ ను ప్రవేశపెట్టింది. శుక్రవారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్లో రూ. 750 కోట్లు కేటాయించింది. గో ఉత్పాదకత పెంచడమే లక్ష్యంగా రాష్ట్రీయ కామధేన్ ఆయోగ్ ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా నాణ్యమైన ఉత్తమజాతి ఆవుల ఉత్పత్తికి కృషి చేయనున్నారు. ఆవుల సంక్షేమాన్ని కూడా రాష్ట్రీయ కామధేన్ ఆయోగ్ పర్యవేక్షించనుంది. గోవులను రక్షించడంతో పాటు వాటి ఉత్పాదనను పెంచాలని ఆది నుంచి ఆర్‌ఎస్‌ఎస్ డిమాండ్ కొనసాగిస్తోంది. ఆవులను వధశాలలకు వెళ్లనీయకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంఘాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. ఇందులో భాగంగానే... గో రక్షక దళాలు కూడా ఏర్పడిన సంగతి తెలిసిందే. మధ్యంతర బడ్జెట్లో రాష్ట్రీయ కామదేను అయోగ్ ను ప్రకటించడంతో పాటు నిధులు కేటాయించడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ను సంతృప్తి పరచడంతో పాటు అండగా నిలబడిన హిందూ ఓటు బ్యాంక్ చేజారకుండా బీజేపీ జాగ్రత్త తీసుకుంది. ఇటీవలే ఆర్థికంగా వెనుకబడిన కులాల(ఈబీసీ) కు విద్యా ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా మొదటి ప్రయత్నం చేసిన బీజేపీ, రెండో ప్రయత్నంగా అయోధ్యలోని రామ మందిర నిర్మాణం అంశంలో తమ అధీనంలోని వివాదం లేని భూమిని రామజన్మభూమి న్యాస్కు అప్పగించడానికి సంసిద్ధత వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో పిటీషన్ వేసిన సంగతి తెలిసిందే. మూడో ప్రయత్నంగా రాష్ట్రీయ కామదేను అయోగ్ను ప్రకటించింది. ఈ నిర్ణయాల కారణంగా పార్టీకి అండగా నిలబడిన వర్గాలను సంతృప్తి పరిచే ప్రయత్నం చేసింది. వీటి ద్వారా ఉత్తర బారతంలో రాజకీయంగా నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంది. అన్నిటి కంటే ముఖ్యంగా ఎస్పీ, బీఎస్పీ జతకట్టడం ద్వారా ఉత్తరప్రదేశ్లో బీజేపీ భారీగా సీట్లను కోల్పోతుందని ఇటీవల పలు సంస్థలు నిర్వహించిన సర్వేల్లో తేలిన సంగతి తెలిసిందే. ఇక్కడ కోల్పేయే సీట్లు దక్షిణాదిలో సాధించే అవకాశం లేక పోవడంతో నే బీజేపీ తన అండగా నిలబడే సంప్రదాయ ఓటు బ్యాంకును కాపాడుకునే క్రమంలో ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటోంది.

రేషన్ షాపుల ద్వారా అంగన్‌వాడీలకు బియ్యం సరఫరా



విజయక్రాంతి, కరీంనగర్: కరీంనగర్ జిల్లాలోని అన్ని అంగన్‌వాడి కేంద్రాలకు రేషన్‌షాపుల ద్వారా బియ్యం సరఫరా చేస్తున్నట్లు కరీంనగర్ జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ అన్నారు. కరీంనగర్‌లోని కట్టరాంపుర్‌లోని రేషన్‌షాపులో శుక్రవారం పంపిణీ కార్యక్రమాన్ని జేసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీ నుండి రేషన్ షాపుల ద్వారా అంగన్‌వాడీలకు బియ్యం అందించాలని ప్రభుత్వం ఆదేశించిందని, అంగన్‌వాడీ టీచర్లు తమ దగ్గరలో ఉన్న చౌకధరల దుకాణాల ద్వారా వారికి కేటాయించిన బియ్యాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ విధానం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు నెలకు కావల్సిన మొత్తం బియ్యం నెల మొదటి వారంలోనే అందించడం జరుగుతుందని తద్వారా బియ్యం లోటు లేకుండా చూడటం జరుగుతుందని అన్నారు. అంగన్‌వాడి సిబ్బంది ప్రతి నెల 1 నుండి 15వ తేదీలోగా బియ్యం తీసుకోవాల్సి ఉంటుందని, అంగన్‌వాడి టీచర్ లేదా బయోమెట్రిక్ ఆధారిత ఈ పాస్ విధానంలో బియ్యం తీసుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి రూ.52,800 కోట్లు

విజయక్రాంతి, హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి రూ.52,800 కోట్లు కేటాయించింది. దేశపు జీడీపీలో ఇది 1.4 శాతం. 10 కోట్ల కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన ఆయుష్మాన్ భారత్‌కు పెద్ద పీట వేసింది. ఈ పథకం క్రింద ఇప్పటికే 10 లక్షల మంది రోగులు చికిత్స తీసుకున్నారని బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా పీయూష్ గోయల్ తెలిపారు. 2014 నుండి మంజూరు చేసిన 14 ఎయిమ్స్‌తో కలుపుకొని మొత్తం 21 ఎయిమ్స్‌లను ప్రారంభించామని మంత్రి చెప్పారు. గత బడ్జెట్‌లో అప్పటికే ఆరోగ్య రంగంలో ఉన్న రెండు పెద్ద స్కీంలు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్, ప్రధానమంత్రి మంత్రి జన్ ఆరోగ్య యోజనలను ఆయుష్మాన్ భారత్ క్రిందికి తీసుకువచ్చారు. ఆయుష్మాన్ భారత్ అమలు కోసం 2022 సంవత్సరం నాటికి 1.5 లక్షల సబ్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లుగా మారుస్తామని పీయూష్ చెప్పారు.

ట్రిపుల్ ధమాకా!

(మొదటిపేజీ తరువాయి) ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పారదర్శకతలో కొత్త పుంతలు తొక్కుతున్నట్లు చెప్పారు.

అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాం

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నట్టు పీయూష్ గోయల్ చెప్పారు. భారత దేశ వనరులను పేదలు మొదట అనుభవించగలిగేలా చేస్తున్నామన్నారు. గ్రామీణ, పట్టణాల మధ్య అంతరాల తొలగింపునకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజనకు భారీగా నిధులు సమకూర్చామన్నారు. రూ.19వేల కోట్లు ఖర్చు చేసి, గ్రామీణ రోడ్ల నిర్మాణాన్ని మూడు రెట్లు పెంచినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణాల్లో ఉండే సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకానికి రూ.60వేల కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. పేదలకు ఆహారం అందజేయడానికి రూ.1.7 లక్షల కోట్లను కేటాయించినట్లు ఆయన తెలిపారు. 50 కోట్ల మందికి అండగా ఆయుష్మాన్ భారత్ పథకం అమలు చేసినట్లు గోయల్ వివరించారు. మార్చి వరకు దేశంలో అన్ని ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. 22 రకాల పంటలకు మద్దతు ధర పెంచామన్నారు. 2014కు ముందు బస్సు సౌకర్యం లేని అన్ని గ్రామాలకు ఆ సౌకర్యం కల్పించామన్నారు. ఇప్పటి వరకూ రూ.3వేల కోట్ల పేదల ధనం ఆదా అయిందన్నారు. గత ప్రభుత్వాలు కేవలం ఉత్తుత్తి వాగ్దానాలను మాత్రమే చేశాయని ఆయన ఆరోపించారు.

రైతులకు ఏడాది రూ.6వేలు

పేద రైతుల ఆదాయం పెంపునకు చర్యలు చేపట్టినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు ఏడాది రూ.6వేలు అందిస్తామన్నారు. 2 హెక్టార్ల లోపల(5 ఎకరాలు) వ్యవసాయ భూమి ఉన్న రైతులు కొత్త పథకంలో లబ్ధి పొందుతారని, ఈ మొత్తం మూడు దఫాలుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. దీని ద్వారా 12కోట్లమంది రైతులు లబ్ధి పొందుతారని ఆయన వివరించారు. గోవుల ఉత్పాదకత పెంచడానికి రాష్ట్రీయ కామ్ధేన్ ఆయోగ్ ఏర్పాటు చేసినట్లు పీయూష్ గోయల్ తెలిపారు. గోకుల్ మిషన్ కోసం రూ.750కోట్లు కేటాయిస్తున్నామన్నారు.

60ఏళ్లు నిండిన వారందరికీ ప్రతి రూ.3వేలు పింఛన్

ప్రధానమంత్రి శ్రమయోగి బంధన్ పేరుతో అసంఘటిత కార్మికులకు పింఛన్ ఇవ్వనున్నట్లు గోయల్ తెలిపారు. 60ఏళ్లు నిండిన వారందరికీ ప్రతి నెలా రూ.3వేలు పింఛన్ వచ్చే విధంగా పథకం రూపొందించామన్నారు. నెలకు రూ.100 చొప్పున ప్రీమియం చెల్లిస్తే 60ఏళ్ల తర్వాత రూ.3వేల పింఛన్ వస్తుందన్నారు. అసంఘటిత రంగంలోని 10 కోట్ల మంది కార్మికులకు ఈ పథకం వర్తింస్తుందని ఆయన వివరించారు.

మహిళా సాధికారతకు రూ.1330కోట్లు

తాత్కాలిక బడ్జెట్లో మహిళా సాధికారతకు పెద్ద పీట వేశారు. ఇందు కోసం రూ.1330కోట్లను కేటాయించింది. 2018–19 సంవత్సరం బడ్జెట్ తర్వాత సవరించిన బడ్జెట్ అంచనాల కంటే ఇది రూ.174కోట్లు ఎక్కువ. మహిళల కోసం పలు పథకాలు ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. గడిచిన నాలుగున్నరేళ్లలో మహిళల అభివృద్ధి నుంచి మహిళల ద్వారా అభివృద్ధి వైపుకు వెళ్తుందని తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఉజ్వల యోజన ద్వారా ఇప్పటికే 6 కోట్ల ఎల్పీజీ కనెన్షన్లు ఇచ్చామని చెప్పారు. వచ్చే ఏడాదికి మిగతావి పూర్తవుతాయని తెలిపారు. ఉజ్వల యోజన తమ ప్రభుత్వ పథకాల్లో చక్కని విజయం సాధించిన పథకమని అన్నారు. ప్రధాన మంత్రి ముద్ర యోజన ద్వారా లాభం చేకూరిన వారిలో 70శాతం కంటే ఎక్కువ మంది మహిళలే ఉన్నారని గోయల్ వెల్లడించారు. మహిళలు తమ సొంత వ్యాపారాలు ప్రారంభించుకునేందుకు ఈ రుణాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. అలాగే మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 26 వారాల మాతృత్వ సెలవు, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన వారికి ఎంతో లాభం చూకూర్చుతున్నాయని వెల్లడించారు. దీని వల్ల పనిచేసే వారి సంఖ్య పెరిగిందని తెలిపారు. నీతీ ఆయోగ్ ఆధ్వర్యంలోని కమిటీ ఆదివాసీలను గుర్తిస్తుందని తెలిపారు. ఈ వర్గాల కోసం ప్రత్యేక వ్యూహాలను రూపొందిస్తామని చెప్పారు.

ఉద్యోగార్థులే.. నేడు ఉద్యోగాల సృష్టికర్తలు

నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల సృష్టి జరగలేదన్న ఆరోపణలను కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ఖండించారు. ఉద్యోగాలను కోరుకునే యువత నేడు ఉద్యోగాల సృష్టికర్తలుగా మారినట్లు తెలిపారు. ప్రపంచంలోని అత్యంత యువ దేశాల్లో భారతదేశం ఒకటి అని ఆయన తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ యోజన ద్వారా 1 కోటి కన్నా ఎక్కువ మంది యువత శిక్షణ పొందినట్లు వివరించారు. ముద్రా యోజన లబ్ధిదారుల్లో 70 శాతం మందికి పైగా మహిళలు ఉన్నారన్నారు. ఆ మహిళలు వ్యాపారాలను ఏర్పాటు చేయడానికి రూ.7.23లక్షల కోట్ల రుణాలు ఇచ్చి సహకరించినట్లు తెలిపారు. ఉద్యోగాలు కోరుకునేవారు నేడు ఉద్యోగాలను సృష్టించేవారిగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. నేడు ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు మాత్రమే ఉద్యోగాలను ఇచ్చే యాజమాన్యాలు కాదన్నారు. ఉపాధి, స్వయం ఉపాధి నిర్వచనాలు మారిపోతున్నాయన్నారు. స్టార్టప్ కంపెనీల విషయంలో భారతదేశం రెండో అతి పెద్ద కేంద్రమని గోయల్ తెలిపారు.

రక్షణ రంగానికి రూ.3 లక్షల కోట్లు

'మన సైనికులే మనకు గర్వకారణం. దేశ రక్షణలో వారి త్యాగాలు చిరస్మరణీయం' అని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. రక్షణ రంగానికి రూ.3 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు. అవసరమైతే మరిన్ని నిధులు ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. సైనికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడిఉందన్నారు. దేశ రక్షణలో సైనికుల త్యాగం నిరుపమానని ఆయన కొనియాడారు. సైనికులే దేశానికి గర్వకారణమన్నారు. 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వన్ మ్యాన్ వన్ పెన్షన్ అమలు చేశామన్నారు. ఇందుకోసం ఇప్పటికే రూ. 35 వేల కోట్లు విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు. సైనికులకు అలవెన్సులు, వేతన పెంపు చేపట్టామన్నారు.

ప్రపంచంలోనే తక్కువగా డేటా, ఫోన్ ఛార్జీలు

దేశంలో మొబైల్‌లో డేటా వినియోగం 50రెట్లు పెరిగిందని గోయల్ అన్నారు. డిజిటల్ రంగంలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ప్రపంచంలోనే డేటా, ఫోన్ ఛార్జీలు భారత్లో తక్కువగా ఉన్నాయన్నారు. జన్‌ధన్, ఆధార్, మొబైల్, డైరెక్ట్ ట్రాన్సాక్షన్లు కీలకంగా మారాయన్నారు. గత ఐదేళ్లలో 34 లక్షల కోట్ల జనధన్ ఖాతాలు ప్రారంభమయ్యాయని ఆయన వివరించారు.

కృత్రిమ మేథపై జాతీయ కేంద్రం

అత్యాధునిక టెక్నాలజీగా శరవేగంగా దూసుకొస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేథ)ను సమర్థంగా అందిపుచ్చుకునేందుకు పలు చర్యలు చేపడుతున్నట్టు ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. నేషనల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పోర్టలను పభుత్వం త్వరలో అభివృద్ధి చేస్తుందన్నారు. కృత్రిమ మేథపై ప్రభుత్వం జాతీయ కార్యక్రమాన్ని చేపట్టిందని గోయల్ వెల్లడించారు. ఈ కార్యక్రమం కింద కృత్రిమ మేథపై జాతీయ కేంద్రాన్ని (ఎన్సీఏఐ) ఏర్పాటు చేసి ఈ టెక్నాలజీని పెద్ద ఎత్తున ముందుకు తీసుకువెళతామని తెలిపారు. కృత్రిమ మేథకు హబ్‌గా వ్యవహరించే ఎన్సీఏఐ తోడ్పాటుతో సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను నెలకొల్పుతామని వెల్లడించారు. ఈమేరకు తొమ్మిది ప్రాధాన్యత రంగాలను గుర్తించారు.

రైల్వేకు రూ.64,500 కోట్లు

భారతీయ రైల్వేలకు రూ.64,500 కోట్లు కేటాయిస్తున్నట్లు పీయూష్ గోయల్ వెల్లడించారు. కాపలాదారులు లేని రైల్వే క్రాసింగ్‌లను తొలగించామన్నారు. అత్యధిక వేగంగా ప్రయాణించే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ త్వరలో రానున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే ఐదేళ్లలో భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏర్పడుతుందన్నారు. దేశంలో 100 ఎయిర్‌పోర్టులు క్రియాశీలకంగా ఉన్నాయన్నారు. ప్రపంచంలోనే రహదారుల నిర్మాణం భారత్లో వేగంగా సాగుతోందని, రోజుకు 27కి.మీ. రహదారిని నిర్మిస్తున్నామన్నారు. రవాణా వాహనాల్లో భారత్ జోరు కొనసాగుతుందని, ఎలక్ట్రానిక్ వాహన వినియోగం పెరిగిందన్నారు. 2030కల్లా ఈ రంగంలో భారత్‌దే సింహ భాగమన్నారు. 'సాగర్ మాల' కింద పోర్టుల ద్వారా సరకు రవాణా సులభం చేశామన్నారు. బ్రహ్మపుత్ర నది ద్వారా ఈశాన్య రాష్ట్రాలకు సరకు రవాణా కల్పించామని తెలిపారు. సోలార్ విద్యుదుత్పత్తిలో 10 రెట్ల వృద్ధి సాధించినట్లు పేర్కొన్నారు. మిజోరాం, మేఘాలయ రాష్ట్రాలను రైల్వేతో అనుసంధానించినట్లు తెలిపారు.

క్రీడలపై.. కాస్త కనికరం

కేంద్ర ప్రభుత్వం ఈ సారి క్రీడా పద్దుపై కాస్త కనికరం చూపించింది. 2019–2020కి గాను రూ.214.20 కోట్లను అదనంగా కేటాయించింది. క్రీడాకారులకు ప్రోత్సాహకాలను పెంచింది. కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో క్రీడలకు రూ.2216.92 కోట్లు కేటాయించారు. గతేడాది ఇది 2002.72 కోట్లు కావడం గమనార్హం. దీనివల్ల భారత క్రీడా ప్రాధికార కేంద్రాలు (సాయ్), జాతీయ క్రీడా అభివృద్ధి నిధి (ఎన్ఎస్డీఫ్)కి కేటాయింపులు పెరిగాయి. శాయ్కి అదనంగా రూ.55 కోట్లు కేటాయించారు. దీంతో ఈ పద్దు రూ.395 కోట్ల నుంచి రూ.450 కోట్లకు పెరిగింది. ఎన్డీఎస్ఎఫ్కు కేటాయింపులు రూ.2 కోట్ల నుంచి రూ.70 కోట్లకు పెంచారు. క్రీడాకారులకు ప్రోత్సాహకాలను రూ.63 కోట్ల నుంచి రూ.89 కోట్లకు పెంచారు. జాతీయ క్రీడా సమాఖ్య కేటాయింపుల్లో మార్పులేమీ లేవు. రూ.245 కోట్ల నుంచి రూ.245.13 కోట్లకు సరిపెట్టారు. క్రీడాకారులకు పురస్కారాలు ఇచ్చేందుకు అదనంగా రూ.94.07 కోట్లను ప్రకటించారు. ఈ పద్దు రూ.316.93 కోట్ల నుంచి రూ.411 కోట్లకు పెరిగింది. ఖేలో ఇండియా పద్దు సైతం రూ.50 కోట్లు పెరిగి రూ.601 కోట్లకు చేరింది.

గోయల్ నోట.. 'కోట్ల' మాట

లోక్‌సభలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో అడుగడుగునా పదాల వల్లెవేత సాగింది. బడ్జెట్ ప్రసంగంలో గోయల్ పలు మార్లు కోట్లు, ప్రభుత్వం, భారత్, పన్ను వంటి పదాలను అధికంగా వాడారు. బడ్జెట్ ప్రసంగంలో ఆయన కోట్లు అనేపదాన్ని ఏకంగా 80 సార్లు ప్రయోగించగా, విల్ అనే మాటను 76 సార్లు, ప్రభుత్వం అనే పదాన్ని 60 సార్లు వాడారు. ఇక పన్నును 46 సార్లు, లక్షలను 32 సార్లు బడ్జెట్ స్పీచ్లో ప్రస్తావించారు. ఇక సంవత్సరం అనే పదాన్ని 29 సార్లు, కూడా అంటూ 28 సార్లు మాట్లాడారు. పెంపు అనే పదాన్ని 23 సార్లు ప్రస్తావించారు.

ఆర్థికమంత్రిగా రెండోసారి.. తొలిసారి బడ్జెట్ ప్రసంగం

కాగా కేంద్ర ఆర్థిక మంత్రిగా రెండోసారి తాత్కాలిక బాధ్యతలు చేపట్టిన పీయూష్ గోయల్.. బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం మాత్రం ఇదే తొలిసారి. గత ఐదు సార్లు కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అరుణ్జైట్లీ ప్రస్తుతం అనారోగ్య కారణాల రీత్యా అమెరికాలో చికిత్స తీసుకుంటుండంతో గోయల్ మధ్యంతర బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెట్టారు. ఆయన ఆర్థిక మంత్రిగా తాత్కాలిక బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారి. గతేడాది మే నెలలో అరుణ్ జైట్లీ కిడ్నీ సంబంధిత శస్త్రచికిత్స కోసం ఆసుపత్రిలో చేరారు. ఆ సమయంలో గోయల్‌కు ఆర్థికశాఖ బాధ్యతలు అప్పగించారు. దీంతో 2018 మే నుంచి ఆగస్టు వరకు ఆయన ఈ పదవిలో కొనసాగారు. ఇటీవల జైట్లీ మరోసారి అనారోగ్యానికి గురై చికిత్స నిమిత్తం అమెరికా వెళ్లారు. దీంతో గోయల్ మళ్లీ తాత్కాలిక ఆర్థికమంత్రి హోదాలో లోక్‌సభలో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దీనికి ముందు బడ్జెట్ ప్రతుల సూట్‌కేస్‌తో ఆర్థిక శాఖ కార్యాలయం నుంచి బయల్దేరిన పీయూష్ గోయల్ ఆనవాయితీ ప్రకారం రాష్ట్రపతి కార్యాలయానికి వెళ్లి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిశారు. అంతకు మందు ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రి వర్గం తాత్కాలిక బడ్జెట్‌కుఆమోదం తెలిపింది.

బడ్జెట్ సూట్‌కేస్ రంగు మారింది..

బడ్జెట్ అనగానే ముందుగా గుర్తొచ్చేది ఆర్థిక మంత్రి చేతిలో ఉండే సూట్‌కేస్. బడ్జెట్ ప్రసంగం రోజున దాన్ని చూపిస్తూనే మీడియాకు పోజులిస్తారు. సాధారంగా ఇప్పటివరకు ఆర్థిక మంత్రులుగా పనిచేసిన వారంతా నలుపు, ముధురు గోధుమ రంగులో సూట్‌కేస్‌నే వాడారు. అయితే ఈ సారి దాని రంగు మారింది. మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఎరుపు రంగు సూట్‌కేస్‌తో పార్లమెంట్‌కు వచ్చారు.

పొగడ్తలకే పావుగంట.. ఇంతకీ బడ్జెట్ ఎక్కడ?

తాత్కాలిక ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ తన బడ్జెట్ ప్రసంగంలో తొలి పావుగంట నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని పొగిడేందుకే కేటాయించారు. అవినీతి నిర్మూలన, పారదర్శకత పెంపు, ద్రవ్యలోటు, ద్రవ్యోల్బణానికి కళ్లెం సహా కేంద్రప్రభుత్వం తీసుకున్న చర్యలను ఏకరువు పెట్టారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు ఆయన ప్రసంగానికి అడ్డుతగులుతూ... "ఇంతకీ బడ్జెట్ ఎక్కడ?" అని ప్రశ్నించడంతో ఆయన నవ్వుతూనే ప్రసంగం కొనసాగించారు. మోదీ ప్రభుత్వం హయాంలో రైతుల ఆదాయం రెట్టింపు అయ్యిందంటూ ఆయన వ్యాఖ్యానించినప్పుడు సైతం ప్రతిపక్షాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు.

బడ్జెట్‌పై పొగడ్తలు, విమర్శలు

- ఈ బడ్జెట్ ట్రయిలర్ మాత్రమే :మోదీ
- కిసాన్ సమ్మాన్ నిధి కేవలం బూటకం: రాహుల్‌గాంధీ
- కిసాన్ పథకం మాకు అవసరం లేదు :మమతా బెనర్జీ
- దేశానికి కేసీఆర్ రోల్ మోడల్ : ఎంపీ జితేందర్ రెడ్డి

ఢిల్లీ: కేంద్రబడ్జెట్‌పై బీజేపీలో హర్షం వ్యక్తమవుతుండగా.. ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్‌లో వ్యతిరేకత కనిపిస్తుండగా, మిగతా పార్టీల్లో విభిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. బడ్జెట్‌పై ఎవరేమన్నారు..

రానున్న పథకాలకు ఇది ట్రయిలర్ : ప్రధాని నరేంద్ర మోదీ..



రైతులు, మధ్యతరగతి వేతన జీవులు సహా అందరి ఆకాంక్షలను ప్రతిబింబించేలా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ బడ్జెట్ కేవలం ట్రైలర్ మాత్రమేనని సార్వత్రిక ఎన్నికల అనంతరం దేశాన్ని అభివృద్ధి బాటలో పరుగులెత్తిస్తామన్నారు. బడ్జెట్‌లో పలు వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపామన్నారు. ప్రభుత్వ పథకాల అమలు నేపథ్యంలో దేశంలో పేదరికం గణనీయంగా తగ్గుముఖం పట్టిందని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ పథకాల ద్వారా 1.5 కోట్ల మంది శాశ్వత గృహాలు నిర్మించుకున్నారన్నారు. పీయూష్‌గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో రైతులు, వేతన జీవులకు ఊరట ఇచ్చే చర్యలు చేపట్టారని మోదీ ప్రశంసించారు. 5 ఎకరాల్లోపు రైతులకు ఏడాదికి రూ 6000 పెట్టుబడి సాయంగా నేరుగా బ్యాంకు ఖాతాలో జమచేయనున్నారు. ఇక మధ్యతరగతి ప్రజలు, వేతన జీవులకు భారీ ఊరటగా ఆదాయపన్నుమినహాయింపు పరిమితిని రూ 5 లక్షలకు పెంచారు. అయిదు లక్షల లోపు ఆదాయం కలిగిన వారు ఎలాంటి పన్ను చెల్లించనవసరం లేదు.

ప్రధాన్ మంత్రి కిసాన్ పథకం వట్టి బూటకం :రాహుల్‌గాంధీ



కేంద్ర బడ్జెట్‌పై రాహుల్‌గాంధీ నిప్పులు చెరిగారు. రైతులకు కేవలం ఆరు వేల రూపాయలు ప్రకటించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ లెక్కన చూసుకుంటే ప్రతీరోజు రైతుకు కేవలం రూ. 17 మాత్రమే వస్తుందని ఇది రైతుల పాలిట అవమానకరంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తానికి మోదీ బడ్జెట్ వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు ఓ విఫలమైన ప్రయత్నమని ఎద్దేవా చేశారు.

కేంద్రం ఇస్తామన్న రైతు సాయం అవసరంలేదు : మమతా బెనర్జీ



కేంద్ర ప్రభుత్వ తాత్కాలిక బడ్జెట్ ప్రజలను మోసగించేలా ఉందని పశ్చిమ్ బంగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఆక్షేపించారు. కేంద్రం తమ పథకాలనే కేంద్రంలోని ఎన్డీయే సర్కార్ కాపీ కొట్టిందని విమర్శించారు. తాము ఇప్పటికే అమలు చేస్తున్న వాటిని కేంద్రం ఇవాళ కొత్తగా ప్రకటించిందని ఎద్దేవా చేశారు. కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని మండిపడ్డారు. రాష్ట్రాలను సంప్రదించకుండానే ఎలా నిర్ణయం తీసుకుంటారని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేయడానికి బడ్జెట్‌ను బీజేపీ మేనిఫెస్టోలా తయారు చేశారని ఆరోపించారు. కేంద్రం ఇస్తామన్న రైతు సాయం తమకు వద్దని, అరకొర సాయం తమకు అవసరంలేదని మమత తేల్చిచెప్పారు. ఐదెకరాలు గల రైతులకు ప్రతిఏటా ఆరు వేల రైతు సాయంను అందిస్తామని కేంద్రం బడ్జెట్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

కిసాన్ పథకం, రైతులకు దీర్ఘకాలం ప్రయోజనం : అమిత్ షా



కాంగ్రెస్ రైతు రుణ మాఫీ తాత్కాలిక ప్రయోజనాలు మాత్రమే చేకూరుస్తుందని, బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పథకం ద్వారా రైతులకు సుదీర్ఘకాలం పాటు ప్రయోజనం చేకూరుతుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా అన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయడంలో 'కిసాన్ సమ్మాన్ నిధి' కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు కిసాన్ సమ్మాన్ నిధి చాలా సహాయకారి అవుతుందని, రుణాలు తీసుకోని రైతులకు కూడా ఇందువల్ల మేలు జరుగుతుందని చెప్పారు. బ్యాంకు రుణాలు అనేవి ఒక్కసారి మాత్రమే రద్దవుతాయని, అదికూడా రుణాలు తీసుకున్న రైతులకు మాత్రమే దాని వల్ల ప్రయోజనం చేకూరుతుందన్నారు. 'రుణాలు తీసుకోని రైతులు కోట్లాది మంది ఉన్నారు. కేంద్రం స్కీమ్ వల్ల రైతులకు ప్రతి ఏటా ఉపయోగం జరుగుతుంది. రైతులకు ఇందువల్ల దీర్ఘకాలంలో ఎంతో మేలు జరుగుతుందని నా నమ్మకం' అని అన్నారు.


బడ్జెట్ మోదీ దార్శనికతకు అద్దం పడుతుంది: అరుణ్ జైట్లీ



ప్రస్తుతం అమెరికాలో చికిత్స పొందుతున్న కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ స్పందించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశానికి విధానపరమైన మార్గదర్శకత్వం లభిస్తోందని పేర్కొన్నారు. వరుస ట్వీట్లలో ఆయన ఏమన్నారంటే... "ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ దేశానికి ఇచ్చిన విధాన మార్గదర్శకాలలో కీలకాంశాలను నేడు పీయూష్ గోయల్ సమర్పించిన తాత్కాలిక బడ్జెట్ వెల్లడిస్తోంది" అని ఓ ట్వీట్లో జైట్లీ పేర్కొన్నారు. "గత ఐదేళ్ళలో తమ పనితీరును ఆత్మావలోకనం చేసుకుని వాస్తవాలను ప్రజల ముందు ఉంచడానికి నేటి ప్రభుత్వాలకు తాత్కాలిక బడ్జెట్లు కూడా ఓ అవకాశాన్ని ఇస్తున్నాయి" అని పేర్కొన్నారు. "అద్భుతమైన బడ్జెట్ను రూపొందించినందుకు పీయూష్ గోయల్కు అభినందనలు. ఈ బడ్జెట్ దేశం ముందు ఉన్న సవాళ్ళను సమగ్రంగా ఎదుర్కొనేందుకు నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ ఎజెండాను మరింత ముందుకు తీసుకెళ్తుంది" అని తెలిపారు.


"ఈ బడ్జెట్ ఆర్థిక దార్శనికతకు ఆచరణాత్మకంగా కట్టుబడి ఉంటూనే వ్యయాన్ని పెంచడానికి దోహదపడుతుంది" అని తెలిపారు.

ఎన్నికల ముందు అవకాశాన్ని వినియోగించుకున్నారు: మన్మోహన్ సింగ్



ఇది ఎన్నికల బడ్జెట్ అని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విమర్శించారు. ఈ బడ్జెట్లో రైతులు, మధ్యతరగతి ఓటర్లను ఆకర్షించేలా ఆర్థిక మంత్రి ప్రకటించిన వరాలు.. ఎన్నికలపై ప్రభావం చూపుతాయని మన్మోహన్ స్పష్టం చేశారు. మేలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బడ్జెట్ రూపంలో అంది వచ్చిన అవకాశాన్ని మోదీ ప్రభుత్వం సరిగ్గా వినియోగించుకుంది. ఈ బడ్జెట్లో మిడిల్ క్లాస్కు ఊరట కలిగించేలా రూ.5 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు, ఐదెకరాల లోపు భూమి ఉన్న ప్రతి రైతుకు ఏడాదికి రూ.6 వేల ఆర్థిక సాయం, అసంఘటిత రంగంలోని కార్మికులకు నెలకు రూ.3 వేల పెన్షన్లాంటి జనాకర్షక పథకాలను ప్రవేశపెట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు ఆర్థిక సాయం, మిడిల్ క్లాస్కు వరాలు కచ్చితంగా ఎన్నికలపై ప్రభావం చూపిస్తాయని మన్మోహన్ అభిప్రాయపడ్డారు.

ఎన్నికల బడ్జెట్: మల్లిఖార్జున ఖర్గే



లోక్ సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున్ ఖర్గే విత్తమంత్రి పియూష్ గోయల్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ను బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోగా అభివర్ణించారు. లోక్ సభ వాయిదా పడిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన పీయూష్ గోయెల్ లోక్ సభలో మధ్యంతర బడ్జెట్ పేర బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను చదివారని విమర్శించారు.

వాస్తవాలకు విరుద్ధం, అంకెల గారడీ : అఖిలేష్ యాదవ్



మోదీ బడ్జెట్‌పై అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ మోదీ బడ్జెట్ వాస్తవాలకు విరుద్ధంగా ఉందని, అంకెల గారడీ మాదిరిగా ఉందన్నారు. ఈ బడ్జెట్‌తో ప్రజలు తీవ్ర నిరాశ, నిస్పృహలతో ఉన్నారని మోదీ ప్రభుత్వం ఇక ఇంటికి వెళ్లడం ఖాయమన్నారు. ఈ ఒక్క ఏడాది బడ్జెట్‌లో పది సంవత్సరాల అబద్దాలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఓటాన్ అకౌంట్ కాదు అకౌంట్ ఫర్ ఓట్స్ : చిదంబరం..



కేంద్రం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ మాజీ ఆర్థిక మంత్రి పి. చిదంబరం పెదవి విరిచారు. ఇది ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఓట్ల కోసం చేసిన జిమ్మిక్కుగా వర్ణించారు. 'ఓటాన్ అకౌంట్ కాదు అకౌంట్ ఫర్ ఓట్స్' అంటూ ఎద్దేవా చేశారు. తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్.. కాంగ్రెస్ డిక్లరేషన్‌ను కాపీ కొట్టారని ఆరోపించారు. మధ్యంతర బడ్జెట్‌ను ఎక్కువసేపు చదివిన మంత్రిగా ఆయన నిలిచిపోతారని చిదంబరం వ్యంగ్యంగా అన్నారు.

మధ్యతరగతి కలల స్వప్నం ఈ బడ్జెట్ : యూపీ సీఎం యోగి



కేంద్రబడ్జెట్‌పై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ యోగి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతులు, ఉద్యోగులు, నిరుపేదలు, మధ్యతరగతి ప్రజల అభివృద్ధిని సూచించే విధంగా బడ్జెట్ ఉందని హర్షం వ్యక్తం చేశారు. బడ్జెట్ కారణంగా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఏదో ఒకరకంగా లబ్ధిపొందుతారన్నారు.

ఊరించి ఉసూరనిపించిన బడ్జెట్ : శశి థరూర్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంచనాలకు తగ్గట్టు లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, పార్లమెంటు సభ్యుడు శశిథరూర్ అన్నారు. ఊరించి ఉసూరుమనిపించిందని విమర్శించారు. మధ్యతరగతి వారికి ఇచ్చిన ఆదాయం పన్ను మినహాయింపు మాత్రం ఊరట కలిగిస్తుందన్నారు. వ్యవసాయ ఆదాయ మద్దతు పథకంలో భాగంగా ప్రతి సంవత్సరం నేరుగా రైతుల ఖాతాలో జమ చేసే రూ.6,000 ఏమూలకు సరిపోతుందని ప్రశ్నించారు. నెలసరి రూ.500 ఏవిధంగా రైతులకు మేలు చేస్తుందో చెప్పాలన్నారు. అంత చిన్న మొత్తంతో రైతు గౌరవప్రదంగా బతకడం సాధ్యమేనా అని నిలదీశారు.

కేసీఆర్ రైతు బంధు పథకం కాపీ కొట్టారు: ఎంపీ కవిత



సీఎం కేసీఆర్ చేపట్టిన రైతు బంధు పథకాన్ని కేంద్ర ప్రభుత్వం..కాపీ కొట్టిందని టీఆర్ఎస్ ఎంపీ కవిత అన్నారు. తన ట్విట్టర్ ద్వారా స్పందించిన కవిత కేసీఆర్ రైతు బంధును కేంద్రం కాపీ కొట్టిందని, కానీ అది సరిగాలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి రైతులకు పెట్టుబడి సాయంగా ప్రతి ఎకరాకు రెండు దఫాలుగా 5 వేలు ఇస్తోందని, కానీ కేంద్ర ప్రభుత్వం తమ పథకంలో 2 హెక్టార్లలోపు(ఐదు ఎకరాలు) ఉన్న ప్రతి రైతుకు ఏడాదికి రూ. 6 వేలు ఆర్థిక సాయం ప్రకటించినట్లు ఆమె చెప్పారు. మోదీ రైతు బంధును మరింత రిఫైన్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అయినా ఆ పథకాన్ని స్వాగతిస్తున్నట్లు ఆమె తెలిపారు. 33 శాతం మహిళల రిజర్వేషన్ అంశాన్ని తమ బడ్జెట్లో వెల్లడించలేదని కవిత అన్నారు. కచ్చితంగా ఇది ఎలక్షణ్ బడ్జెట్ అని అన్నారు. వేతన జీవులకు పన్నుమినహాయింపులు కల్పించారన్నారు.

తెలంగాణ రైతు బంధు ఆచరించడం సంతోషం: జితేందర్ రెడ్డి



సీఎం కేసీఆర్ రైతుబంధు పథకాన్ని కేంద్ర బడ్జెట్లో ఆచరించడం సంతోషమని ఎంపీ జితేందర్రెడ్డి అన్నారు. కేసీఆర్ రోల్మోడల్ ఆఫ్ కంట్రీ అనడానికి ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఆదాయ పన్ను పరిమితి రూ.5 లక్షలకు పెంచడాన్ని స్వాగతిస్తున్నామని, ఇది రాజకీయ బడ్జెట్గా తాము భావిస్తున్నామని చెప్పారు. బైసన్ పోలో భూముల్ని రాష్ట్రానికి బదలాయించాలని, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ని కలిశామని ఆయన తెలిపారు. రక్షణశాఖ భూముల బదలాయింపుపై ఇప్పటికే అనేకసార్లు ప్రధాని మోదీని కలిశామని జితేందర్రెడ్డి పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో అమలసాధ్యం కాని అంశాలు : ఎంపీ వినోద్



తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బంధు పథకాన్ని కేంద్రం కాపీ కొట్టిందని ఆ పార్టీ ఎంపీ వినోద్ అన్నారు. ఓటర్లను ఆకట్టుకునేలా కేంద్ర బడ్జెట్ ఉందని ఆయన విమర్శించారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్లో రాజకీయ లబ్దికి ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. బడ్జెట్లో చెప్పిన అంశాలు అమలు కావడం సాధ్యం కాదని తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి అమలులో ఇబ్బందులు వస్తాయన్నారు. రాష్ట్రానికి రావాల్సిన వాటిని ఐదేళ్లలో చాలా సాధించామని స్పష్టంచేశారు. చట్టంలో లేకపోయినా తెలంగాణకు ఎయిమ్స్ సాధించామని పేర్కొన్నారు. చాలా అంశాలకు సంబంధించి గెజిట్ విడుదల కావాల్సి ఉందని తెలిపారు.

కేంద్ర రైతు పథకం చాలా గొప్పది : డాక్టర్ లక్ష్మణ్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలో సమూల మార్పులు తెస్తుందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు. జీఎస్టీ, నోట్ల రద్దు వల్ల పారదర్శకత పెరిగిందని తెలిపారు. పెట్టుబడి సాయం కింద కేంద్రం ఇచ్చే రూ.6వేల నగదుతో తెలంగాణలో 50లక్షల రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. తెలంగాణ రైతు బంధు పథకానికి.. కేంద్ర పథకానికి తేడా ఉందని వివరించారు. 60ఏళ్లు నిండిన వారికి నెలకు రూ.3వేల పెన్షన్ ఇవ్వడం గొప్ప పథకమని కొనియాడారు.

రైతు బంధు పేరుమాత్రమే మారింది: కేటీఆర్ ట్వీట్



తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం అమలుచేస్తున్న రైతు బంధు పథకాన్నే కేంద్ర ప్రభుత్వం అనుకరించిందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇలా కేసీఆర్ మానసపుత్రిక లాంటి పథకం దేశ వ్యాప్తంగా కూడా అమలవుతూ రైతులకు లబ్ధి చేకూర్చడం ఆనందంగా వుందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న రైతు బంధు పథకం పేరును మాత్రమే కేంద్ర ప్రభుత్వం మార్చిందని...దాని స్ఫూర్తి మాత్రం అదేనని కేటీఆర్ అన్నారు. చివరగా జై కిసాన్ అంటూ కేటీఆన్ తన ట్వీట్ ముగించాడు.

ఓట్ల కోసమే కేంద్ర బడ్జెట్: పొన్నం ప్రభాకర్



ఓట్ల కోసమే కేంద్ర బడ్జెట్ ఉందని తెలంగాణ కాంగ్రెస్ నేత పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. బీజేపీ వ్యాపారస్థుల పార్టీ అని మరోసారి తేలిపోయిందన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా బడ్జెట్ ఉందని ఆరోపించారు. ట్యాక్స్ పరిధి పెంచి వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తామని చెప్పడం దారుణమన్నారు. బీజేపీ అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని ధ్వజమెత్తారు. దేశంలో ఏ స్కీమ్ వచ్చినా తామే ఆదర్శం అన్నట్టు కేటీఆర్, కవితలు గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

రాష్ట్రాల హక్కులు హరించేలా కేంద్ర బడ్జెట్: రావుల చంద్రశేఖర్‌రెడ్డి



కేంద్ర బడ్జెట్ టీ టీడీపీ నేత రావుల చంద్రశేఖర్రెడ్డి విసుర్లు విసిరారు. రాష్ట్రాల హక్కులు హరించేలా కేంద్ర బడ్జెట్ ఉందని ధ్వజమెత్తారు. బీజేపీ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ అని జోస్యం చెప్పారు. దిగిపోయే ముందు కూడా తెలుగు రాష్ట్రాలను కరుణించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఈ బడ్జెట్ ఉందన్నారు. నోట్ల రద్దు వల్ల ఏం జరిగిందో ఆర్థిక మంత్రి చెప్పలేదన్నారు. నోట్ల రద్దుతో దేశ ప్రజల మనసులను గాయపరిచారని తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరల నియంత్రణ చేయలేకపోయారని వ్యాఖ్యానించారు.

పత్యేక హోదా పై ప్రస్తాంచలేదు: ఏపీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు



ప్రత్యేక హోదా, విభజన సమస్యలపై కేంద్ర బడ్జెట్‌లో ఎందుకు ప్రస్తావించలేదని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగ బద్ధంగా వచ్చే నిధులూ ఎలాగూ వస్తాయి కానీ ఏపీకి ప్రత్యేకంగా కేటాయించిందేమీ లేదని యనమల విమర్శలు గుప్పించారు. కేంద్రం విచక్షణ మేరకు ఇచ్చే నిధులను నాన్‌బీజేపీ రాష్ట్రాలకు ఇవ్వడం లేదని వివక్ష చూపుతున్నారన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఏం చేశారు: నారా లోకేష్ ఏపీ మంత్రి



కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఏం చేశారని మంత్రి నారా లోకేష్ ప్రశ్నించారు. ఉద్యోగాల కల్పనపై బడ్జెట్‌లో కనీస ప్రస్తావనే లేదని ఆరోపించారు. ఇక రైతులకు అందించే సాయంపై కూడా కేంద్రం వైపు నుంచి స్పష్టత కరవైందన్నారు. రైతు సాయం కింద దేశం మొత్తానికి రూ.75వేల కోట్లే కేటాయించారన్నారు. ఒక్క ఏపీకే రూ.15వేల కోట్లు అవసరం ఉంటుందని వివరించారు. ఈ ప్రకారం కేంద్రం కేటాయించిన రూ.75వేల కోట్లు ఏం సరిపోతాయని అడిగారు.

ప్రధానికి కాపీ, పేస్ట్ మాత్రమే చేయడం వచ్చు: అసదుద్దీన్ ఒవైసీ



దేశం ఎదుర్కొంటున్న వ్యవసాయ సంక్షోభా న్ని పరిష్కరించడంలో తెలంగాణా సీఎం కేసీ ఆర్‌కు ఎక్కువ దూరదృష్టి ఉన్నట్లు ఈ అనుకరణ వెల్లడిస్తోంది. భారత ప్రధానికి కేవలం కాపీ, పేస్ట్ మాత్రమే చేయడం వచ్చునని, అసలైన ఆలోచన లు, దూరదృష్టి లేవని వెల్లడవుతోంది.

రోడ్డుకు సమాంతరంగా మ్యాన్‌హోల్స్ ఎత్తు పెంపు

విజయక్రాంతి, హైదరాబాద్: రోడ్డుకు దిగువగా ఉన్న సెవరేజీ మ్యాన్‌హోల్స్ వాల్వు ఛాంబర్లను రోడ్డుకు సమాంతరంగా పెంచాలని జీహెచ్ఎంసీ కమిషనర్, జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ ఎం.దానకిషోర్ తెలిపారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ, జలమండలి ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలోని 2వేల కిలోమీటర్ల రోడ్డుపై ఉన్న 8174 సెవరేజీ మ్యాన్‌హోల్స్, 1903 వాల్వు ఛాంబర్ల ఎత్తును రోడ్డుకు సమాంతరంగా పెంచేందుకు రూ.12.56 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ఎం. సత్య నారాయణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఎన్నికలు జరపండి

- కార్మికుల సమస్యలు పట్టించుకోని టీఎంయూ
- యూనియన్ ప్రధాన కార్యదర్శి హనుమంతు

విజయక్రాంతి, ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో గుర్తింపు సంఘాల ఎన్నికలు జరపాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ యాజమాన్యాన్ని కోరారు. శుక్రవారం హైదరాబాద్ విద్యానగర్ లోని యూనియన్ ప్రధాన కార్యాలయంలో హనుమంత్ ముదిరాజ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో గెలుపొందిన యూనియన్ కాల వ్యవధి గత సంవత్సరంలోనే పూర్తయింది, కాబట్టి వెంటనే ఆర్టీసీలో ఎన్నికలు జరపాలని కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ గంగాధర్‌ను కలిసి ఎన్నికలు జరపాలని కోరడం జరిగిందన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన టీఎం యూ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని ఆర్టీసీలో ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. కనీసం ఆర్టీసీలో ఉద్యోగ అవకాశాల నోటిఫికేషన్ విడుదలకు కృషి చేయలేదు, పైగా అద్దె బస్సులు పెంచి ఉద్యోగ అవకాశాలు కొల్లగొట్టారని తెలిపారు. కార్మికుల పక్షాన నిలబడినందు కు తమ యూనియన్‌కు కార్మికులు, ఉద్యోగుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో ఉన్న తెలంగాణ మజ్దూర్ యూనియన్, వివిధ యూనియన్‌లో ఉన్న నాయకులు ఆయా సంఘాలకు రాజీనామా చేసి తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్‌లో చేరుతున్నారని తెలిపారు. దీనిలో భాగంగా మహేశ్వరం, డిపో టీఎంయూ నాయకులు నరసింహ, ఆంజనేయులు, చారి, జగదీష్, ప్రవీణ్ తదితరులు రాజీనామా చేసి తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్‌లో చేరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ స్వాములయ్య, రాష్ట్ర కోశాధికారి రావు, రాష్ట్ర కార్యదర్శి ఆర్ ఎన్ రావు, జోనల్ అధ్యక్షులు కృష్ణ, రీజనల్ కార్యదర్శి రాజయ్య, ఎల్ఎస్ రెడ్డి, సత్తయ్య, ఆమనగల్ నర్సింహ, వెంకటేశ్, రసూల్, నారాయణ (సత్యం) వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించండి

- బీజేపీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్

విజయక్రాంతి, అంబర్‌పేట్: ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం కాచిగూడ డివిజన్‌లోని చప్పల్‌బజార్ హరిమస్జిద్ వద్ద రోడ్డుపై పెద్ద గుంత పడడంతో వాహనదరులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడం, చప్పల్‌బజార్ హనుమాన్ దేవాలయం దగ్గర డిక్లెటింగ్ సరిగ్గా చేయకపోవడం వల్ల మోరీలు నిండి ఇండ్లలోకి మురికి నీరు రావడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఆయన అక్కడికి చేరుకుని అధికారులకు విషయాన్ని ఫోన్ చేసి తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. డీఈ సుధాకర్, ఏఈ ఫారీద్, వర్క్ ఇనస్పెక్టర్ ప్రవీణ్‌లు ఈ సమస్యను పరిశీలించారు. వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్‌పటేల్, ఎం.నర్సింగ్‌రావు, అశోక్, వినోద్, భీంరాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్, అసీఫ్‌అల్లీ, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

విజయక్రాంతి, అంబర్‌పేట్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, ప్రతి నిత్యం యోగా సాధన చేయడం అలవర్చుకోవాలని నిజాం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎల్.బి.లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. రాజా బహదూర్ వెంకట్రామరెడ్డి మహిళా కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యూకేషన్ ఆధ్వర్యంలో నారాయణగూడలోని కళాశాల ఆడిటోరియంలో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో 'యోగా ఇంటర్ కళాశాల టోర్నమెంట్ ఫర్ ఉమెన్' పోటీలను నిర్వహించారు. లక్ష్మీకాంత్ రాథోడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ యోగాను జీవితంలో ఒక భాగం చేయాలని, క్రమం తప్పకుండా సాధన చేయడంతో మనలో ఉన్న రోగాలు అన్ని తొలగిపోయే అవకాశాలుంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఓయూ ఇంటర్ కళాశాల టోర్నమెంట్ సెక్రటరీ ప్రొఫెసర్ కె.దీప్లా, ఓయూ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ ప్రొఫెసర్ బి.సునీల్‌కుమార్, కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ జి.సుదర్శన్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శారద, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జె.అచ్యుతదేవి, యోగా పండిట్ బ్రిజ్‌భూషణ్, అనురాధ, నిర్మల్‌కుమార్, పావని తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌డీపీ పనుల్లో కదలిక

- అందుబాటులోకి దేశంలోనే తొలి ఎక్స్‌ట్రా డోస్ కేబుల్ బ్రిడ్జ్
- రూ. 23వేల కోట్ల వ్యయంతో పనులు

నగరం అందాలు చూడాలిక



విజయక్రాంతి, హైదరాబాద్: కొన్నిరోజులుగా మందగించిన స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ పనుల్లో ఎట్టకేలకు కదలిక వచ్చింది. సిగ్నల్ ఫ్రీ రవాణా వ్యవస్థతో పాటు టూరిజం అభివృద్ధికి చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టులను రూ.23వేల కోట్లతో చేపట్టాలని ప్రతిపాదించారు. నగరంలోని కీలకమైన 54 కూడళ్లలో గ్రేడ్ సపరేటర్లు, (ఫ్లై ఓవర్లు) వేసి 111 కి.మీ పొడవునా ఎలివేటెడ్ కారిడార్లు (స్కైవేలు) ఏర్పాటు చేయాలని తలపెట్టారు. మరో 166 కి.మీ పొడువు మేజర్ కారిడార్ ఏర్పాటుతో 348 కి.మీ పొడవున విశాలమైన రోడ్డు వ్యవస్థను అందుబాటులోకి తేవాలని ఈ బృహత్ ప్రణాళికను రూపొందించారు. విడతల వారీగా చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయగా, తొలి విడతగా రూ. 2982.64 కోట్ల పనులకు టెండర్లు ఖరారు చేశారు. గతేడాది నుంచి పనులు జరుగుతుండగా మరో రూ.2,500 పనులకు టెండరు ప్రక్రియ మొదలైంది. అయితే తొలివిడతలో రూ.448 కోట్లతో ఎల్బీనగర్ కారిడార్ పనులు జరుగుతున్నాయి. ఇందులో చింతల్ కుంట అండర్ పాస్, కామినేని ఎడమ బాగం ఫ్లైఓవర్లు పూర్తి కాగా ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. కానీ ఎల్బీనగర్ ఎడమ భాగం ఫ్లైఓవర్ గత ఏడాది సెప్టెంబర్, అండర్ పాస్ డిసెంబర్ నాటికి పూర్తి కావాల్సి ఉన్నా ముందస్తు ఎన్నికల ప్రభావంతో గుడువులోగా పూర్తి చేయలేకపోయారు. వీటితో పాటు కామినేని, బైరామల్‌గూడ కుడి భాగం ఫ్లైఓవర్లు మార్చి 2019కి, ఎల్బీనగర్ కుడి భాగం ఫ్లైఓవర్ జూన్ 2019 నాటికి పూర్తి కావాల్సి ఉంది. ఇందులో రూ.669 కోట్లతో పంజాగుట్ట నాగార్జున సర్కిల్ నుంచి దుర్గం చెరువు వరకు మేజర్ కారిడార్ నిర్మించనున్నారు. ఇందులో భాగంగానే రూ.184 కోట్లతో దుర్గం చెరువు కేబుల్ స్టేయిడ్ బ్రిడ్జ్ పనులు జరుగుతున్నాయి. రూ.80 కోట్లతో బంజారాహిల్స్ ఆస్కి నుంచి కేబీఆర్ పార్కు వరకు స్కైవే, రూ.20 కోట్లతో కేబీఆర్ వద్ద అట్ గ్రేట్, రూ.20కోట్లతో రోడ్, నెం, 45 వద్ద సెకండ్ లెవల్ ఫ్లైఓవర్, అదే చోట రూ.90 కోట్లతో మరోవైపు ఎలివేటెడ్ కారిడార్, ఏర్పాటు కానుంది. రూ.275 కోట్లతో ఇనార్బిట్ మాల్ నుంచి చిత్రపురి కాలనీ వరకు ఫ్లైఓవర్, టన్నెల్ మార్గంతో నానక్‌రామ్‌గూడ వద్ద ఓఆర్ఆర్‌ను అనుసంధానం చేస్తుంది.

దీనికి అదనంగా రూ.379 కోట్లతో మైండ్ స్పేస్ బయోడైవర్సిటీ కారిడార్ ఉంది. ఈ కారిడార్‌లో ఇప్పటివరకు అయ్యప్ప సొసైటీ అండర్‌పాస్, మైండ్‌స్పేస్ అండర్‌పాస్, మైండ్‌స్పేస్ ఫ్లైఓవర్ పనులు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. బయోడైవర్సిటీ ఫ్లైఓవర్‌ను మార్చి 2019 నాటికి పూర్తి చేయాలని గడువు పెట్టడం జరిగింది. రాజీవ్ గాంధీ ఫ్లైఓవర్ గతేడాది డిసెంబర్‌కు పూర్తి కావాల్సింది. కాని ముందస్తు ఎన్నికల కారణంగా పను లు పూర్తయినా అందుబాటులోకి రాకుండా పోయింది. ముందస్తు ఎన్నికలతో గత ఆరునెలలుగా వీటిపై పర్యవేక్షణ కరువైంది. దాంతో కాంట్రాక్టర్లు, అధికారులకు మార్గదర్శకం కరువవటంతో పనులు మందగించాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దటానికి నగర మేయర్ బొంతురామ్మోహన్ పనులను పరిశీలించి చేపట్టవలసిన చర్యలపై అధికారులకు ఆదేశాలివ్వటంతో కదలిక వచ్చినట్లైంది. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు, బయోడైవర్సిటీ జంక్షన్ వంతెన పనుల పురోగతిని పరిశీలించారు.

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, జోనల్ కమిషనర్ హరిచందన, ప్రాజెక్ట్ విభాగం చీఫ్ ఇంజనీర్ శ్రీధర్ లతో కలిసి పనులు జరుతున్న తీరును తెలుసుకున్నారు. 166 కిలోమీటర్ల విస్తీర్ణంలో మేజర్ కారిడార్ల నిర్మాణం, 348 కిలోమీటర్ల మేజర్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. రూ. 333.55 కోట్ల వ్యయంతో చేపట్టిన షేక్‌పేట ఎలివేటెడ్ కారిడార్, రూ. 263 కోట్ల వ్యయంతో చేపట్టిన కొత్తగూడ గ్రేడ్ సపరేటర్ వంతెనలను డిసెంబర్ మాసంలో పూర్తిచేయాలని నిర్ణయించారు. ఓవైసీ హాస్పిటల్ నుంచి బహుదూర్‌పుర మార్గంలో రూ. 132 కోట్ల వ్యయంతో చేపట్టిన కారిడార్ నిర్మాణాన్ని 2019 సెప్టెంబర్‌లో, అంబర్‌పేట చే నెంబర్లో రూ. 270 కోట్ల వ్యయంతో చేపట్టిన ఫ్లైఓవర్‌ను డిసెంబర్ మాసంలో పూర్తిచేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

టెండర్ల ప్రక్రియ లో రూ. 2,353 కోట్ల విలువైన పనులు

రూ. 2,353 కోట్ల విలువైన ఏడు ఫ్లైఓవర్లు, ఎలివేటెడ్ కారిడార్ల పనులకు టెండర్ ప్రక్రియ పురోగతిలో ఉంది. రూ. 426 కోట్ల వ్యయంతో ఇందిరా పార్కు నుంచి వీ.ఎస్.టి వరకు ఎలివేటెడ్ కారిడార్, రూ. 225 కోట్ల వ్యయంతో సైబర్ టవర్స్ ఎలివేటెడ్ రోటరి, రూ. 175 కోట్ల వ్యయంతో రేతిబౌలి, నానల్ నగర్ ఫ్లైఓవర్, రూ. 330 కోట్ల వ్యయంతో శిల్పా లేఅవుట్ నుంచి గచ్చిబౌలి వరకు ఫ్లైఓవర్, రూ. 523.37 కోట్ల వ్యయంతో నల్గొండ క్రాస్ రోడ్ నుంచి ఓవైసీ ఆసుపత్రి వరకు ఎలివేటెడ్ కారిడార్, రూ. 37కోట్ల వ్యయంతో చాంద్రాయణ గుట్ట ఫ్లైఓవర్ విస్తరణ పనులకు టెండర్ల ప్రక్రియ పురోగతిలో ఉంది. త్వరలోనే ఈ టెండర్లు పూర్తిచేసి పనులను ప్రారంభించే యోచనలో ఉంది జీహెచ్ఎంసీ. వీటితో పాటు రూ. 1186 కోట్ల వ్యయంతో ఖాజాగూడ టన్నెల్, ఎలివేటెడ్ కారిడార్, ఉప్పల్ కూడలి ఫ్లైఓవర్ పనులు అనుమతి దశలో ఉన్నాయి. వీటి నిర్మాణంతో హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అంచనా.

కేబుల్ బ్రిడ్జి నిర్మాణంతో కలిగే సౌకర్యాలు

హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్కుల నడుమ కేబుల్ బ్రిడ్జి ప్రత్యేక ఐకానిక్‌గా రూపొందనుంది. రోడ్డు నెంబర్ నెం 36, జూబ్లీహిల్స్, మాదాపూర్‌లపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గనుంది. జూబ్లీహిల్స్ నుంచి మైండ్ స్పేస్ , గచ్చిబౌలిలకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర దూరం తగ్గనుంది.

లబ్ధిదారులకు బీసీ వెల్ఫేర్ చెక్కులు పంపిణీ



విజయక్రాంతి, మెహిదీపట్నం: నానాల్‌నగర్ డివిజన్‌లోని ఎస్.ఎస్ ఫంక్షన్ హాలులో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహినుద్దీన్ శుక్రవారం బీసీ వెల్ఫేర్ లబ్ధిదారులకు 82 చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేటట్లు చూస్తానని, చిరు వ్యాపారులకు అండగా ఉంటాననీ తెలిపారు. కార్వాన్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నానాల్‌నగర్, లంగర్‌హౌజ్, గోల్కొండ, టోలీచౌకీలకు చెందిన కార్పొరేటర్‌లు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు టి.నరసింహులు, కేశవులు, లబ్ధిదారులతో పాటు ఎంఐఎం పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

అధిష్టానం ఆదేశిస్తే పార్లమెంట్‌కు పోటీ చేస్తా



- కూన శ్రీశైలంగౌడ్

విజయక్రాంతి, కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశిస్తే మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి పోటి చేస్తానని కూన శ్రీశైలంగౌడ్ తెలిపారు. శనివారం ఉదయం గాజులరామారంలోని విన్ ప్యాలేస్ ఫంక్షన్ హాల్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మున్సిపల్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కూన శ్రీశైలంగౌడ్ పాల్గొని కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తలు అందరు కష్టపడి పని చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలకు ఏవిధమైన ఇబ్బందులు కలిగిన అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఇదే స్ఫూర్తితో కార్యకర్తలందరూ కలిసి కట్టుగా ఉంటూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కాలనీ, బస్తీలలో పార్టీ అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. టీఆర్ఎస్ నాయకులు ఎవరైనా ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడితే బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని తెలిపారు. టీఆర్ఎస్ నాయకులు ఎవరైనా కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే వారిని ఎదుర్కొని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు అవకాశం ఇస్తే తప్పకుండా పోటీ చేస్తానన్నారు. ఇప్పటి నుంచి కార్యకర్తలు సంసిద్ధంగా ఉండి పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపీ కవితకు శుభాకాంక్షలు



విజయక్రాంతి, ఉప్పల్: ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు టీఆర్ఎస్ ఎంపీ కవితకు ఉప్పల్ టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండారి లక్ష్మారెడ్డి, డెంటల్ మెంబర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డాక్టర్ ప్రమోద్‌కుమార్‌లు గురువారం ఢిల్లీలో విజ్ఞాన భవన్‌లో జరిన కార్యక్రమానికి హాజరై హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని లోక్‌సభ సభ్యుల్లో 25 మందిని ఈ అవార్డుకు ఎంపిక చేయగా ఇందులో తెలంగాణ నుంచి ఎంపీ కవిత ఉన్నారని చెప్పారు. ప్రజాదరణ, కార్యశీలత, సామాజిక సేవా దృక్పథం, లోక్‌సభకు హాజరు, నియమనిబంధనలు పాటించడం, ప్రశ్నలడగటం తదితర అంశాల ఆధారంగా ఎంపీలను ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు. సర్వే నిర్వహించిన విభాగాల్లో ఎంపీ కవితకు 90 శాతం పైగా పాయింట్లు వచ్చాయని పేర్కొన్నారు.



ఆదిలీలా ఫౌండేషన్, న్యూఢిల్లీ మరియు సర్వేజనాః సుఖినో భవంతు సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ, హైదరాబాద్ సంయుక్తంగా 70వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా విశిష్ట ప్రతిభా పురస్కారాలు – 2019 నిర్వహించారు. హైదరాబాద్‌లోని లాలాపేటకు చెందిన శ్రీ వెంకటేశ్వర నృత్యానికేతన్‌కు చెందిన నాట్యగురువు, వ్యవస్థాపకురాలు ప్రతిభారాజ్‌గౌడ్‌కి "నృత్యగురురత్న" బిరుదుతో సత్కరించారు. హైదరాబాద్‌లోని డా. నందమూరి తారకరామారావు కళామందిరం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ జస్టిస్ పి.ఎస్. నారాయణ, రిటైర్డ్ జస్టిస్ జి. చంద్రయ్య, విశిష్ట అతిథిగా డా. లక్ష్మి పార్వతి, డా. పి. ఎన్. గోపినాథ్‌రెడ్డి, మండడి కృష్ణారెడ్డి, దైవజ్ఞశర్మ వారి చేతుల మీదుగా అందరికీ పురస్కారాలు అందజేశారు.

లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ



విజయక్రాంతి, రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు ఆడపిల్లల జీవితాల్లో వెలుగును నింపుతున్నాయని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్లోని శివరాంపల్లిలోని ఎస్‌వై. ఫంక్షన్ హాల్‌లో 151 మందికి కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల్లో చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలోని ఏ రాష్ట్రంలోని అమలు కానటువంటి పథకాలు ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. ఆదర్శవంతమైన సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఇంటింటికి నల్లానీరు, రైతుల రుణమాఫీ వంటి పథకాలు కూడా అద్భుతంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ తహసీల్దార్ రాములు, గ్రంథాలయ శాఖ రంగారెడ్డిజిల్లా డైరెక్టర్ డేవిడ్, కార్పొరేటర్ రావుల విజయజంగయ్య, కోరని శ్రీలత, నాయకులు జంగయ్య, మహాత్మా, పడమటి శ్రీధర్‌రెడ్డి, చలసాని విష్ణుమూర్తి, పి.ధర్మారెడ్డి, మునీరా బేగం, సత్యనారాయణ, షౌకత్ బాయ్, శివముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వీఐపీల పేర్లతో ఐడీ కార్డులు జారీ

విజయక్రాంతి, హైదరాబాద్: నాంపల్లి నియోజకవర్గంలో వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే ఇద్దరు వీఐపీలను ఓటర్లుగా నమోదు చేసిన బాధ్యులపై వేటు పడింది. ఇటీవల వెలుగు చూసిన ఈ ఘటనకు బాధ్యులైన మెహిదీటప్నం సర్కిల్లో సహాయ ఓటరు నమోదు అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న అసిస్టెంట్ సిటీ ప్లానర్ మహ్మద్ ఖలీలుద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఎం.దానకిషోర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ విషయంలో విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకుగాను ఓటరు రిజిస్ట్రేషన్ అధికారిగా ఉన్న డిప్యూటీ కమిషనర్ ఎం.కె.ఐ.అలీ, సూపర్‌వైజర్ విధులు నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ షేక్ హుస్సేన్లకు చార్జి మెమోలను జారీచేశారు.



ఆందోళన కలిగిస్తున్న ఇ-వ్యర్థాలు

పనికిరాని, కాలం చెల్లిన ఎలక్ట్రానిక్ పరికరాలను అందరూ పారేస్తుంటారు. ఫలితంగా వందల టన్నుల్లో ఇ-వ్యర్థాలు గుట్టలా పేరుకుపోతున్నాయి. ఇలాంటి ఇ-వ్యర్థాలతో సంవత్సరానికి దాదాపు 4,500 ఈఫిల్ టవర్లను నిర్మించవచ్చు. ఇలా పోగుపడిన ఇ-వ్యర్థాల బరువు ఏకంగా 1,25,000 బోయింగ్ 747 జంబో జెట్ల బరువుకు సమానమట. దావోస్ వేదికగా నిర్వహించిన ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో వెల్లడించిన నివేదికలో వాస్తవాలివి. ప్రస్తుతం చేతిలో స్మార్ట్‌ఫోన్, ఇంట్లో టీవీలు, వాషింగ్ మెషిన్లు, ఫ్రిజ్, ఆఫీసుల్లో కంప్యూటర్లు, లాప్‌టాప్‌లు ఇవన్నీ ఉపయోగాలు లేవని కాదు. అతి వాడకంతో రోజురోజుకు ఇ-వ్యర్థాలు పెరిగిపోతున్నాయి. వీటిని పునరుపయోగించడం చాలా కష్టమైనదే కాకుండా చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఇన్నాళ్లు గ్లోబల్ వార్మింగ్ గురించి ఆందోళన చెందగా, ఇప్పుడు ఇ-వ్యర్థాలు మరింత భయపెడుతున్నాయి. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా పోగవుతున్న వ్యర్థాల్లో ఇ-వ్యర్థాలు వాటా కేవలం 2 శాతం మాత్రమే కాగా పర్యావరణానికి కలిగించే హానిలో వీటి వాటా మాత్రం ఏకంగా 70 శాతం, అంటే ఇ-వ్యర్థాలు ఎంత ప్రమాదకరమో అర్థం చేసుకోవచ్చు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఇటీవల జరిగిన డబ్ల్యూఈఎఫ్ వార్షిక సదస్సులో ఈ ఇ-వ్యర్థాల గురించి చర్చించారు. పెరిగిపోతున్న ఇ-వ్యర్థాలను తగ్గించేందుకు తీసుకునే చర్యల్లో కాక, సులభంగా రీసైకిల్ చేసి రీయూజ్ చేసే మార్గాల గురించి పరిశోధనలు పెంచాలని నిర్ణయించారు. ఇ-వ్యర్థాలు నిజంగా బంగారు కొండలే. మనం వాడే స్మార్ట్‌ఫోన్ల తయారీలో చాలా తక్కువ మొత్తంలో బంగారం వాడతారని తెలిసింది. 100 టన్నుల బంగారు ధాతువులో లభించే బంగారం కంటే 100 టన్నుల స్మార్ట్‌ఫోన్లలో లభించే బంగారమే ఎక్కువ. వీటిలో బంగారమే కాక వెండి, రాగి, ప్లాటినం, పల్లాడియం వంటి విలువైన లోహాలు ఉంటాయి. వీటిని సరిగా రీసైకిల్ చేసే వీలు లేకపోవడం వల్ల ఏటా దాదాపు 4,35,000 టన్నుల మొబైల్ ఫోన్లను చెత్తలో పడేస్తున్నారు. ప్రతి ఏడాది ఇ-వ్యర్థాలు రీసైకిల్ చేయడం ద్వారా 62.5 బిలియన్ల సంపద లభిస్తుంది. ఈ మొత్తం కొన్ని దేశాల జీడీపీకి సమానం.

మోదీ మార్క్ బడ్జెట్

కేంద్ర ప్రభుత్వం గొంతెమ్మ కోర్కెలు కోరే పిల్లల తండ్రి లాంటిది. ఉన్న జీతంలోనే అందరి కోర్కెలు తీర్చాలి. అందరినీ సంతృప్తి పరచడం అసాధ్యం. ఆ అవసరాలను తీర్చాలంటే వనరులను సేకరించాలి. సేకరిస్తున్నప్పుడు ప్రజలకు నొప్పి కలగకూడదు. చాణక్యుడు చెప్పినట్టు పూల నుంచి తేనెటీగ ఎలా తేనెను సేకరిస్తుందో అలా వనరులను ప్రజల నుంచి సేకరించాలి. అదే సమయంలో వ్యవస్థాగత పటిష్ఠతకు పెద్ద పీట వేయాలి. తక్షణ ప్రయోజనాలను, శాశ్వత లాభాలను సమతూకం చేయగలగాలి. ఈ పనిని ఎంత తెలివిగా చేయగలరన్న అంశం ఆయా ప్రభుత్వాల నైపుణ్యం, సామర్థ్యం, చాతుర్యాలపై ఆధారపడి ఉంటుంది.

నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ నైపుణ్యం, సామర్థ్యం, చాతుర్యం పుష్కలంగా కనిపిస్తుంది. ఎన్నికల వేళ రాజకీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుంటూనే, గత నాలుగేళ్లుగా కొనసాగిస్తున్న ఆర్థిక పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కొనసాగించడం ఈ మధ్యంతర బడ్జెట్ ప్రత్యేకత. నిజానికి గత నాలుగున్నరేళ్లుగా మోదీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ క్రమబద్ధీకరణ దిశగా, ఆర్థికలావాదేవీలను వ్యవస్థితం చేసే దిశగా పలు చర్యలు తీసుకుంది. జనధన్ ఖాతాల పేరిట దేశ జనాభాని మొత్తం బ్యాంకింగ్ రంగంతో జోడించడం, ప్రతి ఖాతాను పాన్, ఆధార్ కార్డులతో అనుసంధానం చేయడం వంటి చర్యల ద్వారా ప్రభుత్వానికి తెలియకుండా ఆర్థిక లావాదేవీలు జరపలేని పరిస్థితిని తీసుకువచ్చింది. మరో వైపు నోట్ల రద్దు, జీఎస్‌టీల ద్వారా డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడం, పన్ను చెల్లింపులను పెంచడం జరిగింది. దీని ఫలితాలు ఈ తాజా బడ్జెట్‌లో చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ప్రత్యక్ష పన్నుల సేకరణ 2013-14 లో రూ. 6.38 లక్షల కోట్ల వరకూ ఉండగా, ఇప్పుడది రూ. 12 లక్షల కోట్ల వరకూ పెరిగింది. అదే విధంగా పన్ను చెల్లింపుదారుల సంఖ్య కూడా 2013-14 లో ఉన్న 3.79 కోట్ల నుంచి 6.85 కోట్లకు పెరిగింది. నల్లధనాన్ని అరికట్టే దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల ప్రభుత్వానికి కొత్తగా 1.30 లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. అదే విధంగా 3.38 లక్షల షెల్ కంపెనీలను ప్రభుత్వం గుర్తించి, వారి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. నోట్ల రద్దు తరువాత తొలి సారి ఒక కోటి మంది ప్రజలు ఆదాయపు పన్ను రిటర్న్‌లు సమర్పించారు. ఆధార్, బయోమెట్రిక్ లింకేజీలతో లీకేజీలను గణనీయంగా తగ్గించడం జరిగింది. దేశంలో రోడ్ల పొడవు మూడింతలు పెరిగింది. దేశంలోని 17.84 లక్షల ఆవాసాలలో 15.8 లక్షల ఆవాసాలకు నేడు రోడ్డు సదుపాయం ఉంది. దీని వలన కలిగిన లాభాలను అయిదేళ్ల 'లిమిటెడ్ ఓవర్ల మ్యాచ్' లో 'పించ్ హిట్టింగ్' (చితకబాదుడు) కోసం అయిదో బడ్జెట్‌లో ఉపయోగించుకున్నట్టు ఈ బడ్జెట్ ను చూస్తే స్పష్టంగా కనిపిస్తుంది.

మోదీనామిక్స్ మరో ప్రత్యేకత ఏమిటంటే ఆయన ఆర్థిక క్రమశిక్షణ, లావాదేవీల వ్యవస్థీకరణతో పాటు సంక్షేమ పథకాలపై తొలి బడ్జెట్ నుంచీ దృష్టి పెడుతూనే ఉన్నారు. తొలి బడ్జెట్‌లో ముద్రా యోజన, రెండవ బడ్జెట్‌లో ఉజ్వల యోజన, మూడవ బడ్జెట్‌లో ఉజాలా, నాలుగవ బడ్జెట్‌లో ఆయుష్మాన్ భారత్ పథకాలను ముందుకు తెచ్చారు. ఇవన్నీ సామాజిక సురక్ష, సంక్షేమ ఆధారిత పథకాలే. ఈ పథకాలన్నీ ఇప్పటికీ సువ్యవస్థితం కావడం వల్ల సత్ఫలితాలను ఇచ్చే పరిస్థితి ఏర్పడింది. నోట్ల రద్దు, జీఎస్టీ, ఆదాయపు పన్ను చెల్లింపులను క్రమేపీ సరళతరం చేయడం వల్ల సరిగ్గా ఎన్నికల ఏడాదికి ఇవన్నీ ఒక గాడిలో పడ్డాయి. దీంతో మోదీకి సానుకూల వాతావరణం ఏర్పడింది. వీటన్నిటినీ ఉపయోగించుకుని ఎన్నికల వేళ వ్యవసాయ రంగానికి కనీస ఆదాయ కల్పన, ఉద్యోగులకు పన్ను రాయితీలు, వ్యాపారులకు సరళీకృత పన్ను చెల్లింపు విధానాలు అమలు చేయడం సాధ్యమైంది. ఈ విధంగా ఆయన మౌలిక ఆర్థిక విధానాల నుంచి పక్కకు తొలగకుండానే రాయితీలు, తాయిలాలు ఇవ్వగలిగారు.

నిజానికి ప్రజల ఆర్థిక వ్యవహార శైలిని మార్చడమే మోదీ ప్రభుత్వ లక్ష్యం. పన్ను చెల్లించకుండా తప్పించుకోలేమన్న భావన కలిగితే ప్రజలు పన్నులు చెల్లిస్తారు. ఇందుకు గాను ముందుగా కఠిన నిర్ణయాలను తీసుకుని, వాటిని నిక్కచ్చిగా అమలు చేసి, ఆ తరువాత వాటిలో సరళీకరణ చేయడం, రాయితీలను కల్పించడం మోదీ వ్యవహారశైలి ప్రత్యేకత. మోదీ క్రాస్ రోడ్‌లో కెమెరా, లాఠీ పుచ్చుకుని నిలుచుండే ట్రాఫిక్ పోలీసు లాంటివాడు. లాఠీ దెబ్బ భయం, కెమెరా ఫోటో భయంతో ప్రజలు ట్రాఫిక్ నియమాలను పాటిస్తారు. నోట్లరద్దు, ఆధార్ పాన్ లింకేజి, జీఎస్‌టీలు, బయో మెట్రిక్ విధానాల అమలు ఇందుకు ఉదాహరణలు. గతంలో ప్రభుత్వాలు ఆర్థిక లావాదేవీల విషయంలో ట్రాఫిక్ సిగ్నల్ దగ్గరి హోంగార్డులా వ్యవహరించాయి. హోం గార్డుకు విజిల్ వేసే అధికారమే ఉంటుంది. నియమాలను పాటించని వారిపై చర్యలు తీసుకునే అధికారం ఉండదు. దాంతో ప్రజల్లో భయం, భక్తీ రెండూ ఉండవు.

మోదీ వ్యూహచతురత వల్లే తాయిలాలు ప్రకటిస్తూనే మౌలిక ఆర్థిక పునర్వ్యవస్థీకరణ లక్ష్యాల దారి నుంచి ఆయన పక్కకు వెళ్లలేదు. ఫలితంగా సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే ఆయన ఆర్థిక సంస్కరణవాదాన్నీ కొనసాగించే వ్యక్తిగా నిలువగలిగారు. ఈ విధంగా జోడు గుర్రాల సవారీ సమర్థవంతంగా చేయగలగడమే ఈ బడ్జెట్ ప్రత్యేకత.

కలసిమెలసి ఉండడమే సంఘటితం కావడం



16-సంఘటిత్వం

సంఘటితం అంటే కలవడమే. కలసిమెలసి ఉండడమే సంఘటితం కావడం. చేతులు కలవడం భౌతికంగా సంఘటితం కావడం, అడుగులు కలిసివేయడం వైఖరులు సంఘటితం కావడం, అభిప్రాయాలు కలవడం వివేకంతో సంఘటితం కావడం, అనుభూతులు సంయోగం చెందడం ఉద్వేగంగా సంఘటితం కావడం. ఆత్మలను ఏకం చేయడం చైతన్య, బ్రహ్మానందస్థితులలో సంఘటితం కావడం.

నీవు సంఘటితమైతే గొలుసులో కొక్కేనివి అవుతావు. నీవు సంఘటితమైతే ఒక కార్యక్రమంలో భాగస్వామివి అవుతావు.

నీవు వ్యక్తులతో సంఘటితమైతే, నీ వనరులు, శక్తులు రెట్టింపు అవుతాయి.

జ్ఞానం ఒక శక్తి అనీ, సంపద ఒక శక్తి అనీ, బలం ఒక శక్తి అనీ నీకు తెలుసు. ఇవి మూడూ విశ్వశక్తులు. నీకు జ్ఞానం ఉంటే శక్తి ఉన్నట్టే, సంపద ఉంటే శక్తి ఉన్నట్టే, బలం ఉంటే శక్తి ఉన్నట్టే.

నీకు జ్ఞానం ఉండి సంపద, బలం లేకపోతే పెట్టుబడులు, రక్షణ లేనట్టే. నీకు సంపద ఉండి బలం, జ్ఞానం లేకపోతే విధానాలు, రక్షణ లేనట్టే, నీకు బలం ఉండీ జ్ఞానం, సంపద లేకపోతే బలవంతురాలివైనా విధానాలు పెట్టుబడులు లేనట్టే.

జ్ఞానం, సంపద, బలాలను సంఘటితం చేస్తే నీకు విధానాలు, పెట్టుబడులు, రక్షణ ఉన్నట్టే. కనుక సంఘటిత శక్తే అద్భుతశక్తి, అదే పరాశక్తి. తల్లులకే తల్లి.

కనుక ప్రియమైన సుప్రియా! విద్వాంసులతో, గురువులతో, ఉపాధ్యాయులతో, విద్యార్థులతో, సంస్థలతో, సమాజాలతో ఇంటర్నెట్‌తో సంఘటించి శ్రేష్ఠమైన సంఘటితశక్తిని పొందు.

నీ విద్యార్థులతో, అందరితో మనస్సులతో సంఘటించి అతిశయబాంధవ్య వ్యక్తివి కా!

సంఘటితం ఒక సంతోషం. చేతులు కలిపి ఊపడం, ఆలింగనం, చేతులు కలపడం, భుజాలను స్పృశించడం, కన్నులు కలపడం అద్భుత ఆనందాన్నిస్తుంది.

సమూహ నిర్మాణశక్తికి, స్ఫురణలను కలుపుతూ ఆనందాన్ని కలిగించు. సమూహంగా పనిచేసి సంఘటితశక్తిని ఆస్వాదించు.

సంఘటితం కావడం జీవితం, అసంఘటితం కావడం మరణం. ఉన్నతమైన జీవితానికి ఉన్నతమైన శక్తితో కలువు.

నీ సమూహ సభ్యులను, కుటుంబసభ్యులను బొటనవేలులా కేవలం సంప్రదించడం కాకుండా, బొటనవేలుతో అందరినీ సంఘటిత సమూహంగా చేయి.

సంఘటితను పొందు, సంఘటితమైన స్వతంత్రతను ఆస్వాదించు.

సంఘటితం అమృతం

సంఘటితం కావడానికి చైతన్య మార్గాలు:

1. టెలిఫోన్, ఉత్తరాలు, ఇ-మెయిల్స్, ఇంటర్నెట్‌ల ద్వారా కలుస్తూ ఉండు.
2. భిన్నమైన ప్రదేశాలలో కలసి సాధించడానికి స్థిరమైన భాగస్వామ్యాన్ని పెంచుకో!
3. సమూహంగా పనిచేసి మీ శక్తులను రెట్టింపు చేయండి. సమూహకార్యం అంటే (GOD) G గ్రూప్ - సమూహం, O ఆర్గనైజేషన్ - సమిష్టి కృషి, D డైరెక్షన్ - మార్గదర్శకత్వం. (DOG) D డిస్ O ఆర్గనైజ్డ్ G గ్రూప్. మార్గదర్శకత్వం లేని సమూహం. అత్యంత శక్తి కలిగిన సమూహంగా సంఘటితం కావడానికి మార్గదర్శకత్వంలేని గ్రూప్ నుండీ సమిష్టి కృషితో కూడిన మార్గదర్శకత్వం కలిగిన సమూహానికి కదలిరా.
4. రెండు చేతులూ కలిపి నమస్తే అని పలకరించు.
5. చేతులు కలిపి స్నేహాన్ని విస్తరించు.
6. ఆలింగనం చేసుకొని ఏకభావనను అనుభవించు.
7. టీచర్స్ అసోసియేషన్, బరోడా మేనేజ్‌మెంట్ అసోసియేషన్, ఇగ్నో వంటి ఇతర సంస్థలతో సంఘటితం కా!
8. నీ విద్యార్థుల తల్లిదండ్రులతో సంఘటితం కా!
9. ఎల్లప్పుడూ పిల్లలు, కుటుంబసభ్యులు, పెద్దలు, మీ తల్లిదండ్రులతో సంఘటితం కా!
10. సంఘటిస్తూ దివ్యత్వాన్ని అందుకో!



గట్టు నారాయణ (గురూజీ)

ప్రజాపోరాటంగా అభివర్ణించిన సి.పి(యం.యల్)

(నిన్నటి తరువాయి)

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమాన్ని సి.పి.(యం.యల్) ప్రజాపోరాటంగా అభివర్ణించింది. అప్పుడు పీపుల్స్ వార్ గ్రూప్ ఏర్పాటు కాలేదు. అందువలన నాటి యం.యల్. పార్టీ ప్రచారసాధనాలలో ఒకటైన 'సృజన' 44వ సంచిక, 1973లో ప్రచురించిన సి.పి.యం.యల్. అభిప్రాయాలను వార్ గ్రూపువారు ఇటీవల కాలంలో పార్టీ అభివృద్ధి క్రమం 'రెక్టిఫికేషన్' అనే గ్రంథం మొదటి భాగంలో 'సృజన' వ్యాసాన్ని పునర్ముద్రించారు. ఈ వ్యాసంలో కొన్ని భాగాలు దిగువన యథాతథంగా పేర్కొంటున్నాను.

రాష్ట్ర విభజనోద్యమం - మార్క్సిజం:

గత అయిదారు మాసాలుగా ఆంధ్ర ప్రాంతమంతటా రాష్ట్ర విభజన కోసం ఇదివరకెన్నడూ లేని స్థాయిలో ఉద్యమం కొనసాగుతోంది. ఆ ఉద్యమాన్ని అణచివేయడానికి కేంద్రప్రభుత్వం వేల సంఖ్యలో సి.ఆర్.పి.నీ, సైన్యాన్ని తరలించింది. ఆంధ్ర పట్టణాలన్నీ దాదాపు సైనిక శిబిరాలుగా మారాయంటే అతిశయోక్తి కాదేమో. లాఠీచార్జీలు, రోజులకొలది కర్ఫ్యూలు ప్రకటించడం, కదిలితే మెదిలితే తుపాకి కాల్పులు సర్వసాధరణమైనాయి. కాంగ్రెస్ నాయకత్వం ఆచరణలో పోరాటానికి వెన్నుపోటు పొడవడం మూలంగా తాత్కాలికంగా ఉద్యమం నీరసించినట్లు కనిపిస్తున్నా, మొత్తం ఆంధ్రప్రజానీక మంతటిలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల తీవ్రమయిన ద్వేషాగ్ని ప్రజ్వరిల్లుతోంది. ప్రజలు సి.ఆర్.పి.నీ సైన్యాన్నీ ఎదుర్కొని పోరాడారు. శాంతియుత పద్ధతులకు ఉద్యమాన్ని కుదించాలని కాంగ్రెసు నాయకులు చేసిన ప్రయత్నాన్ని ఎవరూ ఖాతరు చేయలేదు. బారికేడ్లు కట్టడం, సోడా బాటిల్సుతో బాహాబాహీ పోరాడడం, నాటుబాంబులు ప్రయోగించడం మొదలయిన పోరాటరూపాలు ఆంధ్రపట్టణాలలో మొట్టమొదటిసారిగా అమలులోకి వచ్చాయి. ఆ రూపాలు ఈనాడు సర్వసాధారణమైనాయి కూడ.

ఈ పోరాటానికి నిరుద్యోగంతో బాధపడుతున్న విద్యార్థులు, యువకులు, అధికధరలతో చాలీచాలని జీతాలతో చావలేక బతుకుతున్న మధ్య తరగతి వారు కూడా ప్రాణం. ఆంధ్రప్రదేశ్ మొత్తం ప్రజానీకం అంతా ఈ పోరాటానికి మద్దతుగా ఉంది. ఈ పోరాటానికి వ్యతిరేకంగా గజ్జకట్టి నిలబడింది కేంద్ర ప్రభుత్వమూ, కమ్యూనిస్టుపార్టీ పేరుతో చలామణిలో ఉన్న సి.పి.ఐ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)లు. తనకున్న అధికారబలాన్ని, మిలటరీ బలాన్ని కేంద్రీకరించి ప్రజావాంఛను నిర్దాక్షిణ్యంగా అణచివేయడానికి ఇందిరాగాంధీ సిద్ధపడితే అది అసలు ప్రజాపోరాటమే కాదనీ, కేవలం కొద్ది మంది బూర్జువా భూస్వాములు మొదలయిన ప్రజాద్రోహులు కొనసాగిస్తున్న విచ్ఛిన్న చర్యలు మాత్రమేననీ, రాష్ట్రాన్ని విభజించడం జాతిపట్ల తీరని అపచారమే కాకుండా, మార్క్సిజానికికూడా పూర్తి వ్యతిరేకమనీ సి.పి.ఐ., మార్క్సిస్టుపార్టీ వారు తీవ్రతరంగా ప్రచారం చేస్తూ, తమ అనుచరుల్ని ఈ పోరాటానికి వ్యతిరేకంగా సమీకరించడానికీ, తద్వారా ఈ పోరాటాన్ని వెన్నుపోటు పొడవడానికి పడరానిపాట్లన్నీ పడుతున్నారు.

పైగా ఎట్టి పరిస్థితులలోను పోరాటం యొక్క ఒత్తిడికి లొంగిపోవద్దని సి.పి.ఐ వారు ఇందిరాగాంధీని హెచ్చరిస్తూ తీర్మానాలు కూడ చేస్తున్నారు. ఈ పోరాటాన్ని వ్యతిరేకిస్తూ ఇందిరాగాంధీ చెబుతున్న కారణాలు చాలా పేలవమైనవి. అందుకు జవాబు అనేక రూపాలలో చాలా మంది ఇది వరకే వ్రాశారు. 'కమ్యూనిస్టు పార్టీ' వారు ఈ పోరాటానికి వ్యతిరేకంగా పీడిత ప్రజలను సమీకరించటానికి, మార్క్సిజం పట్ల అభిమానం ఉన్నవారిలో గందరగోళం లేపడానికి ఈ వాదనలు చేస్తున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించే వారు చేసే వాదన లన్నింటినీ ఈ వ్యాసం సవివరంగా చర్చించి వాటికి తగిన రీతి జవాబు చెప్పి, దిగువ అభిప్రాయాలనూ వెల్లడించింది.

1956లో తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాలు ఒకే రాష్ట్రంగా సంలీనమైనప్పటికీ రెండు ప్రాంతాల ప్రజల మధ్య సుదృఢమైన సంఘీభావం ఏర్పడలేదు. అంతే కాదు శతాబ్దాల తరబడి వేరు వేరు పరిపాలన క్రింద జీవించడానికి అలవాటు పడి ఉండడం మూలంగా ఆంధ్రులు వేరు, తెలంగాణా వారు వేరు అనే మనస్తత్వం ఇరు ప్రాంతాల్లోనూ మాసిపోలేదు. ఈ ప్రభుత్వం ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలను పూర్తి చేయగలిగినట్లయితే అంటే ఫ్యూడలిజం నిర్మూలించబడి, ప్రజల ఆర్థిక జీవితం సాఫీగా అభివృద్ధి జరిగిఉంటే ఈ క్రమంలో రెండు ప్రాంతాల మధ్య వేర్వేరు మనస్తత్వాలు నశించి సమగ్రమైన జాతిగా రూపొందేవి. కానీ అలాంటిది జరగనందువల్ల ఉభయ ప్రాంతాలలోని భూస్వామ్య పెట్టుబడిదారీ వర్గాలు తమ స్వప్రయోజనాల కవసరమైనప్పుడల్లా ప్రజలలో ఉన్న వేర్పాటు మనస్తత్వాన్నీ, జనరల్‌గా ప్రభుత్వంపై తీవ్రతరంగా నున్న అసంతృప్తినీ వినియోగించుకొని ప్రాంతీయ విభేదాల్ని రెచ్చగొట్టడం తేలికైంది. (ఆంధ్ర నాయకులు పార్టీ రహితంగా తెలంగాణ ప్రజలకు 1956లో అంతకు ముందు శాసనసభలో, వెలుపల ఇచ్చిన బహిరంగ హామీలన్నింటినీ నూతన రాష్ట్రం ఏర్పడగానే విస్మరించి ధగా బాజీలు అని పేరు తెచ్చుకున్నారు) కేంద్ర ప్రభుత్వంలోని పాలక వర్గాలు తమ స్వప్రయోజనాల దృష్ట్యా ఒకప్పుడు ఒక ప్రాంతం వారికి, మరొకప్పుడు ఇంకొక ప్రాంతం వారికి మద్దతునిస్తూ రావడం కూడా ఈ ప్రాంతీయ విభేదాలు మరింత పెరగడానికి తోడ్పడింది. దాని పర్యవసానమే 1969లో ప్రత్యేక తెలంగాణా కొరకు పోరాటం. ఇది ఒక్క ఆంధ్రప్రాంతం లోనే కాదు, ఎక్కడెక్కడైతే శతాబ్దాలుగా వేరువేరు ప్రభుత్వాల క్రింద (స్వదేశసంస్థానాలుగాని, బ్రిటీషు ప్రభుత్వంలోని రాష్ట్రాలుగాని) జీవించడానికి అలవాటుపడ్డ ప్రజలలతో సమైక్య రాష్ట్రాల నిర్మాణం జరిగిందో, వివిధ స్థాయిల్లో అక్కడల్లా ఇలాంటి ప్రాంతీయ విభేదాలు తలయెత్తడం, అవి చరమస్థాయినందుకొన్న తర్వాత రాష్ట్ర విభజనోద్యమంగా రూపొందడం భారతదేశమంతటా కనిపిస్తోంది. ఇది మరో ప్రత్యేకత... (సశేషం)

\- ఆదిరాజు వెంకటేశ్వర రావు

ఆధ్యాత్మికతను సమాజసేవగా మార్చిన మహనీయుడు

అభినవ బసవేశ్వరుడు శివకుమార స్వామిజీ

శివకుమార స్వామిజీ నడిచే దైవం, కాయక యోగి, వీరశైవలింగాయతులు ఆరాధ్యదైవం, త్రివిద దాసోహి, శతమానపు శతయుష్కులు, మహాత్మ బసవేశ్వరుని రచనలు సేవాభావానికి ప్రేరేపితుడై ఆధ్యాత్మికతకు కొత్త అర్థం చెప్పి ఆధ్యాత్మికతను సమాజసేవగా మార్చిన మహనీయుడు. కేవలం ప్రవచనాలు, ఉపదేశాలతో ప్రజలకు ఉపశమనం లభించదని బోధనలు కొనసాగిస్తూనే ప్రజల కష్టాలను తీర్చాలని, రేపటి ఆశాదీపాలైన బాలలకు ఉచిత విద్య, వసతి కల్పించాలని పూనుకొని కులమత ధర్మ లింగ వర్గ వర్ణ ప్రాంత రహితంగా నిరుపేదలకు అన్నం, ఆశ్రమం విద్యను అందించిన అభినవ బసవేశ్వరులు. 12వ శతాబ్దం నాటి సంఘసంస్కర్త బసవన్న అవతారం శివకుమార స్వామిజీ. సామాన్య కుటుంబంలో జన్మించిన స్వామిజీ దీన దళిత బడుగు బలహీన వర్గాల్లో వెలుగులు నింపి సర్వమానవ సమానత్వం నిరాడంబరత పాటించారు. సమాజసేవకు అత్యంత ప్రాధాన్యమిచ్చిన స్వామిజీ, సమాజ మనుగడకు మతం కాదు, మానవత్వం ముఖ్యమని మహాత్మ బసవేశ్వరుని ఆశయాలకు అనుగుణంగా కుల రహిత సమాజం కోసం నిరంతరం కృషి చేశారు. ఆధ్యాత్మికతకు కొత్త అర్థం చెప్పిన ఆధునికుడు స్వామిజీ, మఠాల పీఠాల గమ్యాలు మారాలని కొత్త లక్ష్యాలతో, కొత్త మార్గాలలో నడవాలని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. కాలం కరుగుతున్న, వయస్సు మీద పడుతున్న, దేహం వంగిన ఉత్సాహం సడలని వజ్ర సంకల్పుడు.

సదా తపోధీక్షలో ఉన్నట్లు కనిపించే గొప్ప ధ్యాని, గ్రామసీమల్లో విజ్ఞాన జ్యోతిని నింపిన అక్షర యజ్ఞపవేతం, స్వామిజీ, నిరుపేదల ఆశదీపం సేవే మానవ జాతి పరమార్థం అని చాటిన నిష్కమయోగి, లక్షలాది ప్రజలపై కరుణదార కురుపించిన దయ సింధు, దీన బందు స్వామిజీ. మానవజాతి మేలుకోరే విధంగా బోధనలు, ఉపదేశాలు చేసి తన జీవితంలో సామాజిక సేవ ఆధ్యాత్మిక సేవ తప్ప దేని గురించి ఆలోచించని మహనీయుడు శివకుమార స్వామిజీ.

కర్ణాటకలో రామనగర్ జిల్లా, మగాడి తాలుకాలోని, వీరాపురాలో ఏప్రిల్ 1907 సం॥న స్వామిజీ గంగమ్మ, హోన్నప్ప దంపతులకు సామాన్య రైతు కుటుంబంలో 13వ సంతానంగా జన్మించిన స్వామిజీకి తల్లిదండ్రులు శివణ్ణ అని నామకరణం చేశారు. బాల్యంలో తన తల్లిని కోల్పోవడంతో తన సోదరి పెంపకంలో బాల్య విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. పాఠశాల విద్యను తుమ్కూర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ పూర్తి చేశారు. విద్యాభ్యాస సమయంలో సెలవుల్లో కృషివలుడి అవతారమెత్తి తన తండ్రికి వ్యవసాయ పనుల్లో సాయం చేసేవారు. తుమ్కూర్‌లో తను ఉంటున్న ప్రదేశంలో ప్లేగు వ్యాధి వ్యాపించడంతో అద్దె ఇల్లు ఖాళీ చేయవలసి వచ్చింది. ఇల్లు ఖాళీ చేసి స్వామిజీ సిద్దగంగ మఠాధిపతి ఉద్దాన శివయోగిశ్వరులకు అత్యంత సన్నిహితుడు, వారసుడు అయిన చిన్నస్వామి మరులరాద్యతో పరిచయం ఏర్పడింది. పరిచయం మంచి మిత్రుత్వంగా మారి క్రమంగా స్వామిజీని ఆధ్యాత్మిక చర్చల్లో పాల్గొనే స్థాయికి తీసుకెళ్ళింది. మరులరాద్య శివణ్ణని తన గురువు సిద్దగంగ మఠాధిపతి ఉద్దాన శివయోగిశ్వరులకు పరిచయం చేశారు. కొంతకాలం తరువాత శివణ్ణ మిత్రుడు మఠ వారసుడు చిన్నస్వామి మరులరాద్య ఆకస్మిక మరణంతో ఉద్ధాన శివయోగిశ్వరులకు మఠవారసున్ని ఎంపిక చేయవలసి వచ్చింది. అప్పుడు ఇతరులకంటే భిన్నంగా ఆలోచిస్తూ ఆధ్యాత్మిక చింతనలో గడిపే శివణ్ణలోని అపార జ్ఞానం, ధార్మిక విలువలు, వేద పరిజ్ఞానం, ఆధ్యాత్మిక సంపత్తి, శిష్టాచారాలు పాటిస్తూ నిష్టగా ఉండే శివణ్ణ మఠాధిపతి శివయోగిశ్వరుల స్మృతి పథంలో మెదిలారు. శైవ ధర్మ పరిరక్షణ, వీరశైవ సంస్కృతి మఠ పవిత్రతను కాపాడటానికి ఆ దైవమే శివణ్ణని తన వద్దకు పంపాడని శివణ్ణని 3 మార్చి, 1930 తన వారసుడిగా మఠానికి ఉత్తరాధికారిగా నియమించారు. అప్పటి నుండి శివణ్ణ శివకుమార స్వామిజీగా మారిపోయారు. స్వామిజీ దశాబ్దం పాటు మఠానికి ఎన్నోరకాల సేవలందించారు. 11 జనవరి 1941న గురువుగారు ఉద్దాన శివయోగిశ్వరులు శివైక్యం చెందడంతో శివకుమారస్వామిజీ సిద్దగంగ మఠం మఠాధిపతిగా బాధ్యతలను స్వీకరించారు. శివకుమారస్వామిజీ తను మఠాధిపతిగా బాధ్యతలను స్వీకరించినప్పుడు ఆర్థిక వనరులుగాని, ఆస్తులు గాని విద్యా సంస్థలుగాని అంతగా లేవు. దాతల ఔనత్యంతో నిత్యకార్యక్రమాలు జరిగేవి. స్వాతంత్ర్యం పూర్వం కర్ణాటక జిల్లాకు ఒక హైస్కూలు, తాలుకాకు ఒక ప్రైమరీ స్కూలు ఉండేవి. మఠం అంటే కేవలం ఆధ్యాత్మికతనే కాకుండా నిరుపేదల వెనుకబాటుతనాన్ని, విద్యావసరాన్ని గుర్తించిన స్వామివారు, విద్య అనేది కులం మతం ధనిక పేదలకు అతీతంగా అందరికి సమానంగా అందాలనే దృక్పథంతో విద్యా సంస్థలను



నెలకొల్పి విద్యార్థులకు ఉచిత విద్య భోజన వసతి కల్పించారు. విద్యా సంస్థలను నెలకొల్పిన మొదట్లో ఉదయం సాయంత్రం భిక్షాటన చేసి సామాగ్రి సమకూర్చి మూడుపూటల భోజన వసతి కల్పించారు. ఆధ్యాత్మకత మరియు విద్య అవసరంపై స్వామివారు చేసే బోధనలు జనాన్ని కదిలించాయి. క్రమంగా కర్నాటకయే కాకుండా ప్రపంచవ్యాప్తంగా స్వామిజీకి శిష్యులు, భక్తులు ఏర్పడ్డారు.

ముఖ్యంగా 1960లో వరుసగా కర్నాటకలో కరువు సంభవించినప్పుడు ప్రజలకు పనులు కరువై, బతుకు కరువై, ఆహారం దొరకక ప్రాణాలు కోల్పోతున్న సమయంలో క్షామం కమ్మిన నేలపై ఆధ్యాత్మిక ధామం సిద్దగంగ మఠం ఓ ఆశకిరణంలా ప్రజలకు కనిపించింది. అంచెలంచెలుగా విద్య సంస్థలను పెంచిన స్వామివారు 1963లో 'సిద్దగంగ ఎడ్యుకేషన్ సొసైటీ' స్థాపించారు. పట్నం నుండి పల్లెదాకా 132కి పైగా విద్యా సంస్థలను ఏర్పాటు చేసి వారికి ఉచిత విద్యతో పాటు, భోజన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. నిత్యం 11వేల మందికి పైగా విద్యార్థులకు మూడుపూటలా భోజనంతోపాటు, మఠ సందర్శనకు వచ్చే భక్తులకు ఎల్లవేళలా భోజన సదుపాయం కల్పించారు. ప్రపంచ చరిత్రలో ఒక వ్యక్తి శక్తిగామారి వేలమందికి అన్నదానం, విద్యాదానం చేయడం ఇది మొదటిదని చెప్పవచ్చు.

త్రివిద దాసోహి శివకుమారస్వామిజీ : కర్ణాటక ప్రజలు, లింగాయతలు స్వామిజీని నడిచే దైవంగా, త్రివిద దాసోహిగా భావిస్తారు. దాసోహి అంటే నిరంతర దాత అని అర్థం. స్వామిజీ విద్యాదానం, అన్నదానం, విజ్ఞాన దానం లక్ష్యం కోసం తన జీవితాంతం శ్రమించారు. అందుకే త్రివిద దాసోహిగా పేరుగాంచారు.

రైతు లేనిదే బతుకు లేదని విశ్వసించిన స్వామిజీ వారి అభ్యున్నతికీ తోడ్పడ్డారు. రైతులన్నా, పశువులన్నా స్వామిజీకి అపారమైన ప్రేమ. ప్రతి సంవత్సరం రైతు మేళా నిర్వహించి వారికి ప్రోత్సహకాలు ఇచ్చేవారు. తన విద్యా సంస్థలో విద్యార్థులకు చదువుతో పాటు వ్యవసాయ రంగంపైకి ఆసక్తి కలిగించేందుకు రైతు ఆవశ్యకతను భోదించేవారు. తన గురుకులంలోని విద్యార్థులకు విద్యతోపాటు జీవనశైలి, శ్రమదానం, పొలం పనులు, పశుసంరక్షణపై శిక్షణనిచ్చి ఒక పరిపూర్ణ వ్యక్తిగా సమాజంలోకి పంపేవారు.

ప్రపంచ వ్యాప్తంగా స్వామిజీకి భక్తుల, ఇంతటి ఆదరణ ఉన్నప్పటికీ స్వామిజీ రాజకీయాలకు అతీతంగా ఉన్నారు. రాజకీయాలను శాసించే శక్తి ఉన్నప్పటికీ ఎప్పుడు ఆ దిశగా ఆలోచించలేదు. కర్ణాటకలో ప్రధాన సామాజిక వర్గం లింగాయతులకు ఆరాధ్యమైన శివకుమార స్వామిజీ రాజకీయంగా తటస్థంగా ఉండేవారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలప్పుడు రాష్ట్ర ప్రభుత్వ లింగాయతులకు మైనారిటీ హోదా కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నా ఆయన స్పందించలేదు. పార్టీలకతీతంగా ప్రధానమంత్రులు మోడి, వాజ్‌పేయి, ఇందిరాగాంధీ, మొరార్జీ దేశాయ్, దేవెగౌడ వంటి వారు, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ వంటి మేధావులు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు వివిధ రంగాల ప్రముఖులు సిద్దగంగ మఠాన్ని సందర్శించి స్వామిజీ దీవెనెలు అందుకొని స్వామిజీ సేవలను కొనియాడారు.

నిరుపేదల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన స్వామిజీ నేటి సమాజానికి ఆదర్శం. వయస్సు మీద పడుతున్నా వృద్ధాప్యంలో తన పనులు తాను చేసుకుంటూ సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగిస్తూ 80 ఏళ్ళపాటు కర్ణాటకలో సాంఘిక సంస్కరణ వాదిగా, విద్యావేత్తగా ప్రజలకు నడిచే దైవంగా, త్రివిద దాసోహిగా తన 111 ఏళ్ళ జీవితాన్ని ఆధ్యాత్మికతను సమాజసేవగా మార్చి సిద్దగంగ మఠ సేవ కార్యక్రమాలను ప్రపంచవ్యాప్తంగా గుబాలించేలా చేసి సెలవు తీసుకున్నారు. శివకుమార స్వామిజీ శివైక్యం నేటి సమాజానికి, వీరశైవ లింగాయతలకు, కర్ణాటక ప్రజలకు, దేశానికి తీరనిలోటు.

\- బర్మని మల్లిఖార్జున్
లింగాయత సమన్వయ సమితి
తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు

గంజాయికి బానిసలవుతున్న విద్యార్థులు



చదువుకుని భవిష్యత్తులో మంచి జీవితాన్ని గడపాలన్న ఆశతో తల్లిదండ్రులు పిల్లలను కాలేజీలకు పంపిస్తుంటే గంజాయి వ్యవహారం విద్యార్థి లోకాన్ని ఆందోళనలో పడేసేలా చేస్తోంది. హైదరాబాద్ శివారు పాంతాల్లోని డిగ్రీ, ఇంజనీరింగ్, బీబీఏ, హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీల్లో గంజాయి వాడకం విపరీతంగా పెరిగిందని ఎక్సైజ్ శాఖ గుర్తించింది. విద్యార్థులే గంజాయిని వైజాగ్, అరకులో కొనుగోలు చేసి తమ స్నేహితులకు విక్రయిస్తున్నారు. గంజాయి విక్రయించడాన్ని స్కోరింగ్ అనే కోడ్ పేరుతో పిలుచుకుంటున్నారు. ఆల్కహాల్ తాగితే వాసనతో ఇంట్లో తెలుస్తుందని, గంజాయి అయితే పెద్దగా ఇబ్బంది ఉండదని స్నేహితులు అలవాటు చేస్తుండటంతో ఏటా దీనికి బానిసలవుతున్న వారి సంఖ్య రెట్టింపు అవుతున్నట్లు అధికారుల అంచనా. హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో ఉన్న దాదాపు 600 కాలేజీలలో 5వేల మందికి పైగా గంజాయి వాడుతున్నట్లు ఎక్సైజ్ శాఖ గుర్తించింది. తల్లిదండ్రులు ఇస్తున్న విచ్చలవిడి స్వేచ్ఛ, డబ్బు విద్యార్థులు గంజాయి వైపు మళ్లేలా చేస్తున్నాయని, దీనిపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. పోలీసులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులు గంజాయికి బానిసలు కాకుండా చూడాలి.

\- రమణారెడ్డి, హైదరాబాద్

ఫిబ్రవరి నెలాఖరులోగా టీడీపీ అభ్యర్థుల ఎంపిక

విజయక్రాంతి, అమరావతి : వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికను ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తి చేస్తామని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఎన్నికల ప్రకటన వెలువడగానే రంగంలోకి దిగేందుకు అంతా సిద్ధంగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన శాసనసభ ఆవరణలోని కమిటీ హాల్లో టీడీపీ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో శ్రీకాకుళం నుంచి గుంటూరు వరకు ముందే కోడ్ రానుందని ఆయన గుర్తుచేశారు.కోడ్ అమల్లోకి వచ్చేలోగా ప్రభుత్వ కార్యక్రమాలన్నీ పూర్తి చేయాలన్నారు. ఆ తర్వాత ఇక పూర్తిస్థాయిలో ప్రజల్లోనే ఉండాలని, పాదయాత్రలు చేయాలని సూచించారు. 13 జిల్లాల్లో తాను బస్సులో చైతన్యయాత్ర నిర్వహిస్తానని వివరించారు.

ఏపీ బంద్ సంపూర్ణం

- నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు
- కాంగ్రెస్, ఉద్యోగ సంఘాల మద్దతు
- బీజేపీ, వైఎస్సార్‌సీపీ, జనసేన బంద్‌కు దూరం

విజయక్రాంతి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలను కేంద్ర ప్రభుత్వం అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఏపీలో బంద్ నిర్వహించారు. ప్రత్యేకహోదా, విభజన హామీల సాధన సమితి ఇచ్చిన పిలుపు మేరకు ఈ ఉదయం నుంచే పలు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు రోడ్లపైకి చేరుకుని బంద్‌లో పాల్గొన్నారు. విశాఖలోని మద్దిలపాలెం జంక్షన్లో వామపక్షాలు, విద్యార్థి సంఘాలు నిరసనకు దిగాయి. రైల్వేజోన్, ప్రత్యేక హోదా కోరుతూ చేపట్టిన ఈ బంద్‌కు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరుతూ నినాదాలు చేశారు. బంద్‌కు ఆర్టీసీ కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. విజయవాడలోని జవహర్లాల్ నెహ్రూ బస్టాండ్ ఎదుట హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డితో పాటు పలువురు సీపీఐ నేతలు నిరసనకు దిగారు. రాజమహేంద్రవరంలో సీపీఐ, గుంటూరులో కాంగ్రెస్, సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సు సేవలు నిలిచిపోయాయి.





బంద్‌కు టీడీపీ, కాంగ్రెస్, వామపక్షాలతో పాటు ఉద్యోగ, విద్యార్థి, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. లారీ ఓనర్స్ అసోసియేషన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ప్రైవేటు పాఠశాల, కళాశాల సంఘాలు కూడా బంద్‌కు సంఘీభావం తెలిపాయి. బంద్ సందర్భంగా జరిగే ర్యాలీలు, నిరసన ప్రదర్శనల్లో టీడీపీ నేతలు నల్ల బ్యాడ్జీలు ధరించి పాల్గొన్నారు. ఉద్యోగులు కూడా నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరుకానున్నట్లు అమరావతి ఉద్యోగ ఐకాస అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రకటించారు. ఏపీఎన్జీవో సంఘం బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బీజేపీ, వైఎస్సార్‌సీపీ, జనసేన బంద్‌కు దూరంగా ఉన్నాయి.

విభజన హామీలను విస్మరించిన కేంద్రం

- రాష్ట్రం నష్టపోతే ఆవేదన ఉండదా
- తెలుగువాళ్లకు పౌరుషం లేదనుకున్నారా
- అసెంబ్లీలో తీవ్ర స్వరంతో మాట్లాడిన సీఎం చంద్రబాబు



విజయక్రాంతి, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన విభజన హామీలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వంపై సీఎం చంద్రబాబు అసెంబ్లీ వేదికగా నిప్పులు చెరిగారు. ఎప్పుడూ లేని విధంగా ఆగ్రహంగా తీవ్ర స్వరంతో మాట్లాడారు. రాష్ట్రానికి చెప్పిన దానికంటే ఎక్కువే చేశామంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు చేసిన వ్యాఖ్యలపై సీఎం మండిపడ్డారు. కేంద్రం రాష్ట్రానికి చేసిన సాయమేంటో చెప్పాలంటూ సభలో అందరి ముందూ ఆయన్ను నిలదీశారు. తెలుగువాళ్లకు పౌరుషం లేదనుకున్నారా? అంటూ విష్ణుకుమార్ రాజు, బీజేపీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

రాష్ట్రం నష్టపోతే ఆవేదన ఉండదా? అని చంద్రబాబు ప్రశ్నించారు. తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు ఎన్ని నిధులిచ్చారో, వాటిని ఒకసారి ఏపీతో పోల్చి చూడాలని సీఎం హితవు పలికారు. ఎవరి కోసం నిధులిస్తారు. రాష్ట్రంలో ఎవరికి ఊడిగం చేస్తారు? అడిగేవారు లేరనుకుంటున్నారు. మమ్మల్ని ఏం చేస్తారు? జైల్లో పెడతారా? మీ ఇష్ట ప్రకారం తమాషాలు ఆడుతున్నారు. కొత్త రాష్ట్రం ఏర్పడితే సహకరించాల్సిందిపోయి సిగ్గు వదిలిపెట్టి మాట్లాడుతున్నారు. రాష్ట్రానికి న్యాయం జరిగే వరకూ వదిలిపెట్టం.బీజేపీ నేతలను తిరగనివ్వం అంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

వెంకయ్యకు పనిష్మెంటా? ప్రమోషనా?

బీజేపీ హయాంలో దక్షిణాది రాష్ట్రాల్లో ఏం అభివృద్ధి చేశారని చంద్రబాబు నిలదీశారు. దక్షిణాది నుంచి ప్రస్తుతం ఏ ఒక్కరైనా కేంద్ర మంత్రిగా ఉన్నారా అంటూ ప్రశ్నించారు. అన్యాయం చేసింది కాక, తిరిగి తమనే విమర్శిస్తారా అని మండిపడ్డారు. దక్షిణాది నుంచి కేంద్రమంత్రిగా వెంకయ్య నాయుడు ఉండేవారు. వీళ్ల కోపంతో ఆయన్ను కూడా తీసుకెళ్లి ఉపరాష్ట్రపతిని చేసేశారు. అది పనిష్మెంటా.. ప్రమోషనా అనేది దేవుడికే తెలియాలి. దేశంలో దక్షిణాది భాగం కాదా? కాంగ్రెస్ హయాంలోనూ ఉత్తరాది వారు ప్రధానిగా ఉంటే దక్షిణాది వ్యక్తిని రాష్ట్రపతిగా ఉంచడం వంటివి చేసేవారు. ఈశాన్య రాష్ట్రాలతో సహా సముచిత స్థానం ఇచ్చి గౌరవించేవారు. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న దత్తాత్రేయను పదవి నుంచి తొలగించారు. కర్ణాటక నుంచి ఉన్న అనంతకుమార్ మృతిచెందారు. ఒక్క సదానంద గౌడ మాత్రమే మిగిలారు. దక్షిణాదిలో ఎంతమంది మంత్రులకు ఎన్ని ఫోర్ట్‌ఫోలియోలు ఇచ్చారో ఒక్కసారి గుర్తు చేసుకోండి. మనోభావాలను ఎలా కాపాడతారు? ఉపన్యాసాలు ఎలా ఇస్తారు? దక్షిణాదిలో ఖాతా తెరవలేదు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం గెలుస్తాం అని చెబుతారు. ఎలా గెలుస్తారు? అశాస్త్రీయ విభజన జరిగింది. ఢిల్లీలో కేంద్ర మంత్రుల ఇంటింటికీ తిరిగాను. ప్రధాని మోడీ ఎక్కడికొస్తే అక్కడ కలిశాను. న్యాయం చేస్తారనే తిరిగాను. నాకోసం తిరగలేదు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. ఈ నేలపై పుట్టిన ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరుతున్నా నని చంద్రబాబు అన్నారు.

ప్రత్యేక హోదా కోసం 10 తేదీ వరకు నిరసనలు

నేటి నుంచి ఈ నెల 10వ తేదీ వరకు ప్రత్యేక హోదా కోసం రాష్ట్ర స్థాయిలో నిరసనలు చేపట్టాలని టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నేతలకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 11 నుంచి 14 వరకు జాతీయపార్టీలతో కలిసి ఢిల్లీలో ధర్మపోరాటం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్రపతికి వినతి పత్రం సమర్పిస్తామని వివరించారు. ఎలక్షన్ మిషన్ 2019లో భాగంగా టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్రం రాష్ట్రానికి న్యాయం చేస్తుందని ఆఖరి బడ్జెట్ వరకు ఎదురు చూశామని, తమలో సహనం పూర్తిగా నశించిపోయిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పార్లమెంట్ చివరి సమావేశాలు కూడా ప్రారంభం అయ్యాయని, 5ఏళ్లు ఎదురు చూసినా ప్రధాని మోడీ చేసిందేమీ లేదని మండిపడ్డారు. విశాల దృక్పథం గురించి మోడీ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసలు బీజేపీకు విశాల దృక్పథం ఎక్కడుందని సీఎం ప్రశ్నించారు.

బీజేపీయేతర పార్టీలే లక్ష్యంగా వేధింపులు జరుపుతున్నారని ధ్వజమెత్తారు. అందులో భాగంగానే తాజాగా యూపీలో అఖిలేశ్‌యాదవ్, మాయావతిపై ఐటీ దాడులు చేశారన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని నేతలకు సూచించారు. కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన గుర్తింపు ఇస్తామని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా ఉద్యమంలో, సమైక్యాంధ్ర ఆందోళనల్లో పాల్గొన్నవారిపై కేసులు ఎత్తివేశామని గుర్తుచేశారు. రాష్ట్ర హక్కుల కోసం పోరాడేవారికి అండగా ఉంటామని పునరుద్ఘాటించారు. ఈ రోజు శాంతియుతంగా నిరసనలు తెలపాలని చంద్రబాబు నేతలకు దిశానిర్దేశం చేశారు.

నల్ల చొక్కా ధరించి అసెంబ్లీకి వచ్చిన చంద్రబాబు

కేంద్రం తీరుకు నిరసనగా ప్రత్యేకహోదా, విభజన హామీల సాధన సమితి చేపట్టిన రాష్ట్ర బంద్‌కు సంఘీభావంగా ఏపీ సీఎం చంద్రబాబు నల్ల చొక్కా ధరించి అసెంబ్లీకి వచ్చారు. ఏపీ హక్కుల సాధనకు కేంద్రానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలంటూ సీఎం కార్యాచరణ ప్రకటించారు. విభజన చట్టం అమలులో కేంద్రం మొండిచేయి చూపిస్తున్నందున, కేంద్రం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెడుతున్నందున ఈరోజు నిరసన దినంగా పాటించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం సహాయనిరాకరణకు నిరసనగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు నల్లదుస్తులు ధరించి రావాలని సీఎం సూచించారు. ఈ నేపథ్యంలో పలువురు సభ్యులు కూడా నల్లదుస్తులు ధరించి సభకు హాజరయ్యారు.

కోడికత్తి దాడి వ్యూహం శ్రీనివాసరావుదే

- అభియోగపత్రం దాఖలు చేసిన జాతీయ దర్యాప్తు సంస్థ



విజయక్రాంతి, అమరావతి: విశాఖపట్నం విమానాశ్రయంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిపై దాడి చేయాలన్న వ్యూహం నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావు అలియాస్ చంటిదేనని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐయే) తేల్చింది. దాన్ని అమలు చేసే ప్రక్రియలో భాగంగా అతనే కోడికత్తి సమకూర్చుకున్నాడని, విమానాశ్రయానికి జగన్ రాకపోకల సమాచారంపై అవగాహన పెంచుకున్నాడని నిర్ధారించింది. ఎస్సార్‌సీపీలో ఎవరితోనైనా మాట్లాడి జగన్‌తో సెల్ఫీకి అవకాశం కల్పించాలని సహచర ఉద్యోగినిని కోరాడని గుర్తించింది. సెల్ఫీ సాకుతో వీఐపీ లాంజ్లోకి ప్రవేశించి, దాడి చేశాడని తేల్చింది. దానికి ముందు జగన్ దగ్గరకెళ్లి 'సార్ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మీరు 160 సీట్లు గెలుస్తారు' అంటూ శ్రీనివాసరావు చెప్పాడని గుర్తించింది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జగన్‌పై దాడి కేసు దర్యాప్తు చేపట్టిన ఎన్ఐయే ఇటీవల విజయవాడ ఎన్ఐయే న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేసింది. జగన్‌ను చంపాలనే ఉద్దేశంతో నిందితుడు తన ప్యాంటు కుడి జేబు నుంచి పదునైన కత్తిని తీసి మెడపై పొడిచేందుకు ప్రయత్నించాడని అందులో పేర్కొంది. ఈ క్రమంలో జగన్ ఎడమ భుజం పైభాగంలో సాధారణ గాయమైందని వివరించింది. ఈ ఘటనలో కుట్ర, ప్రోద్బలానికి సంబంధించిన అంశాలపై ఆధారాలు ఏవైనా లభిస్తే వాటిని న్యాయస్థానానికి సమర్పిస్తామని అభియోగపత్రంలో పేర్కొంది. జగన్ పాదయాత్రను పరిశీలించిన శ్రీనివాసరావు విశాఖ విమానాశ్రయం నుంచి ఆయన రాకపోకలకు సంబంధించి పూర్తి అవగాహన పెంచుకున్నాడు. విమానాశ్రయంలోనే జగన్‌పై దాడికి వ్యూహం రూపొందించాడు. దాన్ని అమలు చేసేందుకు 2018 జనవరిలో స్వగ్రామం నుంచి కోడిపందేల్లో వాడే కత్తిని తెచ్చుకున్నాడు. 2019 జనవరి 12 నుంచి 18 వరకూ నిర్వహించిన కస్టోడియల్ విచారణలో శ్రీనివాసరావే ఈ విషయం వెల్లడించాడు. ఈ క్రమంలో ఐపీసీ 307, పౌర విమానయాన భద్రత చట్టం సెక్షన్ 3 ఎ(1) (ఎ) ప్రకారం నిందితుడిపై అభియోగాలు నమోదు చేశామని ఎన్ఐయే అభియోగపత్రంలో పేర్కొంది.

ప్రత్యేక హోదాపై సంతకం చేసిన వారికే మద్దతు

- ఎన్నికల ముందు ఏ పార్టీతోనూ పొత్తులు పెట్టుకోం
- కేంద్రంలో హంగ్‌వస్తే రాష్ట్రానికి మేలు
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి



విజయక్రాంతి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల ముందు ఏ పార్టీతోనూ పొత్తులు పెట్టుకోబోమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికలయ్యాక కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పార్టీ, ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తామని సంతకం చేశాకే వారికి మద్దతు ఇస్తామని తేల్చి చెప్పారు. సర్వేలను బట్టి చూస్తే కేంద్రంలో ఈసారి ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ రాదని, హంగ్ వచ్చే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. కేంద్రంలో హంగ్‌తో రాష్ట్రానికి మంచి జరుగుతుందని, ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వే జోనూ వస్తాయని జగన్ ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతపురంలో కియా కార్ల ప్లాంటు ఏర్పాటు క్రెడిట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్నా మాకు అభ్యంతరం లేదు కానీ, అందులో స్థానికులకు 5శాతం ఉద్యోగాలు రాలేదని విమర్శించారు. గుంటూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, విశాఖ, ప్రకాశం, కర్నూలు తదితర జిల్లాల నుంచి వచ్చిన తటస్థులతో గురువారం హైదరాబాద్‌లో ని లోటస్‌పాండ్‌లో జగన్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జనం ఏం కోరుకుంటున్నారని వారిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వైఎస్సార్‌సీపీ నవరత్నాలను కాపీ కొడుతున్నారని జగన్ ఆక్షేపించారు. పింఛను రూ.2 వేలకు పెంచుతామని, డ్వాక్రా మహిళలకు రూ.10వేలు ఇస్తామంటూ మభ్యపెడుతున్నారని ఆరోపించారు. తటస్థులతో సమావేశాలను అన్ని జిల్లాలవారితోనూ నిర్వహిస్తామని, వారితో తన జీవితకాలం సంబంధాన్ని కొనసాగించాలనుకుంటున్నట్లు జగన్ తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రజలకు ఇచ్చే హామీలను తటస్థులకు వివరించారు. ప్రతి గ్రామంలోనూ 10మందికి ఉద్యోగాలు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేసేందుకు ప్రతి 50కుటుంబాలకు ఒక వాలంటీర్‌ను నియమించి వారికి రూ.5వేల జీతం.ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలన్నీ భర్తీ. ప్రతి కులానికీ ఓ కార్పొరేషన్. ఇప్పటికే ఏర్పాటైన, కొత్తగా రాబోయే పరిశ్రమల్లో స్థానికులకే 75శాతం ఉద్యోగాలు. రాష్ట్రంలో 85లక్షల రైతు కుటుంబాలకు ఏటా రూ.12,500 పంపిణీ.సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొన్నవారిపై నమోదైన కేసుల్లో ఎవ్వరికీ నష్టం లేని కేసుల ఎత్తివేత.

క్షేత్రస్థాయిలో ప్రజలకు, వైఎస్సార్‌సీపీకు వారధుల్లా పనిచేసేందుకు ఈ తటస్థులు దోహదపడతారని ఆ పార్టీ నాయకత్వం భావిస్తోంది. గతేడాది సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు ఈ తటస్థులను గుర్తించినట్లు పార్టీ తెలిసింది.



మాకూ రోషముంది

- బీజేపీ ఎమ్మెల్యే పైడికొండల మాణిక్యాలరావు

విజయక్రాంతి, అమరావతి : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కారణంగానే రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని బీజేపీ ఎమ్మెల్యే పైడికొండల మాణిక్యాలరావు విమర్శించారు. ప్రత్యేక హోదాకు బదులుగా ప్యాకేజీని అంగీకరించింది చంద్రబాబేననీ, దానిని అమలుచేయటం రాష్ట్ర ప్రభుత్వానికి చేతకాలేదని మండిపడ్డారు. ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై జరిగిన దాడి ఘటనపై దర్యాప్తుకు టీడీపీ ఎందుకు భయపడుతోందని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం మాణిక్యాలరావు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎవరిపైనా అయినా సీబీఐ సోదాలు జరిపితే ప్రభుత్వం ఎందుకు ఉలిక్కిపడుతోందన్నారు. ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా నిధులు మంజూరు చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు గల నియోజకవర్గాలకు నిధులు నిలుపుదల చేస్తోందని అన్నారు. దేశంలో రాష్ట్రంగా అభివృద్ధి చెందాలన్నదే తమ ఆకాంక్ష అని తెలిపారు. చందబ్రాబు కారణంగా ఏపీకి ఇంత అన్యాయం జరగుతుంటే తాము చాలా బాధపడుతున్నామని విచారం వ్యక్తం చేశారు. తమకు కూడా రోషం ఉందని, కానీ అది రాజకీయ రోషం మాత్రం కాదని, నిజమైన రోషమని మాణిక్యాలరావు పేర్కొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు పరిహారం చెల్లింపు

విజయక్రాంతి, అమరావతి: అగ్రిగోల్డ్ బాధితులకు పరిహారం చెల్లింపుపై ఏపీ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టులో రూ.250 కోట్లు డిపాజిట్ చేసి అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లించాలని, ఆస్తుల వేలం తర్వాత ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సుమారు 4 గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రత్యేక హోదా, వంశధార నిర్వాసితులపై పెట్టిన కేసులు ఎత్తివేతకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సమైక్యాంధ్ర ఉద్యమం నాటి మిగిలిన కేసులు ఎత్తివేయాలని నిర్ణయించింది. కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ సమావేశాల్లో బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది.

పసుపు కుంకుమ పథకం నిధుల పంపిణీకి, చుక్కల భూముల సమస్యల పరిష్కారంపై ముసాయిదా బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 'భూధార్' ప్రాజెక్టుకు చట్టబద్ధత కల్పించేందుకు ఉద్దేశించిన ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే దీనికి సంబంధించిన సవరణ బిల్లును సర్కారు ప్రవేశపెట్టనుంది. రాజధాని ఆర్థిక ప్రణాళికకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జయహో బీసీ సదస్సులో ఇచ్చిన హామీలపైనా ఈ భేటీలో చర్చ జరిగింది. హామీలకు సంబంధించి వెంటనే జీవోలు ఇవ్వాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. వివిధ ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా చేయడంపైనా చర్చించారు. సెలూన్లకు 150 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించారు.

ముగ్గురు ఎమ్మెల్యేల రాజీనామా ఆమోదం

విజయక్రాంతి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు ముగ్గురు ఎమ్మెల్యేల రాజీనామాను ఆమోదిస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ నుంచి వైఎస్సార్సీపీలో చేరిన మేడా మల్లిఖార్జునరెడ్డి, టీడీపీ నుంచి జనసేనలో చేరిన రావెల కిశోర్‌బాబు, బీజేపీ నుంచి జనసేనలో చేరిన ఆకుల సత్యనారాయణ రాజీనామాలకు స్పీకర్ ఆమోదముద్ర వేశారు. పార్టీ మారే సమయంలోనే ఈ ముగ్గురు తమ ఎమ్మెల్యే పదవులకు, పార్టీ ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేశారు.

బీసీ సన్నాహక సదస్సు

విజయక్రాంతి, తిరుపతి : తుమ్మలగుంటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం బీసీ గర్జనపై రాయలసీమ రీజియన్ సన్నాహక సదస్సు జరిగింది. బీసీల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ నెల 17న పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో నిర్వహిస్తున్న బీసీ గర్జన మహాసభను విజయవంతం చేయాలని పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందకుండా చంద్రబాబు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని మండిపడ్డారు.

బీసీల అభ్యున్నతికి కట్టుబడి ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫిబ్రవరి 17వ తేదీన ఏలూరులో బీసీ గర్జనను నిర్వహించి వారి సంక్షేమం కోసం డిక్లరేషన్ ప్రకటిస్తుందన్నారు. మాజీ ఎంపీ వరప్రసాద్, మేకపాటి రాజమోహన్ రెడ్డి, మిథున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి రూ. 37,112 కోట్ల రుణం

- సీఆర్డీఏ ప్రతిపాదనకు ప్రభుత్వం అంగీకారం

విజయక్రాంతి, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణానికి సీఆర్డీఏ రూ. 55,343 కోట్లతో రూపొందించిన సమగ్ర ఆర్థిక ప్రణాళికకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాజధానిలో భవనాలు, రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.51,867 కోట్లు వ్యయం అవుతుందని, ఇందులో రూ. 37,112 కోట్లను అప్పుగా తీసుకోవడానికి అనుమతి ఇవ్వాలన్న సీఆర్డీఏ ప్రతిపాదనకు అంగీకరించింది. రాజధానిలో చేపట్టే ప్రాజెక్టులను తనఖా పెట్టడం ద్వారానూ, పబ్లిక్ బాండ్స్ ద్వారానూ రూ. 500 కోట్లను సేకరించడానికి సీఆర్డీఏకు అనుమతి ఇచ్చింది. పబ్లిక్ బాండ్స్ ద్వారా సేకరించే రుణానికి ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వడానికి మంత్రివర్గం అంగీకరించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో గురువారం మంత్రివర్గం సమావేశ మైంది. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకుంది. రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పన, సంస్థాగత అభివృద్ధి పథకానికి 715 మిలియన్ అమెరికన్ డాలర్ల విదేశీ రుణం(ఈఏపీ) తీసుకోవడానికి ఆమోదం తెలిపింది. రాజధానిలో సచివాలయం, శాఖాధిపతుల (హెచ్ ఓడీ) కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన రూ.4,900 కోట్ల నిధుల సమీకరణకు సీఆర్డీఏకు అనుమతి ఇచ్చింది.

సమైక్యాంధ్ర, ప్రత్యేక హోదా ఉద్యమాల్లో పాల్గొన్న వారిపై నమోదైన కేసులను ఎత్తివేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కడప, అనంతపురం జైళ్లలో జీవిత ఖైదు అనుభవిస్తున్న 33 మంది ఖైదీలకు విముక్తి కల్పించడానికి ఆమోదం తెలిపింది.

వృద్ధులు, వితంతువులు, గీత కార్మికులు, చేనేత, ఒంటరి మహిళ, మత్స్యకారులు, హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు, డప్పు కళాకారులు, చెప్పులు కుట్టేవారు, 40 నుంచి 79 శాతం అంగ వైకల్యం గల వారికి ఇస్తున్న రూ. వెయ్యి పెన్షన్‌ను రూ. 2 వేలకు పెంచాలని నిర్ణయించింది.

80 శాతం పైగా అంగ వైకల్యం ఉన్న దివ్యాంగులకు, ట్రాన్స్‌జండర్లకు పెన్షన్ రూ.1,500 నుంచి రూ.3,000లకు పెంపు. కిడ్నీ వ్యాధితో డయాలసిస్ చేయించుకుంటున్న వారికి పెన్షన్ రూ. 2500 నుంచి రూ. 3500లకు పెంపు.

నాలుగేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం

- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ నేత విజయసాయి రెడ్డి



న్యూఢిల్లీ: గత నాలుగేళ్లుగా కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరుగుతూనే ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నేత విజయసాయి రెడ్డి ఆరోపించారు. ఏపీకి జరుగుతున్న అన్యాయంలో సీఎం చంద్రబాబు నాయుడు పాపం కూడా ఉందని విమర్శించారు. శుక్రవారం పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ వైఎస్సార్సీపీ ఎంపీలు ప్రత్యేక హోదా కోసం నినదించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడారు. నాలుగేళ్లుగా బీజేపీతో అంటకాగి ఏపీకి చంద్రబాబు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఏపీకి చేసిన అన్యాయానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

బందుల వల్ల రాష్ట్ర అభివృద్ధి ఆగిపోతుందని గతంలో చంద్రబాబు ప్రకటనలు చేశారని, కానీ ఈ రోజు ఆయన బంద్‌కు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ఈవీఎంలు వద్దని చంద్రబాబు కొత్త పాట పాడుతున్నారని విమర్శించారు. గురువారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఏ పార్టీ కూడా తిరిగి బ్యాలెట్లు కావాలని కోరలేదని, ఓటింగ్ శాతం తక్కువగా ఉన్నప్పుడు, ఏమైనా అనుమానాలు కలిగినప్పుడు మాత్రమే వీవీప్యాట్ల స్లిప్పులను లెక్కించాలని కోరారని తెలిపారు. 2014లో చంద్రబాబు ఈవీఎంలపై ఎందుకు పోరాటం చేయలేదని ప్రశ్నించారు. చంద్రబాబు తిరోగమనంలో ప్రయణిస్తున్నారని, అభివృద్ధికి నిరోధకులుగా మారుతున్నారని విజయసాయి రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.



కేంద్ర నిధులను దోచేశారు

- కన్నా లక్ష్మీనారాయణ

విజయక్రాంతి, అమరావతి : ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిపై ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ట్విట్టర్ వేదికగా ధ్వజమెత్తారు. చంద్రబాబు అవినీతి చూస్తుంటే ప్రజల రక్తం ఉడికిపోతోందని, మనిషిగా ఉండే అర్హతను ఆయన ఎప్పుడో కోల్పోయారని ట్వీట్ చేశారు. బీజేపీ నేతలపై చంద్రబాబు చేసిన విమర్శలకు ఆయన శుక్రవారం ట్విట్టర్‌లో స్పందించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను మీవిగా దొంగ ప్రచారం చేసుకుంటున్నారు. రాష్ట్ర కోసం మీరేదో హెరిటేజ్ డబ్బులు పెడుతున్నట్లు మాట్లాడుతున్నారు. చంద్రబాబు భాషను సరిచేసుకుని క్షమాపణలు చెప్పాలి. మనిషిగా ఉండే అర్హతను మీరు ఎప్పుడో కోల్పోయారు. నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి, కేంద్ర ఇచ్చిన లక్షల కోట్ల నిధులను దోచేసి ఇప్పుడు మమ్మల్నే తిడతావా?. రాష్ట్ర సంపదను రసం పీల్చే పురుగులా తినేస్తూ. లెక్కలు అడిగితే యూటర్న్ తీసుకుని మాపై నిందలు వేస్తావా" అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

28 స్థానాల్లో బీఎస్పీ పోటీ

బెంగుళూరు: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలో ఏ పార్టీతోనూ పొత్తులు కుదరకపోతే తాము 28 స్థానాల్లోనూ పోటీ చేస్తామని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి నేతృత్వంలోని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) తెలిపింది. ఆ పార్టీ కర్ణాటక ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి ఎన్.మహేశ్ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో ఏ పార్టీతో అయినా పొత్తు పెట్టుకుంటే మాకు కేటాయించే స్థానాల్లో మేము పోటీ చేస్తాం. పొత్తులు కుదరకపోతే అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తాం. మా పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేస్తున్నాం. ఈ విషయంపై తుది నిర్ణయం తీసుకోవడానికి ఫిబ్రవరి 2న మా పార్టీ రాష్ట్ర కమిటీ భేటీ అవుతోంది. ఈ సమావేశంలో మా పార్టీ రాజ్యసభ సభ్యుడు అశోక్ సిద్ధార్థతో పాటు పలువురు బీఎస్పీ నేతలు పాల్గొంటారు. మే 2018లో కర్ణాటకలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో జేడీఎస్తో కలిసి బీఎస్పీ పోటీ చేసింది. ఆ ఎన్నికల్లో బీఎస్పీ 18 స్థానాల్లో అభ్యర్థులను నిలిపింది.

ఆర్‌ఎస్‌ఎస్ బడ్జెట్

కర్ణాటక సీఎం కుమారస్వామి



బెంగుళూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి పెదవి విరిచారు. ఇది ఆర్థిక శాఖ తయారు చేసిన బడ్జెట్టా? ఆర్‌ఎస్‌ఎస్ ప్రిపేర్ చేసిన బడ్జెట్టా? అంటూ ప్రశ్నించారు.

'నేను ఒకటి అడగదలచుకున్నాను. ఈ బడ్జెట్‌ను ఆర్థిక శాఖ అధికారులు రెడీ చేశారా? ఆర్‌ఎస్‌ఎస్ రూపొందించిందా? రైతులకు నరేంద్ర మోదీ కాటన్ క్యాండీ ఇచ్చారు. నేను రైతు రుణాల మాఫీని ప్రకటించినప్పుడు అదో లాలీపాప్ అంటూ ఆయన పరిహసించారు. బీజేపీ మిత్రులే బడ్జెట్‌ను ప్రిపేర్ చేశారు' అని ఆయన కుండ బద్ధలు కొట్టారు. బెంగుళూరులో కాంగ్రెస్–జేడీఎస్ మధ్య వైరం పెంచేందుకు ప్రయత్నిస్తుందని తద్వారా బెంగుళూరులో బీజేపీ ప్రభుత్వం నెలకొల్పేందుకు ఎమ్మెల్యేలను కొనేందుకు పాల్పడుతందనే విమర్శలు కూడా చేశారు.

జనావాసాల్లో చిరుత బీభత్సం



చండీగఢ్: పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో చిరుత బీభత్సం సృష్టించింది. జనావాసాలపై విరుచుకుపడి ప్రజలను గాయపరిచింది. ప్రజలను ఊరుకులు పరుగులు పెట్టించింది. చిరుత భయంతో కొందరు పరిగెత్తుతూ గాయపడగా, కొందరి చిరుత గాయపర్చింది. చివరకు అటవీ అధికారులు ట్రాంక్విలైజర్ గన్ను ఉపయోగించి చిరుతను అదుపు చేయడంతో జనాలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. కాగా హిమాచల్ ప్రదేశ్ నుంచి పారిపోయిన ఈ చిరుత అటవీ మార్గం గుండా జలంధర్ చేరుకుని ఉంటుందని పంజాబ్ అటవీ శాఖ అధికారులు అభిప్రాయపడ్డారు. వల వేసి పట్టుకుందామని ప్రయత్నించినప్పటికీ వీలుకాలేదని.. అందుకే మత్తులో దించి దానిని బంధించినట్లు తెలిపారు. అనంతరం చాట్బీర్ జూకు తరలించినట్లు పేర్కొన్నారు.

బడ్జెట్ లీక్: మనిష్ తివారీ ఆరోపణ



న్యూఢిల్లీ: కేంద్ర తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందే అందులోని కీలకాంశాలు బయటకు పొక్కాయని కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి మనీష్ తివారి ఆరోపించారు. ప్రభుత్వ వర్గాలే ఈ వివరాలను మీడియాకు లీక్ చేశాయని కూడా ఆయన మండిపడ్డారు. వీటికి సంబంధించిన ఫొటోలను ట్విట్టర్‌లో షేర్ చేశారు. ఇవే అంశాలు మధ్యంతర్ బడ్జెట్‌లో ఉన్నాయని వెల్లడించారు. బడ్జెట్‌ను ముందుగానే బయటకు లీక్ చేయడం చాలా సీరియస్ విషయమని, గోప్యత ఉల్లంఘనకు కిందకు వస్తుందని చెప్పారు.

మోసకారి ప్రభుత్వం ప్రవేశపెట్టిన దగా బడ్జెట్‌గా కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ వర్ణించారు. గత నాలుగేళ్లలో వీటికి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటర్లకు గాలం వేసేందుకే బడ్జెట్‌లో తాయిలాలు ప్రకటించారని ఆరోపించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని అన్నారు.

ఎన్డీయేతర పార్టీల భేటీ

- ఈవీఎంలపై అనుమానాలు
- సోమవారం ఈసీని కలుస్తాం
- బడ్జెట్‌పై రాహుల్ విసుర్లు



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విపక్షాలు మరోసారి కలిశాయి. సేవ్ ది నేషన్ సేవ్ డెమోక్రసీ పేరుతో ఎన్డీయేతర పక్షాలు ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్లో భేటీ అయ్యాయి. ఈ భేటీకి ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీ, ఏపీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు. ఏపీ సీఎం నల్లటి దుస్తులతో వచ్చారు.

పలుపార్టీల అధినేతలు

రాహుల్ గాంధీ, చంద్రబాబులతో పాటు కాంగ్రెస్ నేతలు గులాం నబీ ఆజాద్, ఏకే ఆంటోనీ, అహ్మద్ పటేల్, టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్, డీఎంకే ఎంపీ కనిమొళి, బీఎస్పీ సతీష్ చంద్ర మిశ్రా, శరద్ యాదవ్, శరద్ పవార్, రాంగోపాల్ యాదవ్, తెలంగాణ జన సమితి అధినేత కోదండరాంతో పాటు పాటు పలు పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఈవీఎంల పనితీరు, వ్యక్తమవుతున్న అనుమానాలపై చర్చించారు. బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చేపట్టాల్సిన ర్యాలీలపై చర్చించారు. త్వరలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ఎన్డీయేతర పక్షాల భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.

ఈవీఎంలపై అనుమానం

భేటీ అనంతరం ఏఐసీసీ అధ్యక్షులు మీడియాతో మాట్లాడారు. ఈవీఎంల విషయంలో విపక్ష నేతలం అందరం కలిసి ఎన్నికల సంఘాన్ని కలుస్తామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఈవీఎంల విషయంలో అనేక అనుమానాలు ఉన్నాయని చెప్పారు. ఈ మేరకు సోమవారం 21 బీజేపీయేతర పార్టీలు ఈసీని కలిసి, మెమోరాండం సమర్పిస్తాయని చెప్పారు. నాలుగున్నరేళ్లలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని చెప్పారు.

మోడీ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ ఆగ్రహం

నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులను అవమానించిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. మీరు కేవలం పదిహేను మందికి రూ.3.5 లక్షల కోట్ల లోన్లు మాఫీ చేశారని, కానీ రైతుకు మాత్రం ఇంత తక్కువగా ఇస్తారా అని ఆరోపించారు. రానున్న ఎన్నికలు రైతు సమస్యలు, నిరుద్యోగ సమస్య, సంస్థలపై దాడి, తదితర అంశాల ఆధారంగా ఉంటాయని చెప్పారు. కాగా, రైతులకు ప్రభుత్వం అండగా నిలిచేందుకు చేస్తున్న సాయాన్ని రాహుల్ గాంధీ తప్పుబట్టడాన్ని బీజేపీ విమర్శలు గుప్పిస్తోంది.

రఫేల్ డీల్‌లో కోట్లాది రూపాయల అవినీతి జరిగిందని రాహుల్ ఆరోపించారు. ఈ విషయంపై ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంభిస్తుందన్నారు. హెచ్‌ఏఎల్‌ను కాదని రఫేల్ డీల్‌ను అనిల్ అంబానీకి అప్పజెప్పారని ఇప్పటికే పలుమార్లు కేంద్రంపై మండిపడ్డారు. బీజేపీ చర్యలను ప్రజలు గమనిస్తున్నారని.. బీజేపీయేతర పక్షాలతో ఆ పార్టీకి అతి తొందరలోనే సాగనంపుతామన్నారు. ప్రజలు ప్రభుత్వం చేస్తున్న అన్ని విషయాలను గమనిస్తున్నారని వారే నరేంద్ర మోదీకి బుద్ది చెబుతారని అన్నారు. నాలుగున్నరేళ్లలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చని ప్రభుత్వం ప్రస్తుతం బడ్జెట్‌లో కూడా తీవ్ర అన్యాయానికి గురిచేసిందన్నారు. చూస్తుంటే ఇది కేవలం 2019 ఎన్నికల కోసమే రూపొందించిన బడ్జెట్‌లా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగిస్తుందన్నారు.

మోహన్‌భగవత్‌కు నిరసనల సెగ



లక్నో: రామాలయం సెగ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌కు తప్పలేదు. ప్రయాగరాజ్లో వీహెచ్పీ నిర్వహించిన ధర్మసంసథ్‌లో శుక్రవారంనాడు మోహన్ భాగవత్ ప్రసంగిస్తుండగా.. రామాలయం నిర్మించాలంటూ నినాదాలు మిన్నంటాయి. నిర్మాణం తేదీ చెప్పాలంటూ జనం డిమాండ్ చేశారు. సత్వరం మందిరం నిర్మించాలంటూ నినాదాలతో హోరెత్తించారు.

మోహన్ భాగవత్ తన ప్రసంగంలో, రామాలయ నిర్మాణం పనులు ప్రభుత్వం చేపట్టకుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ నాలుగు నెలలో నిర్మాణం పనులు మొదలవుతాయని చెప్పారు. దీంతో జనం ఒక్కసారిగా జై శ్రీరామ్ నినాదాలు చేస్తూ, తేదీ చెప్పండంటూ నిలదీశారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఓట్లు కోసమే కొందరు మందిరం మాట మాట్లాడుతున్నారు. అయితే హిందూ మత విశ్వాసాలను వాళ్లు పరిగణనలోని తీసుకుని మందిర నిర్మాణం జరపాలి. దీనిపై 34 నెలల్లో నిర్ణయం తీసుకున్నారో మంచిదే, లేదంటే నాలుగు నెలల తర్వాత మందిర నిర్మాణం పనులు ప్రారంభమవుతాయి అని భాగవత్ అన్నారు. కాగా, ఫిబ్రవరి 21న రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ఇదే వేదిక నుంచి శంకరాచార్య స్వరూపానంద సరస్వతి ఇటీవల ప్రకటించారు.

కాంగ్రెస్ నేతలను వీడని 1984 కేసు



న్యూఢిల్లీ: 1984 సిక్కుల ఊచకోత కేసు కాంగ్రెస్ పార్టీ నేతలను నీడలా వెంటాడుతోంది. ఇప్పటికే ఢిల్లీ కాంగ్రెస్ సీనియర్ నేత సజ్జన్ కుమార్ కటకటాల వెనక్కి వెళ్లగా.. తాజాగా ఈ కేసులో మరో నిందితుడు జగదీశ్ టైట్లర్‌పై విచారణ ముమ్మరం చేయాలని ఢిల్లీ కోర్టు సీబీఐని ఆదేశించింది. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల సందర్భంగా ఢిల్లీలోని పూల్ బంగాష్లో ముగ్గురు సిక్కులను హత్యచేసిన కేసులో టైట్లర్ నిందితుడిగా ఉన్నారు. అల్లర్లకు ప్రేరేపించిన వారిలో టైట్లర్ కూడా ఉన్నట్టు నానావతి కమిషన్ పేర్కొంది. కాగా సీబీఐ నుంచి ఇంతకుముందే క్లీన్ చిట్ అందుకున్న టైట్లు 2015 డిసెంబర్ నుంచి మళ్లీ విచారణ ప్రారంభమైంది. తనను చంపేస్తామని బెదిరింపులు వస్తున్నాయంటూ ఈ కేసులో కీలక సాక్షి అభిషేక్ వర్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఢిల్లీ పోలీసులు మళ్లీ కేసు నమోదు చేశారు.

ఇటీవల సజ్జన్ కుమార్‌కు జీవిత ఖైదు పడిన నేపథ్యంలోనే.. జగదీశ్ టైట్లర్ కేసులోనూ విచారణ ముమ్మరం చేయాలని ఢిల్లీ కోర్టు ఆదేశించడం గమనార్హం. అభిషేక్ వర్మకు చేయాల్సిన లైడిటెక్టర్ పరీక్ష ఇంకా సిద్ధం కాలేదని సీబీఐ చెప్పడంతో... ఈ ప్రక్రియను పూర్తిచేసి నివేదిక సమర్పించేందుకు కోర్టు రెండు వారాల గడువు విధించింది. 1984లో నాటి ప్రధాని ఇందిరా గాంధీని సిక్కు బాడీగార్డులు హతమార్చడంతో సిక్కు వ్యతిరేక అల్లర్లు మొదలయ్యాయి. ఈ హింసాకాండలో దేశవ్యాప్తంగా 2,800 మంది సిక్కులు ఊచకోతకు గురయ్యారు. ఒక్క ఢిల్లీలోనే 2,100 మంది సిక్కులు ప్రాణాలు కోల్పోయారు.

బడ్జెట్‌లో నిరుద్యోగ సమస్య లేదేమి?

- నిరుద్యోగంపై నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనేజేషన్
- సర్వే అంశాల విడుదలకు మోదీ నో



న్యూఢిల్లీ: దేశంలో నిరుద్యోగ సమస్య గత 45 ఏళ్లలో ఎన్నడూ లేనంత గరిష్ట స్థాయికి చేరుకుందని, 20172018 ఆర్థిక సంవత్సరంలో నిరుద్యోగ సమస్య 6.1 శాతానికి చేరుకుందని 'నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్' నివేదిక వివరాలు వెల్లడిస్తున్న విషయం తెల్సిందే. ఈ సమస్య 2019 సంవత్సరానికి ఎనిమిది శాతానికి కూడా తాకవచ్చని సర్వే అంచనా వేసింది. దేశంలో యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నరేంద్ర మోదీ హామీ ఇవ్వడంతో ఎక్కువ మంది నిరుద్యోగ యువత నాడు ఆయన పార్టీకే ఓటు వేసింది. ముఖ్యంగా మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్న 15 కోట్ల మందిలో ఎక్కువ శాతం మంది బీజేపీకి ఓటు వేయడం వల్ల ఆ పార్టీకి 31 శాతం ఓట్లు వచ్చాయి.

గణనీయంగా పెరిగిన నిరుద్యోగులు

2019 ఎన్నికల్లో 13 కోట్ల మంది మొదటిసారి ఓటు వేయబోతున్నారు. గ్రామీణ ప్రాంతాలకన్నా పట్టణ ప్రాంతాల్లో స్త్రీ, పురుషుల్లో నిరుద్యోగ శాతం గణనీయంగా పెరిగింది. పురుషుల్లో నిరుద్యోగుల సంఖ్య 18.7 శాతానికి చేరుకోగా, మహిళల్లో ఏకంగా 27.2 శాతానికి చేరకుంది. గతేడాది రైల్వేలో 63 వేల దిగువ, మధ్య స్థాయి ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానించగా ఏకంగా కోటీ 90 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో పీహెచ్‌డీలు కూడా చేసిన నిరుద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉండడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.

అనధికారికంగా వెలుగులోకి..

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిరుద్యోగ సర్వే వివరాలను బహిర్గతం చేసేందుకు అనుమతించలేదు. అనధికారికంగా నివేదికలోని అంశాలు వెలుగు చూశాయి. మోదీ ప్రభుత్వం గురువారం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనల్లో రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వివిధ వర్గాలను మెప్పించేందుకు ప్రయత్నించడం కనిపిస్తోంది. అయితే అలాంటి ప్రతిపాదనల్లో కూడా నిరుద్యోగుల ఊసుకూడా లేకపోవడం శోచనీయం. ఈ నేపథ్యంలో 2014లో మొదటిసారి ఓటు హక్కును వినియోగించున్న వారిలో, 2019లో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకుంటున్న వారిలో ఎంత మంది బీజేపీ పార్టీకి ఓటు వేస్తారన్నది ప్రశ్నే.

ట్రైనీ విమానం కూలి ఇద్దరు పైలెట్ల దుర్మరణం

బెంగుళూరు: బెంగుళూరులో శుక్రవారం ట్రైనీ విమానం ఒకటి కుప్పకూలిన ఘటనలో ఇద్దరు పైలెట్‌లు దుర్మరణం చెందారు. ఈ సంఘటన హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) ఎయిర్‌పోర్ట్‌లో జరిగింది. విమానంలో ఇద్దరు పైలెట్లు మాత్రమే ఉన్నారు. ప్రమాదం జరుగుతున్న సమయంలో ఇద్దరు పైలెట్లు విమానం నుంచి బయటికి వచ్చేశారు. ఒక పైలెట్ విమానంపై పడడంతో మృతి చెందాడు. మరో పైలెట్ కు తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఈ విషయంపై రక్షణ శాఖ అధికారి విచారణకు ఆదేశించారు. ప్రస్తుతం ప్రమాదంపై కారణాలు తెలియరాలేదన్నారు. పైలెట్లు సమీర్ ఎబ్రోల్, సిద్ధార్త్ నేగిగా గుర్తించారు. ఇద్దరూ విమాన సిస్టమ్ పరీక్షా విభాగంలో స్క్వాడ్రన్ లీడర్లుగా విధులు నిర్వహిస్తున్నారు.



(ఫైల్‌ఫోటో)

రబ్రీదేవి మూడు ఫ్లాట్లు జప్తు



పాట్నా: అక్రమ ఆస్తి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి ఆమె కూతురు హేమాదేవి పేరుపై ఉన్న మూడు ఫ్లాట్లను ఇన్‌కంట్యాక్స్ అధికారులు జప్తు చేశారు. సుగుణ ప్రాంతంలోని ఒక ఫ్లాట్, ఫుల్‌వారిషరీఫ్ ప్రాంతంలోని మరో రెండు ఫ్లాట్లను ఇన్‌కంట్యాక్స్‌కు చెందిన ఎడ్యూకేటింగ్ అథారిటీ అధికారులు జప్తు చేశారు.

2017లో ఈ మూడు ప్రాపర్టీలను అధికారులు తాత్కాలికంగా జప్తు చేశారు. ఈ మూడు ఆస్తులు రబ్రీదేవి, ఆమె కూతురుకి గిఫ్ట్ కింద సమకూరాయి. ఇన్‌కంట్యాక్స్ అధికారుల సోదాల్లో ఈ ఆస్తులకు సంబంధించిన పలు దస్త్రాలు లభించాయి. దీంతో ఈ మూడు ఫ్లాట్లను అక్రమ ఆస్తులుగా అధికారులు విచారణ చేపట్టారు. ఈ మూడు ఆస్థులు లాలూప్రసాద్ యాదవ్ వద్ద పనిచేసే గోపాల్‌గంజ్‌లో నివసించే లలన్ చౌదరీ, హృదయానంద్ చౌదరిల పేరుపై ఉండేవి. హదయానంద్ రైల్వేలో పనిచేస్తుండగా, లలన్ చౌదరీ విధాన సభలో విధులు నిర్వహిస్తున్నారు. అధికారుల విచారణలో ఇరువురి వద్ద ఉండడానికి ఇళ్లు కూడా లేవని నిర్ధారణ అయ్యింది. ఇద్దరూ అద్దె ఉంటారని తెలిసింది. ఈ ఇద్దరు కూడా 2008లో మూడు ఫ్లాట్లు కొనుగోలు చేసినట్లుగా పత్రాలు లభించాయి. అనంతరం గిఫ్ట్ డీడ్ కింద పత్రాలను మార్చారు.

ఇద్దరు ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్



శ్రీనగర్: జమ్మూ–కశ్మీర్ పూల్వామా జిల్లాలో శుక్రవారం భద్రతా బలగాలు జైష్–ఏ–మొహమ్మద్‌కు చెందిన ఇద్దరు ఉగ్రవాదులకు మట్టుబెట్టాయి. ఈ ఇరువురు షాహీద్ అహ్మద్ బాబా, ఇనాయ్ అహ్మద్ జిగర్‌గా గుర్తించారు. ఒక ఎస్‌ఎల్‌ఆర్ రైఫిల్, ఒక పిస్టోల్‌ను వారి వద్ద నుంచి లభించాయి. భద్రతా బలగాలకు పూల్వామాలోని రాజ్‌పోరాలో ఉగ్రవాదులు తిష్టవేశారనే సమాచారం అందించి. దీంతో రాష్ట్రీయ రైఫిల్స్, స్పెషల్ ఆపరేషన్ గ్రూప్, పోలీసులు సంయుక్తంగా కలిసి ఈ ఆపరేషన్ చేపట్టారు.

గురువారం రాత్రి 25 ఏళ్ల మహిళను ఉగ్రవాదులు హత్యచేశారు. హత్య దృశ్యాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి సంచలనం సృష్టించారు. ఈ విషయంపై పూల్వామా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కాగా బారాముల్లాలో ఉగ్రవాదుల జాడలు అసలు లేవని భద్రతా దళాలు ప్రకటించారు. 2017 నుంచి భద్రతా దళాలు ఉగ్రవాదుల కోసం స్పెషల్ ఆపరేషన్ చేపట్టారు. బారాముల్లాలో ఉగ్రవాదులు ఇక లేరని ప్రకటించారు. గడిచిన నాలుగు సంవత్సరాల్లో 2018లో 257మంది ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. 2017లో 213 మంది, 2016లో 150, 2015లో 108మందిని భద్రతా దళాలు మట్టుబెట్టాయి. 2018లో 142 మంది ఉగ్రవాదులను 31 ఆగస్టు వరకు మట్టుబెట్టాయి. ఒక్క ఆగస్టులోనే 25 మంది ఉగ్రవాదులు ఎన్‌కౌంటర్ కావడం విశేషం.

ఇక ఘాటి (లోయ)లో 300 మంది ఉగ్రవాదులు ఇప్పటికి ఉన్నారని భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి. దక్షిణ కశ్మీర్‌లో వీరు ఎక్కువగా తలదాచుకొని ఉంటారని భావిస్తున్నారు. సోషల్ మీడియా మాధ్యమంతో యువతను వీరు తప్పుదోవ పట్టిస్తున్నారు.

రక్షణలో భారీ కేటాయింపులు చేస్తున్న దేశాలు




న్యూఢిల్లీ: రక్షణ రంగంలో 3 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తున్నట్లు భారత్ ప్రకటించింది. ఇంతపెద్ద మొత్తంలో రక్షణ రంగానికి బడ్జెట్ కేటాయించడం ఇదే తొలిసారి. మన పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్‌లు కూడా రక్షణ రంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యతనిస్తుండడంతో భారత్ కూడా పెద్ద ఎత్తున పెంచిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రపంచంలోని రక్షణ రంగానికి కేటాయిస్తున్న తొలి 10 దేశాలు.

- అమెరికాలో రక్షణ రంగం బడ్జెట్ 596 బిలియన్ డాలర్లు. అమెరికా జీడీపీలో ఇది 3.3 శాతం.
- చైనా 215.0 బిలియన్ డాలర్లు. జీడీపీలో 1.9 శాతం.
- పాకిస్థాన్ ప్రభుత్వం రక్షణ రంగానికి 9.6 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది.
- సౌదీ అరేబియాలో 87.2 బిలియన్ డాలర్లు. జీడీపీలో 13.2 శాతం.
- రష్యా 66.4 బిలియన్ డాలర్లు. జీడీపీలో 5.4 శాతం.
- బ్రిటన్ 55.5 బిలియన్ డాలర్లు. జీడీపీలో 2.0 శాతం.
- ఫ్రాన్స్ 50.9 బిలియన్ డాలర్లు. జీడీపీలో 2.1 శాతం.
- జపాన్‌లో 43.6 బిలియన్ డాలర్లు. జీడీపీలో 1.4 శాతం.
- జర్మనీ 39.4 బిలియన్ డాలర్లు. జీడీపీలో 1.2 శాతం.
- దక్షిణ కొరియాలో రక్షణ రంగానికి ఎక్కువ కేటాయింపులు చేస్తున్నారు.

పారికర్‌కు ఎయిమ్స్‌లో చికిత్స

- ప్రతిఒక్కరి అభివృద్ధిని కాంక్షించే బడ్జెట్
- ఆసుపత్రి నుంచే ట్వీట్ చేసిన సీఎం



(ఫైల్‌ఫోటో)

న్యూఢిల్లీ: గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ కేన్సర్ చికిత్స తీసుకునేందుకు ఢిల్లీ వెళ్లారు. గురువారం సాయంత్రం ఆయనను ఎయిమ్స్‌లో కేన్సర్ విభాగంలో చేరారు. ప్రస్తుతం ఆయనకు చికిత్సను అంకాలజీ వైద్యుడు అతుల్ శర్మ అందిస్తున్నారు. పారికర్ మరికొన్ని రోజులు ఎయిమ్స్‌లో చికిత్స పొందనున్నారు.

తాజాగా పారికర్ బడ్జెట్ విడుదల అనంతరం శుక్రవారం ట్వీట్ చేశారు. భారతదేశం అభివృద్ధి దిశలో పయనించే దిశగా బడ్జెట్ ఉందని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇది ఒక సంతులిత బడ్జెట్ అని సమాజంలోని ప్రతి ఒక్కరి అభివృద్ధిని కాంక్షిస్తుందన్నారు. దీంతోబాటే భారతదేశ అభివృద్ధి దిశగా అడుగులు వేయనుందన్నారు. రైతులు, నిరుపేదలు, మధ్యతరగతి ప్రజానీకం, యువకులకు ఈ బడ్జెట్‌తో మేలు చేకూరనుందని పారికర్ స్పష్టం చేశారు.

గత సంవత్సరం ఫిబ్రవరిలోనే పాంక్రియాటిక్ కేన్సర్‌తో పారికర్ బాధపడుతున్నారనే విషయం బయటికి పొక్కింది. ఆ పిమ్మట గోవా, ముంబై, ఢిల్లీ, అమెరికాలోని న్యూయార్క్‌కు చికిత్స కోసం వెళ్లారు. 30 అక్టోబర్‌న మొదటిసారిగా గోవా మంత్రి విశ్వజిత్ పారికర్ పాంక్రియాటిక్ కేన్సర్‌తో బాధపడుతున్నారని పేర్కొన్న విషయం విదితమే.

ఆఫ్ఘన్‌లో శాంతి స్థాపనకు అమెరికా, తాలిబన్ల సూత్రప్రాయ అంగీకారం..

వాషింగ్టన్: సుమారు పదిహేడేండ్లుగా యుద్ధంతో ఛిద్రమైపోయిన ఆఫ్ఘనిస్థాన్లో శాంతి స్థాపనకు అమెరికా, తాలిబన్లు సూత్రప్రాయంగా అంగీకరించినట్టు న్యూయార్క్టైమ్స్ పత్రిక తెలిపింది. ముసాయిదా ఒప్పందం ప్రకారం..

ఆఫ్ఘన్ నేలను ఉగ్రవాదుల స్థావరం కాకుండా చూస్తామని, కాల్పుల విరమణ పాటిస్తామని, చర్చలకు వస్తామని తాలిబన్లు తెలుపగా, తమ సైనిక దళాలను ఉపసంహరిస్తామని అమెరికా తెలిపిందని వెల్లడించింది. ఆఫ్ఘన్లో శాంతి స్థాపన ముసాయిదా తమ వద్ద ఉందని, అది ఒప్పందం గా మారాల్సి ఉందని అమెరికా ప్రతినిధి తెలిపారు.



చలి తీవ్రతకు 8 మంది మృతి..

పలు విమాన సేవలు రద్దు..

షికాగో: అమెరికాలోని ప్రజలు చలికి వణికిపోతున్నారు. అత్యల్ప ఉష్ణోగ్రతలకు తోడు.. ఆర్కిటికా నుంచి వీస్తున్న భయంకరమైన శీతల గాలుల ధాటికి జనం బయటికి రావాలంటేనే జంకుతున్నారు. అక్కడి మధ్య పశ్చిమ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఏకంగా అంటార్కిటికా ధృవం కన్నా తక్కువగా మైనస్ డిగ్రీలకు పడిపోయాయి. విమానాల రాకపోకలు ఆగిపోయాయి. శరీర ఉష్ణోగ్రతలు కూడా ఎక్కడ పడిపోతాయోనన్న భయంతో స్కూళ్లు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు మూసివేశారు. ఈ శీతల గాలులకు ఇప్పటివరకు దాదాపు 8 మంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. చలి గాలుల తీవ్రతకు అమెరికాలోని దాదాపు 12 రాష్ట్రాల ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. ఇండియానా, మిషిగాన్, ఇల్లినాయిస్, ఒహియో, అయోవా, డకోటాస్, నెబ్రస్కా ప్రాంతాల్లో తపాలా వ్యవస్థ మొత్తం స్తంభించిపోయింది. చలి తీవ్రతకు నయాగరా జలపాతం గడ్డ కట్టుకుపోయింది. నది ప్రవాహం కూడా నిలిచిపోయింది. షికాగో నగరం మొత్తాన్ని మంచు దుప్పటి కప్పేసింది. గురువారం తెల్లవారుజామున రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. షికాగోలో బుధవారం ఉదయం మైనస్ 30.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇల్లినాయిస్లోని రాక్ఫోర్డ్ పట్టణంలో మైనస్ 31 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కేవలం షికాగోలోని రెండు ఎయిర్‌పోర్టుల నుంచి వెళ్లాల్సిన దాదాపు 1,700లకు పైగా విమానాలు రద్దయ్యాయి. రైలు సర్వీసులు కూడా నిలిచిపోయాయి. వృద్ధులు, పిల్లల కోసం పలు చోట్ల 200లకు పైగా వెచ్చటి కేంద్రాలు (వార్మింగ్ సెంటర్స్) ఏర్పాటు చేశారు. బస్సులను కదిలే వార్మింగ్ కేంద్రాలుగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టారు. షికాగోలోని వీధుల్లో జీవించే దాదాపు 16 వేల మంది కోసం శిబిరాలను పెంచారు.

నకిలీ ఏజెంట్ల బారినపడి మోసపోకండి

- ఆటా వెబినార్ సదస్సులో ఇమ్మిగ్రేషన్ అటార్నీల విజ్ఞప్తి

న్యూజెర్సీ: వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమంగా అమెరికాలో నివాసం ఉంటున్న వారిని పట్టుకునేందుకు హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం చేపట్టిన స్టింగ్ ఆపరేషన్లో చిక్కుకున్న తెలుగు విద్యార్థులను ఆదుకునేందుకు అమెరికన్ తెలుగు అసోసియేషన్(ఆటా) రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంలో పోలీసులు ఇప్పటివరకు 600 మందికి వారెంట్లు జారీ చేయగా.. 100 మందిని అరెస్టు చేశారు. ఇందులో భాగంగా బాధితులను ఆదుకునే క్రమంలో ఇండియన్ ఎంబసీకి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆటా ప్రెసిడెంట్ పరమేష్ భీమ్రెడ్డి తెలిపారు. అదే విధంగా నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసాలకు గురికాకుండా ఉండేందుకు ఆటా వెబినార్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా పరమేష్ భీమ్రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల్లో విద్యార్థులకు మరే ఇతర దేశం కల్పించని గొప్ప అవకాశాలు అమెరికా కల్పిస్తుందన్నారు. ఇక్కడ నివసించేందుకు విద్యార్థులు అడ్డదారులు తొక్కడం సరికాదని, చట్టాలను అతిక్రమించడం వల్ల



ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆటా వెబినార్ సదస్సులో భాగంగా అట్లాంటాకు చెందిన ఇమ్మిగ్రేషన్ అటార్నీలు రవికుమార్ మన్నం, మైఖేల్ సోఫో, హేమంత్ రామచంద్రన్ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

- కమిషన్ ఏజెంట్లకు దూరంగా ఉండటమే శ్రేయస్కరం.
- ఎక్కువ కమిషన్కు కక్కుర్తి పడి నకిలీ ఏజెంట్లు యూనివర్సిటీల గురించి ఎటువంటి ఆరా తీయకుండానే విద్యార్థులకు అందులో అడ్మిషన్లు చేయిస్తున్నారు. మనం కూడా ఒకసారి సదరు యూనివర్సిటీల వివరాలు తెలుసుకోవాలి.
- నిజమైన యూనివర్సిటీలు టోఫెల్ఐఈ /ఎల్టీఎస్/ జీఆర్ఈ స్కోరు కార్డు అడుగుతాయన్న విషయాన్ని గమనించాలి.
- మనం చేరబోయే కాలేజీకి సంబంధిత శాఖల నుంచి అక్రిడేషన్ ఉందా లేదా అనే విషయాన్ని తెలుసుకోవడం ఉత్తమం.
- విద్యార్థిగా వచ్చినప్పుడు విద్యాభ్యాసమే ప్రాదాన్యం కావాలి. అంతేగానీ సంపాదన కోసం సులువైన మార్గాలు ఎంచుకోవడం అంటే చట్ట వ్యతిరేక మార్గంలో ప్రయాణిస్తున్నట్లే.
- ఎక్కువగా ప్రాచుర్యం లేని, అనుమానాస్పద యూనివర్సిటీల్లో చేరకపోవడమే ఉత్తమం. కొంత మంది నకిలీ ఏజెంట్లు ఆసక్తి ఉన్న విద్యార్థులను ఆకర్షించేందుకు వారి ఈమెయిల్, ఫోన్ నంబర్లు సేకరించి వీసా కోసమని డబ్బులు వసూలు చేస్తారు. ఫలానా యూనివర్సిటీలో చేరితే ఎన్నో లాభాలు ఉంటాయంటూ మభ్యపెడతారు. కానీ తీరా వారు చెప్పిన ప్రదేశానికి వెళ్లిన తర్వాత ఎటువంటి స్కూలుగానీ, యూనివర్సిటీ గానీ ఉండదు. కాబట్టి అటువంటి ఆకర్షణలకు లొంగకపోవడమే మంచిది.
- ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న విద్యార్థుల వివరాలు తెలుసుకునేందుకు https://www.ice.gov/ సైట్ను సంప్రదించవచ్చు.
- ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్ఫోర్స్మెంట్(ఐసీఈ) ఆఫీసర్లను సంప్రదించినట్లైతే బంధీలుగా ఉన్న విద్యార్థులను కలిసే అవకాశం ఉంటుంది. సాధారణంగా వారిని సిటీకి దూరంగా ఉంచుతారు.

హిందూ దేవాలయంపై దాడి

వాషింగ్టన్: అమెరికా కెంటకీ రాష్ట్రంలోని లూయిస్విల్లీలో ఉన్న ప్రఖ్యాత స్వామి నారాయణ ఆలయంపై దుండగులు దాడికి పాల్పడ్డారు. విగ్రహ ప్రతిమపై నల్ల రంగు చల్లడంతోపాటు ఆలయ గోడలపై విద్వేషపూరిత రాతలు రాశారు. ఆలయ కిటికీలు సహా సామగ్రిని ధ్వంసం చేశారు. ఘటన ఆదివారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం మధ్య జరిగినట్లు భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇది జాతి విద్వేషంతో జరిపిన దాడిగా పరిగణిస్తున్నారు. దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వెల్లడించారు. దీనిపై ఎలాంటి వీడియో పుటేజీలు లభించలేదని ఆలయ అధికారులు తెలిపారు. ధ్వంసమైన స్వామి నారాయణ ఆలయాన్ని లూయిస్విల్లీ మేయర్ జార్జ్ ఫిషర్ సందర్శించారు. ఆలయంపై దాడిని ఆయన ఖండించారు. ఏ మతం వారైనప్పటికీ ఇలా దేవాలయాలను ధ్వంసం చేయడం తగదని ఆలయానికి చెందిన రాజ్ పటేల్ తెలిపారు.

వీసా తెచ్చిన తంటా..

భార్యాపిల్లల్ని వదిలేసి, దేశం విడిచి..

ఇంగ్లాండ్: ఓ కుటుంబం విడిపోవడానికి ఎన్నో కారణాలు ఉంటాయి. భార్యభర్తల మనస్పర్థలు, కాపురంలో కలహాలు, ఆర్థిక సమస్యలు... అయితే ఆ కుటుంబం విడిపోవడానికి ఇవేవీ కారణాలు కాలేదు, ఆ దేశ చట్టం కారణమైంది. అవును యూకేలో కొత్తగా అమలులోకి వచ్చిన కుటుంబ వీసా చట్టం కారణంగా ఓ కుటుంబం విడిపోయింది. కట్టుకున్న భార్యాపిల్లల్ని ఒంటరిగా వదిలేసి... అతను బతకు తెరువు వెతుక్కుంటూ పోవాల్సి వచ్చింది. కెనడా దేశానికి చెందిన మహ్మద్ అబ్దుల్ రెహ్మాన్ అనే వ్యక్తి యూకేలోని బ్రిస్టోల్ సిటీలో నివాసం ఉంటున్నాడు. భార్య నోరాహ్తో పాటు నలుగురు పిల్లలతో అతని జీవితం హాయిగా గడిచిపోతోంది.

అతని భార్య నోరాహ్ ఇంగ్లండ్ దేశస్థురాలు. అతని సంతానం కూడా యూకేలోనే పుట్టడంతో వారికి కూడా యూకే పౌరసత్వం వచ్చింది. మహ్మద్ అబ్దుల్ రెహ్మాన్ మాత్రం కెనడాలో ఉద్యోగం చూస్తూ... భార్యాపిల్లల దగ్గరకు వెళ్లి వస్తూ ఉండేవాడు. తరుచూ విజిటర్ వీసాతో యూకేకి వచ్చి పోతుండేవాడు.

వీసా గడువు ముగుస్తుందనగా నిత్యం రెన్యూవల్ కోసం దరఖాస్తు చేస్తుండేవాడు. అయితే యూకే గవర్నమెంట్ తీసుకొచ్చిన కొత్త నిబంధన అతనికి శాపమైంది. కనీసం 62,500 యూరోలు (దాదాపు రూ. 51 లక్షలకు పైనే) ఆదాయం కలిగిన వారే



యూకేకి వచ్చి విజిటర్స్ వీసా మీద వచ్చి, కొన్నాళ్లు ఉండేందుకు అర్హులంటూ కొత్త చట్టం తీసుకొచ్చింది యూకే. అబ్దుల్కు అంత ఆదాయం లేదు. ఆస్తులు కూడా ఆ విలువను చేరుకోకపోవడంతో అబ్దుల్ వీసా రెన్యూవల్‌ను తిరస్కరించింది యూకే ప్రభుత్వం. దాంతో మనోడు భార్యాపిల్లలను వదిలేసి... కెనడా వెళ్లాల్సి వస్తోంది. అబ్దుల్‌కు మద్ధతుగా కొందరు సోషల్ మీడియాలో క్యాంపెయిన్ మొదలెట్టారు. వీసా నిబంధనలు మార్చాలంటూ యూకే గవర్నమెంట్ను తిట్టిపోస్తూ చివాట్లు పెడుతున్నారు.

రూ.5.60 కోట్లకు

కుచ్చుటోపీ

- ప్రకటనదారులే అతని టార్గెట్...
- అమెరికాలో తెలుగు యువకుడి అరెస్టు
- 400 కోట్ల మందిని ముంచిన వైనం
- బాధితుల్లో అత్యధికులు భారతీయులే

వాషింగ్టన్: సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు ఇచ్చే ప్రకటనదారులే అతని టార్గెట్.. సామాజిక మాధ్యమాల్లో అమ్మకానికి వస్తువులు, ఇంటి అద్దెలపై ప్రకటనలిచ్చేవారంటే అతడి దృష్టిలో బకరాలే.. వస్తువులను కొంటాననే వంకతో ప్రకటనదారుల బ్యాంకు ఖాతా వివరాలు తీసుకుంటాడు. అమెరికా బ్యాంకులు కస్టమర్‌ఫ్రెండ్లీ బ్యాంకింగ్ కోసం సర్వర్, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు వినియోగదారులకు ఇబ్బంది లేకుండా అమలు చేసే 'ప్రొవిజనల్ క్రెడిట్' వ్యవస్థను అస్త్రంగా వాడుకుంటాడు. అందినకాడికి దండుకుంటాడు. ఇలా మోసాలకు పాల్పడుతున్న ఓ తెలుగు యువకుడిని అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు అమ్మిశెట్టి కిశోర్బాబు 2013లో విద్యార్థి వీసాపై అమెరికాకు వచ్చాడని, అతని వీసా గడువు 2014తో ముగిసిందని ఫెడరల్ ప్రాసిక్యూటర్ చెప్పారు. 'ఫేస్బుక్ మార్కెట్ప్లేస్ వంటి ఈకామర్స్ ప్రకటనల వెబ్సైట్లలో వస్తువుల విక్రయాలు, అద్దె ఇళ్లపై ప్రకటనలు ఇచ్చేవారిని కిశోర్ సంప్రదిస్తాడు. డబ్బును బదిలీ చేసేందుకు బ్యాంకు ఖాతా వివరాలివ్వాలని కోరుతాడు.

ఆ తర్వాత ఖాతా నంబర్లను పేర్కొంటూ బ్యాంకుకు ఫోన్ చేస్తాడు. తాను ఏటీఎం ద్వారా కొంత డబ్బు డిపాజిట్ చేశానని, ఆ సేవలను రిజిస్టర్ చేసుకోకపోవడంతో అవి ఖాతా నిల్వలో కనిపించడంలేదని చెబుతాడు. దీంతో.. బ్యాంకు వారు ఆ మొత్తాన్ని ప్రొవిజనల్ క్రెడిట్గా నమోదు చేస్తారు. ఆ తర్వాత బాధితులకు ఫోన్ చేసి.. తాను పొరపాటున వారి ఖాతాలో డబ్బు డిపాజిట్ చేసినట్లు పేర్కొంటాడు. దాన్ని పూర్తిగా కానీ, కొంతమొత్తమైనా తిరిగి తన ఖాతాకు బదిలీ చేయాలని కోరుతాడు. అతడు పేర్కొన్న మొత్తం ప్రొవిజనల్ క్రెడిట్గా ఖాతా నిల్వలో ఉండటంతో.. బాధితులు కిశోర్కు పీర్‌టుపీర్ వ్యవస్థ ద్వారా డబ్బు పంపగానే.. నిందితుడి టాస్క్ పూర్తవుతుంది' అని వివరించారు. ఇలా దాదాపు 400 మంది నుంచి రూ. 5.68 కోట్ల మేర కొల్లగొట్టినట్టు ప్రాసిక్యూటర్ వివరించారు.



ఫోన్‌లో ఆ వీడియోలున్నాయని..

మెల్‌బోర్న్: ఫోన్లో అశ్లీల దృశ్యాలు ఉన్నాయని ఓ వ్యక్తికి జైలుశిక్ష వేసిన ఘటన మెల్బోర్న్లో చోటుచేసుకుంది. ఇండియాకు చెందిన మన్ప్రీత్ సింగ్ ఫోన్లో చైల్ పోర్నొగ్రఫీకి సంబంధించిన వీడియోలు ఉన్నాయని.. ఇది చట్టరిత్యా నేరమని అతడిని కష్టడీలోకి తీసుకున్నారు.

అయితే ఇది నేరమని తనకు తెలియదని కోర్డు ముందు విన్నవించుకున్నాడు. అతని వాదన విన్న కోర్టు.. ఇంతకు ముందు అతనిపై ఎలాంటి కేసులు లేనందున ఏడు నెలల జైలు శిక్షను, ఐదు వందల డాలర్లను ఫైన్‌గా వేసింది. దీంట్లో రెండు నెలలు మాత్రమే జైలు శిక్ష అని, మంచి ప్రవర్తనతో మెలిగితే.. ఆ తరువాత వెయ్యి డాలర్ల పూచీ కత్తుతో బయటకు రావచ్చని తెలిపింది. అయితే ఆ ఐదు నెలలు కోర్టు పరిధిలోనే ఉండాలని అటు తరువాతే ఇండియాకు పంపుతామని కోర్టు తీర్పునిచ్చింది.

నాసా రోవర్ పనిచేయడం లేదు..

వాషింగ్టన్: అరుణగ్రహంపై 15 ఏండ్లుగా సంచరిస్తూ అక్కడి సమాచారం చేరవేసిన నాసా అపార్చునిటీ రోవర్ ఏడు నెలలుగా పనిచేయడం లేదని శాస్త్రవేత్తలు తెలిపారు. గతేడాది జూన్ 10 నుంచి ఏ సంకేతాలు లేవన్నారు. అంగారక గ్రహం చుట్టూ లేచిన దుమ్ము తుఫాన్ వల్ల రోవ్వ మట్టి పేరుకోవడంవల్లే సూర్యరశ్మి అందక దానిలోని సౌరశక్తితో పనిచేసే బ్యాటరీలను చార్జింగ్ చేసుకోలేకపోయిందంటున్నారు. రోవర్ను పనిచేయించేందుకు 600కుపైగా ప్రయత్నాలు చేశామని, అవేవీ ఫలించక అది నిర్జీవంగా మారిందని నిర్ధారణకు వచ్చామన్నారు.

కృత్రిమ మేథకు అందలం..

ఢిల్లీ: కృత్రిమ మేథ (ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్)లో సంభవిస్తున్న మార్పులు, ఆవిష్కరణలను ఎప్పటికప్పుడు అందుకోవాలని కేంద్రం నిర్ణయించింది. ఈ అంశాన్ని తాజా బడ్జెట్లో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రస్తావించారు. కృత్రిమమేధకు సంబంధించి జాతీయ స్థాయి కేంద్రాన్ని ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. ఇతర టెక్నాలజీ కేంద్రాలతో కలిసి ఇది పనిచేస్తుంది. ఈమేరకు తొమ్మిది ప్రాధాన్యత రంగాలను గుర్తించారు. జాతీయ స్థాయిలో ఒక పోర్టల్ను కూడా నెలకొల్పనున్నట్టు మంత్రి పేర్కొన్నారు.



ఇ–వ్యర్థాలతో ముంచుకొస్తోన్న ముప్పు

- ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో శాస్త్రవేత్తల వెల్లడి

ఇంటర్‌నేషనల్ డెస్క్: ఏటా కాలం తీరిన ఎలక్ట్రానిక్ పరికరాలను వందల టన్నుల్లో పడేస్తున్నాం. ఫలితంగా ఇవ్యర్థాలు గుట్టలా పేరుకుపోతున్నాయి. ఇలా నిరుపయోగంగా మారిన ఇవేస్ట్తో సంవత్సరానికి దాదాపు 4,500 ఈఫిల్ టవర్లను నిర్మించవచ్చట. అంతేనా ఇలా పోగుపడిన ఇ వేస్ట్ బరువు ఏకంగా 1,25,000 బోయింగ్ 747 జంబో జెట్ల బరువుకు సమానమట. ఇవేవో గాలి కబుర్లు కావు. స్వయంగా దావోస్ వేదికగా నిర్వహించిన ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో ఈ నివేదికను వెల్లడించారు. అవును మరి ప్రస్తుతం చేతిలో స్మార్ట్ఫోన్.. ఇంట్లో టీవీలు, వాషింగ్ మెషిన్లు, ఫ్రిజ్లు.. ఆఫీసుల్లో ల్యాప్టాప్లు, కంప్యూటర్లు.. ఇవే కాక బయట మరో సవాలక్ష ఎలక్ట్రానిక్ పరికరాలు. ఇవి లేకపోతే మనకు నిమిషం కూడా గడవని పరిస్థితి.

ఉపయోగాలు లేవని కాదు.. అతి వాడకం. వెరసి రోజురోజుకు పెరిగిపోతున్న ఇవ్యర్థాలు. వీటిని పునరుపయోగించడం చాలా కష్టమైనదే కాక ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ. ఇన్నాళ్లు గ్లోబల్ వార్మింగ్ గురించి ఆందోళన చెందితే.. ఇప్పుడు ఇ వ్యర్థాలు మరింత భయపెడుతున్నాయి. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా పోగవుతున్న వ్యర్థాల్లో ఇవేస్ట్ వాటా కేవలం 2 శాతం మాత్రమే. కానీ పర్యావరణానికి కలిగించే హానిలో వీటి వాటా మాత్రం ఏకంగా 70 శాతం అంటే ఇవేస్ట్ ఎంత ప్రమాదకరమో అర్థం చేసుకోవచ్చు. స్విట్జర్లాండ్లోని దావోస్లో ఈనెల 21 నుంచి ఐదు రోజుల పాటు జరిగిన డబ్ల్యూఈఎఫ్ వార్షిక సదస్సులో ఈ ఇవ్యర్థాల గురించి చర్చించారు. పెరిగిపోతున్న ఇవేస్ట్ను తగ్గించేందుకు తీసుకునే చర్యలే కాక.. సులభంగా రీసైకిల్ చేసి రీయూజ్ చేసే మార్గాల గురించి పరిశోధనలు పెంచాలని నిర్ణయించారు.

షట్‌డౌన్‌కు..

తాత్కాలిక విరామం

- రాజకీయ ఒత్తిడితో దిగివచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్: అమెరికా చరిత్రలోనే రికార్డు స్థాయిలో కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్‌కు తాత్కాలికంగా తెరపడింది. రాజకీయ ఒత్తిడికి తలొగ్గిన అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్.. మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి నిధులు సాధించలేకపోయినప్పటికీ ప్రభుత్వాన్ని తాత్కాలికంగా మళ్లీ తెరిచేందుకు అంగీకరించారు. గోడ నిర్మాణానికి 570 కోట్ల బిలయన్ డాలర్లు కేటాయించాలని ట్రంప్ పట్టుబడుతున్న విషయం తెలిసిందే. ఇందుకు డెమోక్రాట్లు అంగీకరించడం లేదు. ఇది ప్రభుత్వ షట్డౌన్కు దారితీయడంతో దాదాపు 8 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు జీతాల్లేక అవస్థలు పడుతున్నారు. గురువారం కుదిరిన ఒప్పందం ప్రకారం ఫిబ్రవరి 15 వరకు ప్రభుత్వానికి నిధులు అందుతాయి. ఈ సమయంలో వలస విధానంపై విస్తృత ఒప్పందంపై చట్టసభ సభ్యులు చర్చించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్లానుకు ప్రతినిధుల సభ, సెనేట్ ఆమోదం తెలుపగా, అనంతరం ట్రంప్ కూడా దీనిపై సంతకం చేశారని శ్వేతసౌధం వెల్లడించింది.



'హెచ్1బీ'లో అమెరికా డిగ్రీలకు ప్రాధాన్యత

వాషింగ్టన్: నైపుణ్యమున్న విదేశీ ఉద్యోగులకు అమెరికా జారీచేస్తున్న హెచ్1బీ వీసా నిబంధనల్లో ట్రంప్ ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. అమెరికాలో మాస్టర్ డిగ్రీలు చదివిన విదేశీ విద్యార్థులకే ఇకపై హెచ్1బీ వీసాల జారీలో ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. భారత్, చైనా వంటి దేశాల్లో ఉన్నత విద్య అభ్యసించి ఉద్యోగం కోసం అమెరికాకు వెళ్లాలనుకునే ఐటీ నిపుణులపై ఈ నిర్ణయం ప్రతికూల ప్రభావం చూపనుంది. యూఎస్సీఐఎస్ నిబంధనల ప్రకారం ఇప్పటివరకు ఏటా 65 వేల హెచ్1బీ దరఖాస్తులను జారీచేస్తున్నారు.

అమెరికాలో ఉన్నతవిద్య అభ్యసించే విదేశీయుల కోసం మరో 20 వేల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. అయితే, హెచ్1బీ వీసా ప్రక్రియలో మార్పులతో 65 వేల వీసాల్లో కూడా అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించిన విదేశీ విద్యార్థులకే ప్రాధాన్యం ఇస్తారు. ఈ కొత్త నిర్ణయం 2019, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందని, అప్పటి నుంచే దరఖాస్తులను స్వీకరిస్తామని యూఎస్సీఐఎస్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ సిస్నా తెలిపారు. దీనివల్ల ఏటా అమెరికాలో మాస్టర్స్ చేసిన 5,340 మంది విదేశీయులు అదనంగా లబ్ధి పొందుతారని వ్యాఖ్యానించారు.


అమెరికా అధ్యక్ష బరిలో హిందూ మహిళ..

తులసీ గబ్బార్డ్‌పై మతంరంగు పులిమే యత్నం

వాషింగ్టన్: వచ్చే అమెరికా ఎన్నికల్లో అధ్యక్ష బరిలో నిలవాలని అనుకుంటున్న హవాయి డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధి తులసీ గబ్బార్డ్కు చేదు అనుభవం ఎదురవుతోంది. మతం రంగు పులిమే ప్రయత్నాలు జరుగుతున్నాయట. తాను హిందూ జాతీయురాలిని అయినందుకు విమర్శలు వస్తున్నాయని ఆమె వాపోయారు. అంతేకాదు, భారత ప్రధాని నరేంద్ర మోడీని కలుసుకోవడాన్ని కూడా తప్పుబడుతున్నారని తులసి వాపోతున్నారు. తనకు, తన మద్దతుదారులకు మతం రంగు పులిమి తమ పైన హిందూ జాతీయవాదులన్న ముద్ర వేస్తున్నారని తులసీ గబ్బార్డ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అమెరికా కాంగ్రెస్కు ఎన్నికైన తొలి హిందూ మహిళగా పేరొందిన తులసీ గబ్బార్డ్ 2020లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తానని తెలిపారు. తాను భారత ప్రధాని నరేంద్ర మోడీని కలుసుకున్న విషయాన్ని భూతద్దంలో చూపి తనపై మతం ముద్ర వేస్తున్నారన్నారు.

అమెరికా అధ్యక్ష బరిలో హిందూ మహిళ: ట్రంప్పై పోటీకి తులసీ గబ్బార్డ్ సిద్ధం అమెరికా చట్టసభలకు ఎన్నికైన తొలి హిందువును తాను అయినందుకు గర్విస్తున్నానని తులసీ గబ్బార్డ్ తెలిపారు. అలాగే అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో నిలుస్తున్న తొలి హిందువును అయినందుకు కూడా గర్వంగా ఉందని చెప్పారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, మాజీ మంత్రి హిల్లరీ క్లింటన్, ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కూడా మోడీని కలుసుకున్నారని ఆమె గుర్తు చేస్తున్నారు. మరోవైపు అమెరికా అధ్యక్ష బరిలో నిలిచేందుకు పోటీపడుతున్న మరో భారత సంతతి మహిళ, సెనేటర్ కమలాహారిస్ ఆదివారం ప్రచారాన్ని ప్రారంభిస్తూ ట్రంప్ విధానాలపై విమర్శలు గుప్పించారు.



'ప్రొవోక్' మ్యాగజైన్ పై అల్లు శిరీష్

టాప్ లైఫ్ స్టైల్ మ్యాగజైన్ గా అంతర్జాతీయ గుర్తింపు సంపాదించుకున్న మ్యాగజైన్ ప్రొవోక్. ఫిబ్రవరి నెలకు గాను మ్యాగజైన్ కవర్ ఫోటోగా టాలీవుడ్ హీరో అల్లు శిరీష్ ది వేయడం విశేషం. దీనికోసం ప్రత్యేకంగా ఫోటోషూట్ చేశారు. స్టైలిష్ లుక్స్‌తో అల్లు శిరీష్ కొత్తగా కనిపించాడు. ఇంటర్నే షనల్ స్టాండర్డ్ ఫోటోషూట్ చేశారు. గుర్తింపు పొందిన లైఫ్ స్టైల్ మ్యాగజైన్ కావడం, అల్లు శిరీష్ ఫాలోయింగ్ ను దృష్టిలో ఉంచుకొని ఈ ఫోటోషూట్ ని విభిన్నంగా అల్ట్రామోడ్రన్ కాన్సెప్ట్ తో ప్లాన్ చేశారు. ఇగ్నైట్, ఇన్నోవేట్, ఇన్ స్ప్రైర్ ట్యాగ్ లైన్స్‌గా నడుస్తున్న ఈ మ్యాగజైన్ కోసం అల్లు శిరీష్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఓ టాలీవుడ్ స్టార్‌కి దక్కిన గౌరవంగా ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అల్లు శిరీష్ సైతం ప్రొవోక్ లైఫ్ స్టైల్ మ్యాగజైన్‌పై కవర్ ఫొటో రావడంతో తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. కవర్ ఫోటో కోసం తనను ఎంపిక చేసుకోవడం ప్రత్యేకమైన గౌరవంగా భావిస్తున్నట్టు చెప్పారు.

అల్లు శిరీష్ తాజాగా నటిస్తున్న చిత్రం ఎబిసిడీ. ఇటీవలే విడుదల చేసిన ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటికే హిందీ శాటిలైట్ డిజిటల్ రైట్స్ ఫ్యాన్సీ రేట్ కు అమ్ముడైన విషయం తెలిసిందే. సీనియర్ నిర్మాత డి.సురేష్ బాబు ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరిస్తుండడం విశేషం. ప్రతిష్టాత్మక సురేష్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.



నాని ఇన్ని గెటప్‌లా..?

స్పోర్ట్స్ డ్రామాలో 'జెర్సీ' అనే చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రం న్యాచరల్ స్టార్ నాని నటిస్తున్న సంగతి తెలిసిందే గౌతమ్ తిన్న నూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం పూర్తవగానే విక్రమ్ కుమార్ దర్శకత్వంలో ఒక సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జోరుగా సాగుతోంది. ఈ సినిమాలో నాని పాత్ర ప్రేక్షకులను మెస్మరైజ్ చేసేవిధంగా ఉండబోతోందని టాక్ వినిపిస్తోంది.

ఈ సినిమాలో నాని పాత్ర నాలుగు షేడ్స్‌లో ఉంటుందని సమాచారం. ఒక వ్యక్తి జీవితంలోని నాలుగు ముఖ్య దశలను ప్రతిబింబించే పాత్రలో 19 ఏళ్ళ టీనేజర్ గా.. 25 సంవత్సరాల యువకుడిగా.. 40లలో ఉండే మధ్య వయస్కుడిగా.. 50 ఏళ్ళ పై బడిన వ్యక్తిగా నాలుగు గెటప్స్ ఉంటాయట.

ఈ సినిమా హాలీవుడ్ చిత్రం 'ది క్యూరియాస్ కేస్ అఫ్ బెంజమిన్ బటన్' స్టైల్‌లో సాగుతుందని అంటున్నారు. ఇలా నాలుగు పూర్తిగా డిఫరెంట్‌గా ఉండే గెటప్స్‌లో ఉండడం.. దానికి తగ్గట్టు నటించడం ఛాలెంజ్ తో కూడుకున్న అంశమే. నిజానికి ఈ ఛాలెంజింగ్ పార్ట్ నచ్చడంతోనే విక్రమ్ కుమార్‌కు నాని గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. చాలా రోజుల తర్వాత ఒక దర్శకుడు నాని యాక్టింగ్ టాలెంట్ ను ఫుల్ గా బయటకు తీసే పాత్రను డిజైన్ చేశాడన్నమాట.



ఆయనలా ప్రవర్తించడం
ఎవరికీ సాధ్యం కాదు – మమ్ముట్టి

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జీవిత చరిత్రలో ఆయన చేపట్టిన పాదయాత్ర ఎంతో ప్రాముఖ్యతను సంపాదించుకుంది. ఆ పాదయాత్రలోని కీలక ఘట్టాలను ఆధారంగా చేసుకుని రూపొందించిన సినిమా 'యాత్ర'. మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పాత్రలో నటించారు. 70 ఎం.ఎం.ఎంటర్టైన్మెంట్స్ బ్యాన్ప మహి.వి.రాఘవ్ దర్శకత్వంలో విజయ్ చిల్లా, శశిదేవి రెడ్డి నిర్మించిన 'యాత్ర' చిత్రం ఫిబ్రవరి 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఇంటర్వ్యూ...

తెలుగులో చాలా గ్యాప్ తీసుకున్నారు..

చాలా కాలం తర్వాత నేను చేసిన తెలుగు సినిమా 'యాత్ర'. ఈ సినిమా గురించి వినగానే నాకు సరిపోయే పాత్ర అనిపించింది. 'స్వాతి కిరణం'లో ఎలా ఉన్నానో ఇప్పుడు అలాగే ఉన్నానని అంటున్నారు. అందుకు కారణం ఏంటో నాకు తెలియదు. అయితే నేను ఎప్పుడు మంచి గురించే ఆలోచిస్తాను.

కొత్త దర్శకుడితో చేశారు..

నా కెరీర్లో నేను 70కిపైగా డెబ్యూ డైరెక్టర్స్‌తో పనిచేశాను. అలా చూస్తే మహి వి.రాఘవ్ డెబ్యూ డైరెక్టర్ కాదుగా. ఈ 70 మంది దర్శకుల్లో ఎక్కువ మంది ఇంకా దర్శకులుగా కొనసాగుతున్నారు. ఇద్దరు తమిళంలో కూడా దర్శకులుగా వర్క్ చేస్తున్నారు. ఇప్పుడు అందరూ పెద్ద దర్శకులుగా మారారు. కొత్త దర్శకులు ఓ విషయాన్ని కొత్తగా చెప్పడానికి ప్రయత్నిస్తారని బాగా నమ్ముతాను.

రాజకీయ నాయకుడిగా చేశారు..

మహి పూర్తి స్క్రిప్ట్‌తో పాటు నాపై నమ్మకంతో వచ్చారు. మంచి నిర్మాతలు ఉన్నారు. ఓ లెజెండ్రీ క్యారెక్టర్ చేయాలి. నా వంతుగా నేను ఏమైనా చేయవచ్చుననే భావన రావడంతో సినిమా చేయడానికి అంగీకరించాను. సాధారణంగా రెండు గంటల్లో ఓ మనిషి జీవిత చరిత్రను చెప్పలేమని నా భావన. నేను చదివిన స్క్రిప్ట్‌లు నిజ ఘటనలు ఉండొచ్చు.. ఉండకపోవచ్చు. అయితే వైఎస్సార్‌గారి జీవితంలో కొన్ని ఘటనలను ఆధారంగా చేసుకుని తెరకెక్కించిన బయోపిక్ ఇది. ఇది ఆయన ఫుల్ బయోపిక్ కాదు. ఆయన పాదయాత్ర ప్రధానంగా సాగే కథ. అలాగే యాత్ర అంటే పాదయాత్ర మాత్రమే కాదు.. వ్యక్తులను కలుసుకోవడం.. వారి బాధలను తెలుసుకోవడం, ఎమోషన్స్‌ను పంచుకోవడం. దాని ఆధారంగానే స్క్రిప్ట్‌ను మహి తయారు చేశాడు. రెండు గంటల పాటు పాదయాత్రను ఆధారంగా చేసుకుని సినిమా చేయడం అంటే కుదరదు. పాదయాత్ర చేసే క్రమంలో వివిధ రకాల వ్యక్తులను కలుసుకున్నారు. వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు.

వైఎస్ఆర్‌లా నటించారా..

నేను సినిమాలో నటించేటప్పుడు వై.ఎస్.ఆర్‌గారిని ఇమిటేట్ చేయాలనుకోలేదు. ఆయనలా మాట్లాడి, నడిచి, ప్రవర్తించడం అనేది సాధ్యం కాదు. ఆయనలా ఉండే పాత్రను ఆధారంగా చేసుకుని సినిమా చేస్తే అది మంచిది కాదు..సక్సెస్ కాదు. ఆయన క్యారెక్టర్లోని సోల్‌ను ఆధారంగా చేసుకుని సినిమా చేశాం.

పాత్ర కోసం రీసెర్చ్ చేశారా..

సినిమా కోసం నేను ఎలాంటి రీసెర్చ్ చేయలేదు. మహి స్క్రిప్ట్ ఇచ్చాడు. దాన్ని చదివి ఫాలో అయ్యానంతే. ప్రజలు వేరే భాషల్ని మాట్లాడొచ్చు. అందరూ ఒకటే. అంతే తప్ప పేదరికానికి రంగు ఉంటుందా? ఉండదు కదా..

ఇంతకు ముందు బయోపిక్‌లో చేశారా..

ఇప్పటి వరకు నేను అంబేద్కర్, బషీర్ అనే వారి బయోపిక్స్‌లో మాత్రమే నటించాను. మరే బయోపిక్స్‌లో నటించలేదు. నాతో పనిచేసిన నటీనటులు, సాంకేతిక నిపుణుల కారణంగా సినిమాను పూర్తి చేశాను.

రాజకీయాల్లోకి వెళ్లాలనుకుంటున్నారా..

నేను 38 ఏళ్లుగా సినిమా రంగంలో ఉన్నాను. ఇప్పుడు రాజకీయాల్లోకి ఎందుకు? వెళ్లాలి. ఇవే నా రాజకీయాలు.

డబ్బింగ్ చెప్పే సందర్భంలో ఇబ్బందులు..

తెలుగు, మలయాళంలో చాలా పదాలు ఒకేలా ఉంటాయి. కొన్ని చోట్ల కొన్ని



పదాలను ఒత్తి పలకాల్సి ఉంటాయి. వాటి విషయంలో కాస్త జాగ్రత్తలు తీసుకుంటూ డబ్బింగ్ చెప్పాను.

చాలా కాలం తర్వాత తెలుగులో నటించారు కదా.. ఈ గ్యాప్‌లో తెలుగు సినిమాల్లో ఎలాంటి మార్పులు కనపడుతున్నాయి..

ప్రతి ఆర్టిస్టుల పాత్రల ఎంపికలో సెలక్టివ్‌గానే ఉంటున్నారు. నేను ఒకప్పుడు కె.విశ్వానాథ్‌గారి సినిమాలో నటించాను. ఓ రకంగా చెప్పాలంటే అందులో గ్రే షేడ్ ఉన్న పాత్రలో నటించాను. తర్వాత కోడి రామకృష్ణగారి దర్శకత్వంలో రైల్వే కూలి సినిమా చేయాల్సింది. కానీ కుదరలేదు. ఇప్పుడు చేశాను. అయితే ఏదీ ప్లాన్ చేయలేదు. ఈ మధ్యలో ప్రతి సినిమా పరిశ్రమలో చాలా మార్పులే వచ్చాయి. తెలుగు సినిమా గురించి చెప్పాలంటే వైవిధ్యమైన సినిమాలకు ఆదరణ లభిస్తుంది. మంచి పరిణామమే.

ఇటీవల తెలుగులో ఏ సినిమాలను చూశారు..

'రంగస్థలం', 'భరత్ అనే నేను' సినిమాలు చూశాను.

ఇతర దర్శకులు మిమ్మల్ని అప్రోచ్ అయ్యారా..

లేదు. మంచి కథ, దర్శకుడు వస్తే తప్పకుండా సినిమా చేస్తాను.

మీరు చేయాల్సిన డ్రీమ్ రోల్ ఏదైనా ఉందా..

నేను చేసేవన్నీ నా డ్రీమ్ రోల్స్.

వై.ఎస్.జగన్‌ని కలిశారా..

లేదు.. కలవలేదు.

జూ. ఐష్ ఏం చేస్తోంది?

జూ.ఐశ్వర్యారాయ్‌గా స్నేహా ఉల్లాల్ తెలుగు వారికి సుపరిచితం. కరెంట్, నేను మీకు తెలుసా? సింహా వంటి చిత్రాల్లో నటించిన ఉల్లాల్ ఆ తర్వాత తెలుగులో కనిపించలేదు. సల్మాన్ అండదండలతో బాలీవుడ్ లో అవకాశాలు అందుకున్నా అటుపై ఎందుకనో క్లిక్కవ్వలేదు.

ఆ క్రమంలోనే ఉల్లాల్ విదేశాల్లో ఒంటరి దీవుల్లో షికార్లు చేయడంపై ఆసక్తికర వార్తలు వినిపించాయి. ఉల్లాల్ తాను ప్రేమించిన యువకుడిని పెళ్లాడ నుందని ఆ వివరాలు తెలపనుందని చెప్పుకున్నా రంతా. ఆ శుభవార్త కోసమే అభిమానులు వెయిటింగ్.



ఇంజనీరింగ్ విద్యార్థులకి అంకితం

వెండితెర పై సరికొత్త ప్రేమ కథాచిత్రం '4 లెటర్స్' త్వరలో విడుదలకు ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత ఉదయ్ కుమార్, దర్శకుడు రఘురాజ్ సంయుక్తంగా ఈ రోజు ఉదయం పాత్రికేయులతో చిత్ర విశేషాలను పంచుకున్నారు. వాటి వివరాల్లోకి వెళితే...

4 లెటర్స్ మూవీ ఇంజినీరింగ్ స్టూడెంట్స్‌ని దృష్టిలో పెట్టుకుని తీసిన సినిమా ఇది..ఈ సినిమా ఇంజినీరింగ్ స్టూడెంట్స్‌కి అంకితం ఇస్తున్నాము. అసలు ఈ స్టోరీ ఎలా పుట్టిందో చెపుతాను ఒక కుర్రాడు సార్ నేనొక B.tech స్టూడెంట్‌ని మా అందరికి జాబ్స్ దొరక్క పదివేల రూపాయలకు చిన్న చిన్న జాబ్స్ చేస్తున్నారు..ఇంజినీరింగ్ అంటే వాల్యు లేదని చెప్పగానే, నేను ఆశ్చర్యపోయి కొన్నిరోజులు అతనితో ట్రావెల్ చేసి ఇంజినీరింగ్ చేసిన వారి కష్టాలు తెలుసుకున్నాను, అలా ఈ స్టోరీ పుట్టింది.. ఇంజినీరింగ్ స్టూడెంట్స్ కి మా సినిమాలో ఒక మెసేజ్ కూడా ఉంటుంది.

లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అని చెపుతూ ఉంటారు, కానీ అవన్నీ బ్రేకప్ అవుతున్నాయి.. లవ్ ఎట్ సెకండ్ లుక్ అనే కొత్త కాన్సెప్ట్ తో మీ ముందుకు వస్తున్నాము..మీ అందరికి నచ్చుతుంది.. మా 4 లెటర్స్ ఒక్క యూత్‌కే కాదు పెద్దవాళ్ళకి కూడా తప్పకుండా నచ్చుతుంది. వంద సంవత్సరాల సినిమా చరిత్రలో ఎవరు చేయని సాహసం మేము మా సినిమాలో చేశాం, అది మీరు దీయేటర్‌లో చూసినప్పుడు మీకు అర్ధమవుతుంది. ఈ సినిమాలో హీరో ఫాదర్‌కి POOR అనే ఫోర్ లెటర్స్ నచ్చవు..మరోవైపు హీరోయిన్ మదర్ కి RICH అనే ఫోర్ లెటర్స్ నచ్చవు..హీరోయిన్ LOVE అనే ఫోర్ లెటర్స్‌తో సతమతమవుతుంది.. హీరోయిన్ ఫాదర్ జీవితం లో FAIL అనే ఫోర్ లెటర్స్ తప్ప ఏం అనుభవిం చడు.. హీరో ఫ్రెండ్స్ PASS అనే ఫోర్ లెటర్స్ గురించి ఆలోచించరు.. యూత్‌కి నచ్చే ఫోర్ లెటర్స్ కూడా ఈ చిత్రంలో ఉన్నాయి.. మేము ఈ చిత్రాన్ని రిచ్ లోకేషన్స్‌లో చిత్రికరిం చాం.. థాయిలాండ్ లోని ప్రత్యేకమైన ప్రదేశాల్లో పాటలు షూట్ చేశాం.. ప్రీ ప్రొడక్షన్, షూటింగ్, పోస్ట్‌ప్రొడక్షన్‌తో కలిపి మొత్తం 75 రోజుల్లో ఫస్ట్ కాపీ రెడీ చేశాం.



మోహన్ మీడియా క్రియేషన్స్‌లో
లవ్ 20–20

మోహన్ మీడియా క్రియేషన్స్ లో మోహన్ వడ్లపట్ల, మహేందర్ వడ్లపట్ల మరియు జో శర్మ, మెక్విన్ గ్రూప్ యుఎస్ఎ సహకారంతో వడ్లపట్ల సినిమాస్ సమర్పిస్తున్న కొత్త చిత్రం లవ్ 2020. ఈ చిత్రం ద్వారా అరవింద్, మోహిని (Miss Teen Canada 2012) హీరోహీరోయిన్స్ గా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. ఈచిత్రం బెంగుళూర్, నాగర్హోలే నేషనల్ పార్క్, కూర్గ్, కుషాల్ నగర్, ఊటీ, ఇడుక్కి (కేరళ) మరియు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుని... ఫిబ్రవరి 1 నుండి 6 వ తేదీ వరకు నవి ముంబై లోని ముఖ్యప్రాంతాల్లో ప్యాచ్ వర్క్ తో పాటుగా ఫైనల్ సాంగ్ మరియు షూటింగ్ కూడా పూర్తిచేసుకోనుంది. ఈ చిత్రం సెంథిల్ కుమార్ దర్శకత్వంలో కొత్త కథాంశంతో తెరకెక్కుతుంది. ఈ చిత్రానికి ప్రత్యేకంగా యూత్ కి కనెక్ట్ అయ్యే విధంగా లవ్ 2020 అనే టైటిల్ ఖరారు చేశారు. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల అనంతరం ఈ చిత్రాన్ని ఏప్రిల్ లో విడుదల చెయ్యడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

వెంకటలక్ష్మి సిత్రాలు



రత్తాలుగా బోలెడన్ని సిత్రాలు చేసిన రాయ్ లక్ష్మీ ఈసారి వెంకటలక్ష్మిగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'వేర్ ఈజ్ వెంకటలక్ష్మి'. రామ్ కార్తిక్ , పూజిత పొన్నాడ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి కిషోర్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు.. హర్రర్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ పూర్తి చేస్తుంది.. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి.. ఇటీవలే పాపా నీకేదంటే ఇష్టం పాట రిలీజైంది. ఈ పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. మాస్ హంగులు జోడించి ఈ పాటను చిత్రీకరించారు. ఇప్పటికే రిలీజ్ అయిన ఫస్ట్ లుక్ కి మంచి స్ప ందన వచ్చింది. త్వరలో టీజర్ రిలీజ్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు నిర్మాతలు. ఈ చిత్రంలో నటిస్తున్న హాస్యనటులు ప్రవీణ్, మధునందన్ ల కామెడీ హైలైట్‌గా నిలవనుంది. హరి గౌర ఈ చిత్రానికి సంగీతం అందించగా, వెంకట్ ఆర్.శాఖమూరి సినిమాటోగ్రఫీని అందించారు. ఏబీటీ క్రియేషన్స్ పతాకంపై గురునాథ్ రెడ్డి సమర్పిస్తున్న ఈ సినిమా కి ఎం.శ్రీధర్ రెడ్డి, హెచ్.ఆనంద్ రెడ్డి, ఆర్కే రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. మార్చి లో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాయ్ లక్ష్మీ, ప్రవీణ్, మధు నందన్, రామ్ కార్తిక్, పూజిత పొన్నాడ, బ్రహ్మాజీ, పంకజ్ కేసరి, అన్నపూర్ణమ్మ, జబర్దస్త్ మహేష్, జెమినీ సురేష్ తారాగణంగా నటించారు.



కొత్తగా మా ప్రయాణం

నూతన కథానాయకుడు ప్రియాంత్ హీరోగా యామిని భాస్కర్ హీరోయిన్‌గా ఈ వర్షం సాక్షిగా ఫేమ్ రమణ మొగిలి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం కొత్తగా మా ప్రయాణం. ఈ సినిమాతో ప్రేక్షకులను అలరించి విజయం సాధించిన సందర్భంగా పాత్రికేయుల సమావేశంలో... హీరో ప్రియాంత్ మాట్లాడుతూ... చాలా ఆనందంగా ఉందిక. మా చిత్రం జనవరి 25న విడుదలైంది. థియేటర్లు పెద్దగా దొరకలేదు. అందు వల్ల కేవలం 55 థియేటర్లలో మాత్రమే రిలీజ్ చెయ్యగలిగాము. అయినా రెండవ వారం కూడా ఇంత సక్సెస్‌గా నడుస్తుందంటే చాలా ఆనందంగా ఉంది. ఈ రోజు నుంచి మరికొన్ని థియేటర్లు పెంచుతున్నాం. ప్రేక్షకులకు ఈ చిత్రం చాలా బాగా నచ్చింది. కథ కథణం బాగా వచ్చాయి. ఇంకా ఈ చిత్రం చాలా మందికి రీచ్ కావాలని కోరుకుంటున్నాను. అందరూ ఈ చిత్రాన్ని థియేటర్స్కి వెళ్ళి చూసి మమ్మల్ని బ్లెస్ చెయ్యాలని కోరుకుంటున్నాను మీ అందరికీ నా కృతజ్ఞతలు అన్నారు.

గోవా వెళ్తున్న నలుగురు అమ్మాయిల కథ!



బ్లాక్ అండ్ వైట్ పిక్చర్స్ పతాకంపై బాలు దర్శకత్వంలో ప్రొడక్షన్ నెంబర్ 1గా హిమబిందు వెలగపూడి ఓ చిత్రం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. త్రిధా చౌదరి, ధన్య బాల కృష్ణ, సిద్ధీ ఇద్నాని, కోమలి ప్రసాద్ ప్రధాన తారాగణంగా నటిస్తున్న ఈ సినిమా తొలి షెడ్యూల్ ఇటీవల పూర్తయింది. ఫిబ్రవరి రెండో వారంలో కీలక సన్నివేశాలు, పాటల, పోరాట దృశ్యాల చిత్రీకరణకు చిత్రబృందం గోవా వెళ్లనుంది. ఈ సందర్భంగా దర్శకుడు బాలు మాట్లాడుతూ... 'మహానగరంలో నివసించే నలుగురు అమ్మాయిల కథే ఈ సినిమా. స్వతంత్ర్య భావాలున్న నలుగురి జీవితాల్లో ఏం జరిగిందనేది ఆసక్తికరం. జనవరిలో హైదరాబాద్ లో తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి చేశాం. ఈ నెల రెండో వారంలో గోవాలో మొదలు కానున్న సెకండ్ షెడ్యూల్ లో రెండు పాటలు, కీలక సన్నివేశాలు, యాక్షన్ సీక్వెన్స్ లను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నాం. నెలాఖరుకు గోవా షెడ్యూల్ పూర్తవుతుంది.

సులభమైన స్టెమ్ స్టిచ్..

ఎంబ్రాయిడరీలో తేలికైన కుట్టు ఈ స్టెమ్ స్టిచ్. దీనినే కాడకుట్టు అని కూడా అంటారు. దీన్ని ఎక్కువగా డిజైన్ అవుట్‌లైన్‌కు వాడుతారు. అయితే పువ్వులు, లతల వంటి డి.జైన్లతో కొమ్మలు రెమ్మలు కుట్టడానికి కూడా దీన్ని బాగా ఉపయోగిస్తారు. ఈ కాడకుట్టు ఎక్కువ మన్నిక కలిగింది. అందుకే కొన్ని సందర్భాలలో బాక్‌స్టిచ్‌కి బదులుగా స్టెమ్‌స్టిచ్ చేస్తారు. కాడ కుట్టును రెండు విభాలుగా కుట్టొచ్చు. వీటిల్లో మొదటిది సరళరేఖలా కనబడితే రెండోది మధ్యలో ముడులు ముడులుగా కనబడుతుంది.



అమిత ప్రేమ అనర్థమా...



ప్రేమ అనేది ప్రకృతి పరంగా కలిగేది. ప్రేమ వర్ణనాతీతం. కానీ ప్రేమలో చిన్న పెద్ద కంటే కూడా కాస్త ఎక్కువ తక్కువ అనే భావాలు మాత్రం ఉంటాయి. అవే ఒకరి ప్రేమ మామూలుగా ఉంటే మరొకరిది అమిత ప్రేమ. ఆ అమిత ప్రేమ తెచ్చే కష్టాలే ఇవి. అమితంగా ప్రేమించే వారు నియమ నిబంధనలను ఎక్కువగా ఏర్పరుస్తారు. మరి మీ బాయ్‌ఫ్రెండ్ ఓవర్ ప్రొటెక్టివ్ అవునా.. కాదా.. ఓసారి చూసేద్దామా...

భార్యాభర్తలన్నాక ఒకరిపై ఒకరికి నమ్మకం ప్రేమ ఉండడం సహజం. కానీ అందులో అమిత ప్రేమను ఏర్పరుచుకున్న వాళ్లు ఉన్నవాటి కంటే ఎక్కువ నిబంధనలను, ప్రేమను వ్యక్తం చేస్తుంటారు. మీకు సంబంధించిన విషయాలను తెలుసుకునేందుకు తాపత్రయపడతాడు. అయితే వాటిని తప్పుగా అనుకోవడం కంటే కూడా మీపై అతను పెంచుకున్న ప్రేమ అనుకోవడమే కరెక్ట్ కావచ్చు. ఎందుకంటే వారికి మీపై ఉండే ప్రేమ వ్యక్తం చేయలేనిది. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరీక్షిస్తుంటారు. ఎలాంటి విషయంలోనైనా తన ప్రమేయం ఉండాలనుకుంటారు. తనకు తెలియకుండా భార్య ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదని వారి అభిప్రాయం.

ఆర్డర్ వేస్తారు..

తన మాటే భార్య వినాలని కోరుకుంటాడు. తను మాట్లాడేటప్పుడు భార్య అస్సలు మాట్లాడకూడదు. తన మాటలు పూర్తి అయ్యే దాకా మధ్యలో ఎదురు మాట్లాడకూడదు. రోజుని కూడా తనే ప్లాన్ చేసి చెప్తే దాన్ని కేవలం మీరు ఫాలో అయితే సరిపోద్ది. మామూలుగా చెప్పినపుడు వింటే సరే, కాదని వినకపోతే తను కోపాన్ని మీపై ప్రదర్శించి, మిమ్మల్ని డామినేట్ చేయడానికి ప్రయత్నిస్తాడు.

రహస్యాన్ని పాటిస్తాడు..

కాల్ లిస్ట్ తప్పకుండా చూసేందుకు ప్రయత్నిస్తారు. ప్రతి ఫోన్ కాల్‌ని రహస్యంగా కూడా వింటారు. అనుమానం కాకపోవచ్చు కానీ, అతి ప్రేమ కాబట్టి ఎవరు, ఎందుకు అనే విషయాలను బాగా అబ్జర్వ్ చేస్తారు. మెసేజెస్, సోషల్ మీడియా అకౌంట్స్‌ను పరిశీలిస్తారు. ఎవరెవరితో మాట్లాడుతున్నారో తెలుసుకుంటారు.

డ్రస్ సెలక్షన్..

డ్రస్ సెలక్షన్‌ని బట్టి మీ బాయ్ ఫ్రెండ్ ఓవర్ ప్రొటెక్టివ్ అనేది క్లియర్‌గా తెలుస్తుంది. ఎలాంటి ఫంక్షన్లకు, ఏయే సందర్భాలకు ఎలాంటి దుస్తులను వేసుకోవాలో కూడా నిర్ణయిస్తాడు. దీంతో ఇద్దరి మధ్య ఉండే ప్రేమ కాస్త దూరం అవుతుంది. స్వాంత ఇష్టాలను ఇక అనుమతి ఉండదు.

ఈర్ష్య ఎక్కువ..

ఈ తరహాలో వారికి ఈర్ష్య ఎక్కువే ఉంటుంది. తనెంతగా మిమ్మల్ని ప్రేమిస్తున్నాడో రకరకాలుగా తెలియచేస్తాడు. వారి ప్రేమతో పార్ట్‌నర్ ప్రేమని కంపార్ చేస్తారు. వారిని ట్రీట్ చేసే విధానాన్ని చెప్పి బాధపడేలా చేస్తారు. అనుకున్నంత ప్రేమను అందించకపోయినా ప్రాబ్లమే వీరితో..



ప్రేమని నమ్మేలా చేస్తాడు..

ప్రేమిస్తున్నానని, ప్రేమ నిజమని చెప్తాడు. కానీ అదంతా ప్రేమతో కాకుండా రాంగ్ వేలో చెప్తాడు. ప్రేమను ఓవర్ ప్రొటెక్టివ్ నేచర్ ద్వారా తెలియచేస్తాడు. వాళ్ల ఓవర్ రియాక్షన్‌ని తప్పు పట్టినా అదంతా ప్రేమేనన్న దృష్టికి తీసుకొస్తాడు. అలాంటి ప్రేమ ఎదుటి వాళ్లని ఇబ్బంది పెడుతుందని అర్థం చేసుకోరు.

దూకుడుతనంగా..

భార్య లేదా ప్రేమికురాలు ఏం చెప్పినా తను మాత్రం దూకుడుగానే ప్రవర్తిస్తాడు. ఆ తొందరపాటుతనం హాబీగా మారిపోతుంది. మీరేం చెప్పినా, మృదువుగా మాట్లాడినా, తన నుంచి వచ్చే రెస్పాన్స్ అగ్రెసివ్‌గానే వస్తుంది.

పొగడ్త పడదు..

తన ప్రేమికురాలు ఇతరులను అతిగా పొగిడితే అస్సలు తట్టుకోలేరు. పొగిడిన వారిపై విపరీత ద్వేషాన్ని పెంచుకుంటారు.



నేనే కరెక్ట్ అనే ఫీల్..

ఓవర్ ప్రొటెక్టివ్ బాయ్ ఫ్రెండ్ ముఖ్య లక్షణం నేనే కరెక్ట్ అనే సిద్ధాంతం. తను మాత్రమే ఎప్పుడూ రైట్ అనే రాంగ్ ఫీలింగ్‌లో ఉంటారు. ఎదురు చెప్పిన వాళ్లనే తప్పు అనే స్థాయి వారిది. ఇలాంటి విషయాలను నిరూపించడానికి ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధపడుతాడు. ప్రూవ్ చేసుకోవడమే అతని లక్ష్యం.

తన చుట్టూనే రివాల్వ్..

అమ్మాయి జీవితం అంతా ఎంతసేపు తన చుట్టూనే రివాల్వ్ అవ్వాలనుకుంటాడు. అతని అవసరాల మేర పార్ట్‌నర్ జీవిత లక్ష్యాలను నియమిస్తాడు. తనతో మాత్రమే మాట్లాడాలని, ఇతరులతో ప్రేమగా మాట్లాడకూడదని, బిజీ షెడ్యూల్‌ల్లో అయినా తన మాటలకి ఫోన్‌కి రియాక్ట్ అవ్వాలనేది వీరి మనస్తత్వం. ఇలాంటి ఓవర్ ప్రొటెక్టివ్ వారి కాల్స్‌ని అవాయిడ్ చేస్తే ఇంక అంతే సంగతులు.

ప్రతి చిన్నదానికి బ్లేమ్ చేసేరకం..

చేసే ప్రతి పనిలో తప్పులను వెతకడమే వీరి అలవాటు. తప్పు కాదని తెలిసినా ఇలానే ప్రవర్తిస్తుంటాడు. దీంతో పార్ట్‌నర్‌ని ఎప్పుడూ కింది స్థాయిలో ఉంచాలనుకుంటాడు. తెలియని వారెవరైనా కాల్, టెక్స్ట్ చేసినా అందుకు అమ్మాయిలే బ్లేమ్ అయ్యే పరిస్థితి. తెలియని విషయంలోనే ఇలా ఉంటే తెలిసిన వాళ్లతో స్నేహపూర్వకంగా మాట్లాడినా ఇలాగే నిందించేందుకు కూడా ప్రయత్నిస్తాడు.

ఈ లక్షణాలన్నీ ఓవర్ ప్రొటెక్టివ్‌గా నిర్ధారించేవి. ఇలాంటి రిలేషన్ షిప్ గురించి ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవటం అవసరం. లేదంటే మానసిక, శారీరక టార్చర్‌కి గురవ్వాల్సి వస్తుంది.

'చిటికె'లో సాధ్యం..!



- కాటన్ వస్త్రాన్ని పట్టుచీర జరీ అంచులపై ఉంచి ఇస్త్రీ చేయాలి. ఇలా చేస్తే జరీ నల్లబడకుండా, మాడి పోకుండా మెరుస్తుంటుంది.
- కొత్తిమీర రసాన్ని పంచదార నీళ్లలో కలిపి రాత్రి వేళ తాగితే మంచి నిద్ర పడుతుంది.
- ఇంట్లోని అక్వేరియాన్ని శుభ్రం చేసే ప్రతిసారీ ఆ నీటిని, మొక్కలకు పోస్తే ఎదుగుదల బాగుంటుంది.
- గులాబ్‌జామ్‌లు చేసేటపుడు కొన్ని జీడిపప్పులు కూడా వేస్తే మృదువుగా, రుచిగా ఉంటాయి.

మాటే మంత్రం..



ఒకదారి మూసుకుపోయినప్పుడు తప్పకుండా మరో దారి తెరిచి ఉంటుంది. దాన్ని గుర్తించ గలగడమే విజయానికి మార్గం..



మటన్ కోఫ్తా బిర్యాని

సాధారణంగా బిర్యానీ అంటే నాన్ వెజ్ ప్రియులందరికీ ఇష్టమైన డిష్. బిర్యానీలో కూడా వివిధ రకాలుగా తయారు చేస్తారు. చికెన్ బిర్యానీ, ఎగ్ బిర్యానీ, ఫిష్ బిర్యానీ, మటన్ బిర్యానీ. రుచిలో వేటికవే అద్భుత రుచి, ఒక్కో వంటకానికి ఒక్కో ప్రత్యేకత. మటన్ బిర్యానీ చేయాలంటే వివిధ రకాల మసాల దినుసులు అవసరం అవుతాయి.

మటన్ కోఫ్తా బిర్యానీ చాలా సింపుల్ గా రుచికరంగా, మంచి ఫ్లేవర్ తో అతి త్వరగా తయారు చేసుకోవచ్చు. ఇండియన్ మసాలా దినుసులతో తాయరు చేసే మటన్ కోఫ్తా బిర్యాని టేస్ట్, ఫ్లేవర్ కూడా అద్భుతంగా ఉంటుంది. మరి మీరూ మటన్ కోఫ్తా బిర్యానీ రుచి చూడాలంటే ఎలా తయారు చేయాలో తెలుసుకోండి....

కావల్సిన పదార్థాలు:

రైస్ తయారీకి కావల్సినవి: బాస్మతి రైస్ 4 కప్పులు, కరవే సీడ్స్ 1 టీస్పూన్
గరం మసాలా: పెప్పర్ కారన్స్ 7, లవంగాలు కొద్దిగా
యాలకులు 5, షాజీర 1 టీస్పూన్, దాల్చిన చెక్క 1 చిన్న ముక్క, కుంకుమపువ్వు చిటికెడు పాలలో నానబెట్టాలి,
ఉప్పు: రుచికి సరిపడా
కోఫ్తా తయారీకి కావల్సినవి: మటన్ ఖీమా 500గ్రా
ఉల్లిపాయ 1 (పేస్టు), గరం మసాలా పౌడర్ 1 టీస్పూన్
ఉప్పు: రుచికి సరిపడా, గసగసాలు 1 టీస్పూన్, అల్లం పేస్ట్ 1 టేబుల్ స్పూన్, వెల్లుల్లి పేస్ట్ 1 టేబుల్ స్పూన్, ఫ్రెష్ క్రీమ్ 1 టేబుల్ స్పూన్, కారం 1 టీస్పూన్, కొబ్బరి తురుము 1 టీస్పూన్, కొత్తిమీర తరుగు 1 కప్పు, శెనగపిండి(బేసన్) 1 టేబుల్ స్పూన్, నట్ గమ్ పౌడర్ 1 టీ స్పూన్, బ్రెడ్ 1 ముక్క (పాలల్లో నానబెట్టినది)
కర్రీ తయారీకి కావల్సినవి:
నూనె 1 కప్పు, పచ్చిమిర్చి 2 (తరిగినవి), ఉల్లిపాయ 1 (తరిగినవి), టమోటోలు 2 (గుజ్జు), అల్లం పేస్ట్ 1 టేబుల్ స్పూన్, వెల్లుల్లి పేస్ట్ 1 టేబుల్ స్పూన్, జీలకర్ర 1 టీ స్పూన్, పసుపు పావు టీ స్పూన్, పెరుగు 3 టేబుల్ స్పూన్లు, గరం మసాలా 1 టీ స్పూన్, కారం 2 టీ స్పూన్లు, ఉప్పు: రుచికి సరిపడా
క్విరా వాటర్ 1 టేబుల్ స్పూన్, పుదీనా 1 కప్పు (తరిగింది), ఎల్లో ఫుడ్ కలర్ చిటికెడు, నట్ గమ్ పౌడర్ పావు టీస్పూన్, గ్రీన్ కార్డమ్ పౌడర్ పావు టీస్పూన్.

తయారుచేయు విధానం

రైస్ తయారీ: 1. ముందుగా బియ్యంను రెండు మూడు సార్లు శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి.
2. తర్వాత డీప్ బాటమ్ పాన్ లో నీరు మరిగించి పెట్టుకోవాలి
3. నీరు మరుగుతుండగా, అందులో గరం మసాలా జోడించాలి.
4. తర్వాత ముందుగా శుభ్రం చేసి పెట్టుకున్న బియ్యం అందులో వేసి, బియ్యంతో పాటు రుచికి సరిపడా ఉప్పు వేసి మొత్తం మిశ్రమం కలబెట్టి, ఉడికించుకోవాలి.
5. బియ్యం సగం ఉడికిన తర్వాత ఎక్సెస్ వాటర్ ను వంపేసి పక్కన పెట్టుకోవాలి.

కోఫ్తా తయారీ

1. కోఫ్తా కోసం సిద్ధంగా ఉంచుకున్న పదార్థాలను మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి.
2. అన్ని ఒక్కసారిగా పొడి చేసుకోలేకపోతే, రెండు మూడు పదార్థాలు కలిపి గ్రైండ్ చేసుకోవచ్చు.
3. కోఫ్తా కోసం సిద్ధం చేసుకున్న పదార్థాలను గ్రైండ్ చేసుకున్న పదార్థాలన్నింటిని బాగా మిక్స్ చేసి రిఫ్రిజరేటర్ లో 30 నుండి 40 నిముషాల వరకూ ఉంచాలి.
4. 40 నిముషాల తర్వాత బయటకు తీసి పక్కన పెట్టుకోవాలి.
5. చిన్న బౌల్ తీసుకుని అందులో కొద్దిగా నూనె వేయాలి. పాన్ మొత్తం నూనెను చేతులతో అప్లై చేయాలి.
6. ఇప్పుడు ఫ్రిజ్ లో నుండి తీసిన మీట్ మిశ్రమంను చేత్తో చిన్న ఉండలుగా చుట్టుకోవాలి.
7. మీట్ మిశ్రమాన్ని ఉండలుగా చుట్టుకున్నాక తిరిగి రిఫ్రిజరేటర్ లో పెట్టాలి.

కర్రీ తయారీ

1. ఒక పాన్ స్టౌ మీద పెట్టి, వేడి అయ్యాక అందులో జీలకర్ర వేసి ఒక నిముషం వేగించాలి. వేగిన తర్వాత అందులో ఉల్లిపాయలు, అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేసి మొత్తం మిశ్రమాన్ని వేగించుకోవాలి.
2. ఉల్లిపాయలు ట్రాన్సరెంట్ గా వేగిన తర్వాత అందులో టమోటో పేస్ట్, గ్రీన్ చిల్లీ, పసుపు మరియు ఉప్పు వేసి, మొత్తం మిశ్రమాన్ని కలుపుతూ ఫ్రై చేయాలి .
3. అసవరమయితే కొద్దిగా వాటర్ మిక్స్ చేసి సాఫ్ట్ గా కలుపుకోవాలి.
4. ఇప్పుడు మంట తగ్గించి, ఇందులో రిఫ్రిజరేటర్ లో పెట్టుకున్న కోఫ్తాలను వేయాలి.
5. అలాగే చిక్కగా చిలికిన పెరుగు కూడా వేసి మిక్స్ చేసి మూత పెట్టాలి.
6. మొత్తం మిశ్రమం ఉడకడం ప్రారంభించాక, 20 నిముషాలు ఉడికించుకోవాలి.
7. ఇప్పుడు అందులోనే నట్ మగ్ పౌడర్, పుదీనా, కొత్తిమీర ఆకులు తరుగు వేసి కలుపుకోవాలి.

బిర్యానీ

1. డీప్ బాటమ్ పాన్ తీసుకుని అందులో కొద్దిగా నెయ్యి రాసి, రైస్‌ను ఒక లేయర్‌గా సర్దాలి. తర్వాత కోఫ్తా కర్రీని మరో లేయర్ గా సర్దాలి.
2. తిరిగి రైస్ లైయర్, కోఫ్తా లేయర్ రెండు మూడు లేయర్స్ గా సర్దుకోవాలి.
3. ఫైనల్‌గా కెవరా వటర్‌ను, పాలలో నానబెట్టిని కుంకుమ పువ్వు, ఎల్లో ఫుడ్ కలర్ ను చిలకరించుకోవాలి.
4. మంట ఎక్కువగా పెట్టి 10 నిముషాలు తక్కువ మంట మీద వేడి చేసుకోవాలి. తర్వాత ఆవిరి మీద 10 నిముషాలు ఉడికించుకోవాలి.
5. అంతే మటన్ కోఫ్తా బిర్యానీ రిసిపి రెడీ. రైతా లేదా గ్రీన్ సలాడ్ తో ఎంజాయ్ చేయొచ్చు.



గల్లౌటి కబాబ్ చాలా మృదువుగా ఉండి నోటిలో వేసుకుంటే కరిగిపోయేలా ఉంటాయి. గల్లౌటి అంటే నోటిలో కరగటం అని అర్థం. ఇది లక్నోలో చాలా ప్రజాదరణ పొందింది. కబాబ్స్ మామూలు ముక్కలుగా చేసిన మేక మాంసం. అలాగే ఆకుపచ్చ బొప్పాయి నుండి కూడా తయారు చేస్తారు. మూలికలు, మసాలా దినుసులు కలిపిన తరువాత, చిన్న ముక్కలుగా కట్ చేసి నెయ్యిలో వేయిస్తారు.

మటన్ గల్లౌటి



కావలసిన పదార్థములు:

మటన్ కీమా 1 కేజీ, పచ్చి బొప్పాయి పేస్ట్ 4 టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయ పేస్ట్ 3 టేబుల్ స్పూన్లు, అల్లంవెల్లుల్లి పేస్ట్ 2 టేబుల్ స్పూన్లు, ఏలకులు పొడి 1 స్పూన్, పసుపు కారం పొడి 1 స్పూన్, చనా (గ్రామ్) పొడి 2 టేబుల్ స్పూన్లు, గరం మసాలా పొడి 1 స్పూన్, జాపత్రి పొడి 1 స్పూన్, ధనియాల పొడి 1 స్పూన్, ఉప్పు రుచికి సరిపడా, నూనె 3 టేబుల్ స్పూన్లు, నెయ్యి 1 కప్పు.

తయారు చేసే విధానం:

1. మటన్ కీమాను నీటితో శుభ్రంగా కడగాలి. 2. ఆ తర్వాత కీమాను మ్యారినేట్ చేయాలి. 3. పచ్చి బొప్పాయి పేస్ట్, ఉల్లిపాయ పేస్ట్, అల్లం వెల్లుల్లి పేస్ట్, జాపత్రి పొడి, మరియు గరం మసాలా పొడి వేయాలి. 4. ధనియాల పొడి, పసుపు, కారం, చనా పొడి, ఏలకుల పొడి మరియు ఉప్పు వేసి మ్యారినేట్ చేయాలి. 5. ఒక గంట పాటు రిఫ్రిజిరేటర్ లో ఉంచాలి. 6. ఒక గంట తరువాత రిఫ్రిజిరేటర్ నుండి కీమా మిశ్రమాన్ని బయటకు తీయాలి. 7. ఈ మిశ్రమాన్ని మీడియం సైజ్ లో తీసుకోని టిక్కీ లుగా చేసుకోవాలి. 8. పాన్ లో నూనె పోసి వేడి చేయాలి. 9. వేడెక్కిన నూనెలో టిక్కీలను వేసి రెండు వైపుల 1520 నిముషాల పాటు వేగించాలి. 10. కీమా బాగా ఉడికినట్టు నిర్ధారణ చేసుకోవాలి. 11. కబాబ్ రెండు వైపుల గోల్ రంగు రావాలి. 12. కబాబ్స్ పూర్తిగా వేగాక సర్వింగ్ ప్లేట్ లో సర్వ్ చేయండి. 13. లక్నో శైలిలో తయారుచేసిన మటన్ గల్లౌటి కబాబ్ ను పుదీనా చట్నీ మరియు పచ్చి బొప్పాయి చట్నీతో తినండి.

మటన్ డ్రై ఫాల్

మటన్ డ్రైఫాల్ కొంచెం డిఫరెంట్‌గా తయారుచేసే వంట. ఉచిగా ఉండడంతోపాటు, అందరినీ నోరూరిస్తుంటుంది. వివిధ మాంసాహర వంటల్లో డ్రై ఫాల్ రెసిపి కూడా ఒకటి. ఇది రాయల్ కిచెన్ రెసిపి, ఇది నిజామ్‌ల కాలం నాటి అద్భుతమైన రుచికరమైన వంట. డ్రై ఫాల్ రెసిపిని అందరూ ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. ఈ మటన్ డ్రై ఫాల్ రెసిపి వైట్, ఎల్లో కలర్‌లో నోరూరిస్తూ ఉంటుంది. ఇలా తయారవడానికి ఇందులో వేసే మసాలా పేస్ట్ ఇందుకు కారణం.. ఈ మసాలాతో కంటికి అందంగా కనిపిస్తుంది.



కావల్సిన పదార్థాలు:

చికెన్ బ్రెస్ట్ లేదా మటన్ 1కేజీ, బట్టర్ లేదా నెయ్యి లేదా నూనె 300 గ్రా, చికెన్ లేదా మటన్ స్టాక్(ఉడికించిన నీరు) 1 కప్పు, ఉల్లిపాయలు 2 (సన్నగా తరిగి పెట్టుకోవాలి) అల్లం పేస్ట్ 2 టీస్పూన్లు, వెల్లుల్లి పేస్ట్ 2 టీస్పూను, ఉల్లిపాయ పేస్ట్ 2 టీస్పూను, పసుపు 1 టీ స్పూన్, గరం మసాలా పౌడర్ 1 టీస్పూన్, డ్రై రెడ్ చెల్లీస్ 4 జీలకర్రపొడి 1 టీ స్పూన్, పెరుగు 100 ఎం.ఎల్. టమోటోలు 2 (సన్నగా తరిగినవి) నిమ్మ రసం 1 టీస్పూన్, బ్లాక్ పెప్పర్ 2 స్పూన్లు, ఉప్పు రుచికి సరిపడా, కొత్తిమర తరుగు . మ్యారినేషన్ కోసం: మొదట బౌల్ తీసుకుని మటన్ శుభ్రం చేసి పెట్టుకోవాలి. తర్వాత అందులోనే నిమ్మరసం, పెరుగు, అల్లం, వెల్లుల్లి మరియు ఉల్లిపాయ పేస్ట్ వేసి బాగా మిక్స్ చేసి పెట్టుకోవాలి. మొత్తం మిశ్రమం కలినిపిన తర్వాత కనీసం 2 గంటలన్నా మ్యారినేట్ అవ్వాలి.

తయారుచేయు విధానం:

1. పాన్ లో బట్టర్ లేదా నెయ్యి లేదా నూనె వేసి కాగనివ్వాలి. 2. తర్వాత నూనె వేడయ్యాక అందులో జీలకర్ర మరియు డ్రై రెడ్ చిల్లీ వేసి లైట్ గా వేగించుకోవాలి. 3. తర్వాత జీలకర్ర మరియు ఎండుమిర్చి మిక్సీలో వేసి పేస్ట్ చేసుకోవాలి. 4. ఇప్పుడు పాన్ లో మరికొద్దిగా నూనె వేసి కాగిన తర్వాత అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయలు వేసి వేగించుకోవాలి. 5. ఉల్లిపాయలు వేగిన తర్వాత అందులో జీలకర్ర, ఎండుమిర్చి పేస్ట్, అల్లం పేస్ట్, ఉల్లి, వెల్లుల్లి పేస్ట్ వేసి వేగించుకోవాలి. 6. మసాలా పచ్చి వాసన పోయి, నూనె తేలే వరకూ వేగించుకోవాలి. 7. తర్వాత అందులో జీలకర్ర మరియు పసుపు వేసి వేగించుకోవాలి. 8. ఇప్పుడు అందులో ముందుగా మ్యారినేట్ చేసి పెట్టుకొన్ని మాంసం వేసి బాగా ఫ్రై చేయాలి. 9. అలాగే టమోటో ముక్కలు, రుచికి సరిపడా ఉప్పు, బ్లాక్ పెప్పర్ మరియు పంచదార వేసి ఫ్రై చేయాలి. 10. తర్వాత చికెన్ లేదా మటన్ స్టాక్ వేసి మొత్తం మిశ్రమాన్ని మిక్స్ చేయాలి. 11. ఇప్పుడు మంటను మీడియంగా పెట్టి మొత్తం కర్రీని చిక్కగా ఉడికించుకోవాలి . చికెన్ అయితే చాలా తర్వాగా ఉడుకుతుంది, మటన్ ఉడకడానికి కొద్దిగా సమయం పడుతుంది . మటన్ ఉడికేటప్పుడు మూత పెట్టి ఉడికించుకోవాలి. 12. మటన్ మెత్తగా ఉడికిన తర్వాత , కొద్దిగా గరం మసాల చిలకరించి మిక్స్ చేసి స్టౌ ఆఫ్ చేయాలి . 13. చివరగా కొద్దిగా ఫ్రెష్ కొత్తిమీర ఆకులను సన్నగా తరిగి గార్నిష్ చేయాలి. అంతే రుచికరమైన మటన్ లేదా చికెన్ డ్రై పాల్ రెసిపి రెడీ..

కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)

హైదరాబాద్	395	విజయవాడ	395
ముంబయి	450	ఢిల్లీ	412
చెన్నై	430	బెంగళూరు	425



బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.

హైదరాబాద్	95	ఢిల్లీ	120
కరీంనగర్	100	ముంబయి	115
వరంగల్	105	చెన్నై	115



సెన్సెక్స్ +212.74
36,649



నిఫ్టీ + 62.70
10,893



రూపాయి
₹71.24
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
33,828.90
(ముంబయిలో) 24 క్యా..10 (గ్రాములకు)/(రూ.)లలో

అప్పు రూ.9వేల కోట్లు.. జప్తు రూ.13వేల కోట్లా..?

- ఇదెక్కడి న్యాయం అంటూ ట్వీట్లు చేసిన మాల్యా



ఢిల్లీ: భారతీయ బ్యాంకులకు వేల కోట్ల రుణాలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన ప్రముఖ వ్యాపార వేత్త విజయ్ మాల్యా దర్యాప్తు సంస్థలను ఉద్దేశిస్తూ.. న్యాయం ఎక్కడుంది అంటూ ట్వీట్ చేశారు. తనకు సంబంధించిన దాదాపు రూ.13వేల కోట్ల ఆస్తులను దర్యాప్తు సంస్థలు జప్తు చేశాయని ఆయన వెల్లడించారు. తాను చెల్లించాల్సిన రుణాలు రూ.9వేల కోట్లు కాగా, ఇప్పటికే రూ.13వేల కోట్ల ఆస్తులను జప్తు చేశారని, ఇంకా ఇది ఎంత దూరం వెళ్తుందని ప్రశ్నించారు.

'ప్రతి రోజు ఉదయం తన ఆస్తులను అధికారులు జప్తు చేశారనే వార్తతోనే నిద్ర లేస్తున్నాను. వాటి విలువ ఇప్పటికే రూ.13వేల కోట్లు దాటిపోయింది. తాను చెల్లించాల్సిన రుణం వడ్డీతో సహా రూ.9వేల కోట్లు అని బ్యాంకులు చెప్తున్నాయి. ఇంకా ఈ జప్తు ఎంత దూరం వెళ్తుంది? ఇది న్యాయమేనా?' అని మాల్యా ట్వీట్ చేశారు. బ్యాంకుల కన్సార్టియం తరపున అప్పు రికవరీ ట్రిబ్యునల్‌కు చెందిన అధికారులు ఇటీవల మాల్యా ఆస్తులను జప్తు చేశారు. దీంతో మాల్యా ఈ విధంగా ట్వీట్ చేశారు. భారత్‌లోని అప్పులు సెటిల్ చేసేందుకు బ్యాంకులు ఇంగ్లండ్‌లోని నా డబ్బు కావాలనుకుంటున్నాయని ఆరోపిస్తూ మాల్యా పలు ట్వీట్లు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్థిక నేరగాళ్ల చట్టం కింద పారిపోయిన ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించిన తొలి భారతీయ వ్యాపారి మాల్యా. ఇటీవల ముంబయిలోని ప్రత్యేక న్యాయస్థానం మాల్యాను ఈ విధంగా ప్రకటించింది.

సాధారణ లాభాలతో స్టాక్ మార్కెట్లు

- కీలక రంగాల షేర్లు కుదేలుతో తగ్గిన వేగం
- భారీగా పడిపోయిన డీహెచ్ఎఫ్ఎల్ షేర్లు






ముంబై: దేశీయ మార్కెట్లు శుక్రవారం సాధారణ లాభాలతో ముగిశాయి. మధ్యంతర బడ్జెట్ నేపథ్యంలో అమాంతం ఎగసిన సూచీలు ఆ తర్వాత మదుపర్ల లాభాల స్వీకరణ, కీలక రంగాల షేర్లు కుదేలవడంతో అంతే వేగంగా వెనక్కివచ్చాయి. అయితే లాభాలను మాత్రం నిలబెట్టుకోగలిగాయి. శుక్రవారం నాటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 200 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 10,900మార్క్ చేరువైంది.

బడ్జెట్ అంచనాలతో శుక్రవారం ఉదయం దేశీయ మార్కెట్లు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ 150 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడింగ్‌ను ఆరంభించింది. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం అనంతరం ఒక్కసారిగా సూచీలు దూసుకెళ్లాయి. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో సెన్సెక్స్ 450 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడవ్వగా.. నిఫ్టీ 10,900 పైన కదలాడింది. అయితే సూచీల జోరు ఎంతోసేపు నిలువలేదు. వేదాంతా, డీహెచ్ఎఫ్ఎల్ లాంటి దిగ్గజ షేర్లు భారీగా నష్టపోవడం, మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు భారీ లాభాలను కోల్పోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 30 పాయింట్ల స్వల్ప లాభంతో ఫ్లాట్‌గా కొనసాగింది. చివరకు ఆటోమొబైల్, ఎనర్జీ, ఫార్మా రంగాల షేర్ల అండతో సూచీలు సాధారణ లాభాలను దక్కించుకున్నాయి.మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 213 పాయింట్లు లాభపడి 36,469 వద్ద, నిఫ్టీ 63 పాయింట్ల లాభంతో 10,894 వద్ద స్థిరపడ్డాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 71.25గా కొనసాగుతోంది. ఎన్ఎస్ఈలో హీరోమోటార్స్, మారుతి సుజుకీ, ఐషర్ మోటార్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, డాక్టర్ రెడ్డీస్ షేర్లు లాభపడగా.. వేదాంతా, జీ ఎంటర్‌టైన్‌మెంట్స్, యస్ బ్యాంక్, ఎస్బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టోయాయి.

ఎస్‌బీఐ లాభం రూ. 3,954.81కోట్లు



- ఏడేళ్ల తర్వాత భారీ లాభాలు

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ అతి పెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనాలను మించి రాణించింది. డిసెంబరు 31తో ముగిసిన త్రైమాసికంలో రూ. 3,954.81కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతక్రితం ఇదే ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు నికరలాభం రూ. 2,416.37 కోట్లుగా ఉంది.

కాగా.. గత ఏడేళ్లలో బ్యాంకు అత్యధిక లాభాన్ని ఆర్జించడం ఇదే తొలిసారి. చివరిసారిగా 2012 మార్చి త్రైమాసికంలో ఎస్‌బీఐ రూ. 4,050 కోట్ల నికరలాభాన్ని నమోదుచేసింది. ఇక ఈ త్రైమాసికంలో బ్యాంకు ఏకీకృత ఆదాయం రూ. 74,190.87 కోట్ల నుంచి రూ. 84,350.11కోట్లకు పెరిగింది.

స్థూల నిరర్థక ఆస్తులు 10.35 శాతం నుంచి 8.71శాతానికి తగ్గగా.. నికర నిరర్థక ఆస్తులు 5.61శాతం నుంచి 3.95శాతానికి దిగొచ్చాయి. కాగా.. శుక్రవారం నాటి సెషన్‌లో బ్యాంకు షేర్లు నష్టాలతో ముగిశాయి. మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈలో ఎస్‌బీఐ షేరు ధర 3.76శాతం తగ్గి రూ. 282.60గా ఉంది.

ఎస్‌బీఐ డేటా సేఫ్

ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన పనిలేదు:ఎస్‌బీఐ

ఎస్‌బీఐలో ఖాతాదారుల డేటాలీక్ అయ్యిందంటూ వచ్చిన కథనాలపై ఎస్‌బీఐ స్పందించింది. ఖాతాదారులకు సంబంధించి ఎటువంటి సమాచారం బయటకి పోలేదని , కష్టమర్ల డేటా అంతా చాలా సేఫ్‌గా ఉందని తెలిపింది. పత్రికల్లో వచ్చిన కథనాలను తాము సీరియస్‌గా తీసుకుని ఈ ఘటనపై విచారిస్తున్నాం అని తెలిపింది. ఎస్‌బీఐ లో ఖాతాదారుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం...ఖాతాదారులు ఈ వదంతులు నమ్మవద్దు అంటూ ఎల్.ఎస్.ఎస్.వి.డి. హనుమంత రావ్(అసిస్టెంట్ జనరల్ మేనేజర్, పీఆర్ అండ్ సీఎస్‌బీ) తెలిపారు

ఇన్‌కం టాక్స్ పరిమితి పెరుగుదల వేతన జీవులకు ఊరటేనా..?

- కొత్త అంశాన్ని తెరపైకి తెస్తున్న ఆర్థిక నిపుణులు

ఢిల్లీ: మరో రెండు నెలల్లో రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటర్లను ఆకర్షించేందుకే మోడీ ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను రూపొందించిందంటూ ఒక వైపు విపక్షాలు విమర్శలు చేస్తుంటే..ఆర్థిక నిపుణులు మరో అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. 'ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్' లో వేతన జీవులకు భారీ ఊరటగా పరిగణిస్తున్న 'ఆదాయపన్ను మినహాయింపు పరిమితి పెరుగుదల' లో ఉన్న అసలు నిజాన్ని గమనించాలన్న వాదన వినిపిస్తున్నారు. శుక్రవారం నాడు ఆర్థిక మంత్రి గోయల్ చేసిన పన్ను మినహాయింపు ప్రకటన ప్రకారం రూ. 5 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్నపుడు మాత్రమే పూర్తిగా పన్ను మినహాయింపు లభిస్తుంది. ఒకవేళ ఈ పరిమితి రూ. 5 లక్షలను దాటిన పక్షంలో పన్నుకు అర్హమైన ఆదాయాన్ని.. ప్రస్తుత స్లాబ్ రేట్లను అనుసరించి టాక్స్ వసూలు చేస్తారు.ఉదాహరణకు ఒక వ్యక్తి వార్షికాదాయం రూ. 6 లక్షలు అనుకుందాం.

అలాంటి తరుణంలో పై లక్ష రూపాయలు మాత్రమే పన్నుకు అర్హమైన ఆదాయం అనుకుంటే పప్పులో కాలేసినట్లే. ఎందుకంటే ప్రస్తుతం ఉన్న స్లాబ్ రేట్ల ప్రకారం... రూ. 2.5 లక్షలు రూ. 5 లక్షల వరకు ఆదాయం ఉన్నట్లయితే దానిపై 5 శాతం పన్ను విధిస్తారు. అంటే 12,500 రూపాయలు అన్నమాట. ఒకవేళ రూ. 5 లక్షలకు పైబడి ఒక్కరూపాయి ఉన్నాసరే మిగిలిన లక్ష రూపాయల మొత్తానికి 20 శాతం అంటే రూ. 20 వేలు కట్టాల్సి ఉంటుంది. అంటే 12,500 రూపాయలకు అదనంగా మరో 20 వేలు మొత్తంగా 32,500 రూపాయలు పన్ను రూపంలో సమర్పించుకోవాల్సి ఉం టుంది. దీన్ని బట్టి పన్నుకు అర్హమైన ఆదాయపు పరిమితి ఇప్పటికీ రెండున్నర లక్షలుగానే ఉన్నట్లు కదా. ఇందులో వేతన జీవులు అంతగా సంతోషించదగ్గ విషయం ఏమీ లేదని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఆదాయ పన్ను చట్టంలోని ఎనిమిదవ క్లాజ్ సెక్షన్ 87ఏకు చేసిన సవరణ ద్వారా మూడు లక్షలకు రూ. 2500లుగా ఉ న్న టాక్స్ రిబేటును సవరించి ఆదాయ పరిమితిని 5 లక్షల రూపాయలకు పెంచారు. కాగా ప్రస్తుతం ఉన్న స్లాబ్ రేట్ల ప్రకారం.. ఆదాయం రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షలలోపు ఉన్నట్లయితే 12,500 రూపాయల పన్ను విధిస్తారన్న సంగతి తెలిసిందే.

Salary	5 lakh	5 lakh	7.5 lakh	7.5 lakh	20 lakh	20 lakh
Std deduction	40,000	50,000	40,000	50,000	40,000	50,000
Net total income	4.6 lakh	4.5 lakh	7.1 lakh	7 lakh	19.6 lakh	19.5 lakh
Tax	10,500	10,000	54,500	52,500	3,00,500	2,97,500
Net tax	10,500	NIL	54,500	52,500	3,00,500	2,97,500
Surcharge						
Edu cess	420	NIL	2,180	2,100	12,020	11,900
Total tax	10,920	NIL	56,680	54,600	3,12,520	3,09,400
Tax savings	--	10,920	--	2,080		3,120

స్పోర్ట్స

భువనగిరి పార్లమెంట్ ప్రీమియర్ లీగ్

విజయక్రాంతి, హైదరాబాద్: భువనగిరి పార్లమెంట్ నియజకవర్గం లో భువనగిరి పార్లమెంట్ ప్రీమియర్ లీగ్ బీపీపీఎల్ లీగ్ నిర్వహిస్తున్నామని టీకాంగ్రెస్ కోశాధికారి గూడూరు నారయణ రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 10 నుండి 22 వరకు ట్వంటీ ట్వంటీ క్రికెట్ టోర్నమెంట్ జరుపుతున్నామన్నారు. భువనగిరి పార్లమెంట్ 7అసెంబ్లీ నియోజకవర్గాలలో, మునుగోడు సూపర్ కింగ్స్, జనగామా ఛాలెంజర్స్, ఆలేరు సన్ రైజర్స్, భోనగిరి లయన్స్, యాదగిరి గుట్ట రాయల్స్, నకిరేకల్ వారియర్స్, ఇబ్రహీంపట్నం రైడర్స్,అనీ 8 టీములను సెలెక్ట్ చేస్తున్నామని తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు మాజీ ఇండియన్ క్రికెట్ టీమ్ కెప్టెన్ అజారుద్దీన్ అధితిగా వస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా సీనియర్ క్రికెటర్స్ కూడా ఆహ్వానిస్తున్నామన్నారు. గ్రామాల్లో యువతను ప్రోత్సహించడానికి ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, గ్రామీణ



యువతలో నైపుణ్యాన్ని గుర్తించి పైకి తీసుకురావడానికి ఈ ప్రయత్నం అన్నారు. ఉచితంగా క్రికెట్ యూనిఫామ్,కిట్స్, జీఎన్ఆర్ ఫౌండేషన్ ద్వారా అందజేస్తామని గూడూరు తెలిపారు. ఇప్పటివరకు సీసీఎల్, ఐపీఎల్, ఐసీఎల్ మాత్రమే జరిపారని, ప్రైవేట్ గా అంతర్జాతీయ స్థాయి స్టాండర్స్ తో జరుపుతున్న మొదటి క్రికెట్ లీగ్ అన్నారు.. మ్యాన్ ఆఫ్ ద సిరీస్ రూ, 25వేలు ,మాన్ ఆఫ్ ద మ్యాచ్ రూ.20 వేల పారితోశకాలతో పాటు మొదటి స్థానంలో వచ్చిన టీమ్ కు లక్ష యాభైవేలు, రెండవ స్థానం లో లక్ష రూపాలు, మూడవ, నాలుగవ స్థానంలో వచ్చిన టీమ్ కు యాభైవేలు బహుమతి అందజేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

శ్రీలంక జట్టుపై అర్జున రణతుంగ సంచలన వ్యాఖ్యలు

కొలంబో: శ్రీలంక మాజీ క్రికెటర్, ప్రస్తుత రవాణాశాఖ మంత్రి అర్జున రణతుంగ శ్రీలంక జట్టుపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. శ్రీలంక క్రికెట్ సంక్షోభం దిశగా పయనిస్తుందని, ఆటగాళ్ల బృందంలో స్ఫూర్తి కొరవడిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. బోర్డు సభ్యుల్లో అవినీతి ఎక్కువైందని, మ్యాచ్ ఫిక్సింగ్ కుంభకోణాలు, అనుమానాలతో ఐసీసీ వరుసగా దర్యాప్తులు నిర్వహిస్తోందని అన్నారు. ఆటగాళ్లు ఒకరిపై మరొకరు బాహాటంగానే విమర్శించుకుంటున్నారని తెలిపారు. వన్డే ప్రపంచకప్ కోసం మేలో ఇంగ్లాడ్ వెళ్లనున్న శ్రీలంక జట్టు ఘోరపరాభవాన్ని ఎదుర్కోనుందని అర్జున రణతుంగ అభిప్రాయం వ్యక్తం చేశారు. బోర్డులో అవినీతి జరుగుతోందని, ఆటగాళ్లలో స్ఫూర్తి కొరవడిందని రణతుంగ అన్నారు. ప్రస్తుతం జట్టు ఘోర వైఫల్యాలకు జాతీయ క్రికెట్ బోర్డు, కొంతమంది ఆటగాళ్లే కారణమని పేర్కొన్నారు. ఆటగాళ్లలో క్రమశిక్షణ పెంపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఫలితాలను చూస్తుంటే రానున్న ప్రపంచకప్ లీగ్‌దశలోనే శ్రీలంక జట్టు వెనుదిరిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. జట్టులో ప్రేరణ పెంపొందించి మానసికంగా బలవంతులుగా మార్చేందుకు శిక్షణ ఇవ్వాలని రణతుంగ సూచించారు. జట్టులోని కొంతమంది ఆటగాళ్లు దేశం కోసం కాకుండా తమ వ్యక్తిగత లాభం కోసం ఆడుతున్నారని విమర్శించారు. జట్టులో అలాంటి ఆటగాళ్లకు చోటు కల్పించకూడదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీలంక టీ20 సారథి, పేస్ బౌలర్ లసిత్ మలింగ, తాత్కాలిక కెప్టెన్ తిసార పెరీరా సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత విమర్శలు చేసుకుంటున్నారని, లంకబోర్డు వీరిని హెచ్చరించకపోవడం గమనార్హమని ఆయన తెలిపారు.

క్లీన్ స్వీప్ మిస్..

- చివరి వన్డేలో ఓడిన మిథాలీసేన
- 2–1 తేడాతో భారత మహిళా క్రికెట్ జట్టు సిరీస్ కైవసం





హామిల్టన్: వరుస విజయాలతో జోరుమీదున్న మిథాలీ రాజ్ సేనకు న్యూజీలాండ్ మహిళలతో జరిగిన మూడో వన్డేలో బ్రేక్ పడింది. ఇప్పటికే రెండు మ్యాచ్‌లను గెలిచి సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేద్దామనుకున్న భారత మహిళా జట్టుకు మూడో వన్డేలో ఓటమి తప్పలేదు.. భారత్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో కివీస్ జట్టు ఘనవిజయం సాధించింది. దీంతో న్యూజిలాండ్ జట్టు మిథాలీసేనను సిరీస్ క్లీన్‌స్వీప్ చేయకుండా అడ్డుకుంది. మిథాలీ సేన చివరి వన్డేలో మాత్రం అన్ని విభాగాల్లో విఫలమైంది. దీంతో టీమిండియా నిర్దేశించిన 150 పరుగుల సునాయాస లక్ష్యాన్ని ఆతిథ్యజట్టు 29.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. కివీస్ స్టార్ బ్యాట్స్ ఉమెన్ సజై బేట్స్ (57; 64 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్సర్), కివీస్ సారథి సాటర్త్ వెయిట్ (66 నాటౌట్; 74 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్సర్)లు అర్థ సెంచరీలు సాధించి విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇక చివరి వన్డేలో టీమిండియాను స్వల్ప స్కోరుకే కట్టడి చేయడంలో కీలకపాత్ర పోషించిన కివీస్ బౌలర్ పీటర్సన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', సిరీస్‌లో విశేషంగా రాణించిన స్మృతి మంధానా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు గెలుచుకున్నారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఉమెన్స్ జట్టు కివీస్ బౌలర్ అన్నా పీటర్సన్ (4/21) ధాటికి 149 పరుగులకు ఆలౌటైంది. అంతకుముందు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న కివీస్ జట్టు టాప్ ఆర్డర్‌ను దెబ్బతీసింది. తొలి రెండు వన్డేల్లో అదరగొట్టిన స్మృతి మంధాన (1), రోడ్రిగ్స్ (12), మిథాలీ (9)లు ఈ మ్యాచ్‌లో పూర్తిగా విఫలమయ్యారు.దీంతో 39 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.



ఈ క్రమంలో దీప్తి శర్మ, హర్మన్ ప్రీత్ కౌర్‌లు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. నాలుగో వికెట్‌కు 48 పరుగులు జోడించారు. అనంతరం హర్మన్ ప్రీత్ కౌర్‌ను పీటర్సన్ పెవిలియన్‌కు పంపించింది. ఓ వైపు వికెట్లు పడుతున్నా.. జట్టును దీప్తి శర్మ ఆదుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో అర్థసెంచరీ పూర్తి చేసుకున్న దీప్తి శర్మ(52) కూడా పీటర్సన్ బౌలింగ్‌లోనే వెనుదిరిగింది. చివర్లో హేమలత(13), గోస్వామి(12)లు రాణించడంతో టీమిండియా గౌరవ ప్రదమైన స్కోరును చేసింది. కివీస్ బౌలర్లలో పీటర్సన్ నాలుగు, లీ తహుహు మూడు వికెట్లతో టీమిండియా పతనాన్ని శాసించారు. అనంతరం 150 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ జట్టు 29.2 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్లు సుజీ బేట్స్, లారెన్ డౌన్‌లు చక్కటి శుభారంభాన్ని అందించారు. 7వ ఓవర్‌లో 10 పరుగుల వద్ద లారెన్ రనౌట్ అయ్యింది. అనంతరం వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన సాటర్త్ వెయిట్‌తో కలిసి బేట్స్ చక్కటి ఇన్నింగ్స్ ఆడింది. వీరిద్దరూ అర్థసెంచరీలతో జట్టును విజయతీరాలకు చేర్చారు. రెండో వికెట్‌కు 106 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. సాటర్త్ వెయిట్ 66 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. ఓపెనర్ బేట్స్ 21వ ఓవర్‌లో 57 పరుగుల వద్ద ఔటవ్వడంతో న్యూజిలాండ్ రెండో వికెట్‌ను కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన డివైనీ కెప్టెన్‌తో కలిసి జట్టుకు విజయం అందించింది. భారత బౌలర్లలో పూనమ్ యాదవ్ ఒక వికెట్‌ను దక్కించుకుంది.

మిథాలి @ 200 నాటౌట్

- 200 వన్డేలు ఆడిన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డు
- సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నా..
- నా దృష్టంతా ఎప్పుడూ ఆటను మెరుగుపరచుకోవడంపైనే: మిథాలీరాజ్

హామిల్టన్: భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ మిథాలీరాజ్ సరికొత్త రికార్డును నెలకొల్పింది. మహిళల వన్డే క్రికెట్ చరిత్రలో 200 వన్డేలు ఆడిన తొలి మహిళా క్రికెటర్‌గా చరిత్ర సృష్టించింది. న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేతో కెరీర్‌లో 200 వన్డేల మైలురాయిని అందుకున్న మిథాలీరాజ్ తాను ఈ సుధీర్ఘ ప్రయాణాన్ని ఊహించలేదని వెల్లడించింది.1999 జనవరి 25న ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగ్రేటం చేసిన మిథాలీ రాజ్ 200 వన్డేలు ఆడి 51.33 సగటుతో 6,622 పరుగులు సాధించింది. కాగా ఇందులో ఏడు శతకాలు ఉండగా.. 52 అర్ధసెంచరీలు నమోదు చేసింది. ఈ 200 వన్డే మ్యాచ్‌లలో 180 సార్లు బ్యాంటింగ్‌కు వెళ్లిన ఆమె ఏకంగా 51 సార్లు నాటౌట్‌గా నిలిచింది. అయితే న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో 28 బంతులు ఎదుర్కొన్న మిథాలీరాజ్ 9 పరుగులు మాత్రమే చేసింది. మ్యాచ్ అనంతరం ఆమె మాట్లాడుతూ... "నేను క్రికెట్ కెరీర్‌ని ప్రారంభించినప్పుడు ఇంత సుధీర్ఘంగా భారత జట్టుకు ఆడుతానని ఊహించలేదని ఆమె తెలిపింది. కెరీర్‌లో నాతొలి లక్ష్యం భారత జెర్సీని ధరించి దేశం తరపున ఆడాలని, ఆ తర్వాత టీమ్‌లో ప్రధాన క్రికెటర్‌గా ఎదగాలని నిర్దేశించుకున్నాని, కానీ ఇన్నేళ్లు ఆడాలని మాత్రం ఎప్పుడూ అనుకోలేదని ఆమె తెలిపింది. సుధీర్ఘ కెరీర్‌లో ఎత్తుపల్లాలు మామూలేనని, వాటిని పట్టించుకోకుండా నా ఆటకి మెరుగులు దిద్దుకునేందుకు ప్రతి నిమిషం శ్రమించానని పేర్కొంది.



Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal - Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD-500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.